1993-2013 నడుస్తున్న చరిత్ర

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఫిబ్రవరి 2017

సంపుటి : 2
సంచిక : 12
రు. 20/-లు
తెనాలి

అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం-ఎల్లనాడుల అమ్మనుడి పండుగ
ఫిబ్రవరి 21 : శుభాకాంక్షలు




ప్రాథమిక విద్యను మాతృభాషామాధ్యమంలోనే నేర్పాలని, ఎక్కువ భాషలు నేర్పేందుకూ నాణ్యమైన విద్యను అందించేందుకూ ఇదే సరైన దారి అని యునెస్కో స్పష్టంగా ప్రకటించింది. 2017 మాతృభాషాదినోత్సవ సందేశమూ ఇదే. ఇకనైనా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వినిపించుకుంటాయా?

ప్రాథమిక విద్యలో రాష్ట్రమంతటా మాతృభాషే మాధ్యమంగా ఉండాలి.

పురపాలకశాఖ వారి జి.ఒ.నెం.14/ ఫిబ్రవరి 2017ను పూర్తిగా రద్దు చెయ్యాలి.

# ఫిబ్రవరి 19న విజయవాడలో నిరశన దీక్షలో పాల్గొనండి..

# పిలుపు

పాలకులు ప్రజలభాషలను దినదినానికి అధోగతి పట్టిస్తున్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితో, విద్యాహక్కు చట్టం 5వ విభాగం 29(2)లో పొందుపరచిన లక్ష్యాలను (ముఖ్యంగా మాతృభాషా మాధ్యమం గురించి) నెరవేర్చవలసిన బాధ్యత రాష్ట్రప్రభుత్వం మీద ఉండగా, వాటిని నెరవేర్చకపోగా, పిల్లల వికాసానికి గొడ్డలిపెట్టుగా పరిణమించే ఆంగ్లమాధ్యమాన్ని ప్రాథమిక స్థాయినుండే ప్రవేశపెట్టాలనుకోవడం గర్హనీయం. 1980 నుండి విజృంభిస్తున్న ప్రైవేటు ఆంగ్లమాధ్యమ పాఠశాలలు దురదృష్టకరమైన ఆంగ్లవ్యామోహాన్ని సృష్టించాయి. ప్రజాఉద్యమాలు వ్యాపార రంగంలో విద్యను, ఆంగ్లమాధ్యమాన్ని నిరసించినా, నిలువరించలేకపోవడం వలన అశాస్త్రీయమైన, అప్రయోజకరమైన, అనర్థదాయకమైన ఆంగ్లమాధ్యమం ఒక మహమ్మారిగా తెలుగు సమాజాన్ని ఆవహించింది. 2006లో వచ్చిన 76 జి.వో.ద్వారా ప్రభుత్వరంగ ఉన్నత పాఠశాలలలో ఆంగ్లమాధ్యమాన్ని సమాంతరంగా ప్రవేశపెట్టారు. 2014లో విడుదల అయిన జి.వో.53 ద్వారా అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తివేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఉద్యమాల వత్తిడివలన ఆ ప్రయత్నం తాత్కాలికంగా ఆగింది. ఈ సంవత్సరం జనవరి 2న పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ విడుదలచేసిన జి.వో.14 ద్వారా మున్సిపల్ పాఠశాలలలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలలో మాతృభాషా మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తివేసి ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేశారు. వ్యతిరేకత రావడంతో అమలును వచ్చేసంవత్సరానికి వాయిదావేశారు. ఈ జి.వో.ను మనం వ్యతిరేకిస్తున్నాము. అయితే, ఈ సమస్యను మూలంనుంచే మనం పెకలించవలసి ఉంది. ఇందుకు మనం శాయశక్తులా ప్రయత్నిద్దాం. ఇప్పుడు కాకపోతే మనం ఎప్పటికీ చేయలేం.

తెలుగు భాషోద్యమ సమాఖ్య, విద్యా వికాస వేదిక, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, ఇంకా మరికొందరు విద్యారంగ నిపుణులు జనవరి 20న విజయవాడలో సమావేశమై 'మాతృభాషా మాధ్యమ వేదిక' ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలలో మాతృభాషా మాధ్యమం అవసరమని నమ్మి కృషిచేసేవారు, పరితపించేవారందరితో ఒక నిరసన శిబిరాన్ని, నిరాహార దీక్షను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దాని ద్వారా ఈ రాష్ట్రంలో మేధావులు ఆంగ్లమాధ్యమాన్ని వ్యతిరేకిస్తున్నారని, మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేయాలని కోరుతున్నారని ప్రభుత్వానికి గట్టిగా తెలియజేయాలని తలపెట్టారు. **ఈ శిబిరం ఫిబ్రవరి 19 ఆదివారం విజయవాడలో– అలంకార్ టాకీస్ దగ్గర ధర్నాచౌక్‌లో ఉ.10 గం॥ నుండి సా.5 గం॥ వరకు జరుగుతుంది. ఈ వేదిక ఆశయంతో ఏకీభవించే సంస్థలు, వ్యక్తులు నిరశన దీక్షలో పాల్గొనవలసినదిగా ఆహ్వానిస్తున్నాము.**

**డిమాండ్లు :**

1. **అన్ని మునిసిపల్ పాఠశాలల్లో తెలుగుమాధ్యమాన్ని తొలగించి, పూర్తిగా వాటిని ఇంగ్లీషు మాధ్యమం లోకి మార్చుతూ జనవరి 2న ఇచ్చిన జి.వో. నెం.14 ను తక్షణమే రద్దు చెయ్యాలి.**
2. **ప్రాథమిక స్థాయిలో తప్పనిసరిగా విద్యార్థుల మాతృభాషా మాధ్యమంలోనే విద్యను గరపాలి. ఇది రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలకింద నడుస్తున్న అన్ని పాఠశాలలకు వర్తించాలి.**
3. **ఉన్నత పాఠశాలలలో మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించాలి. ఆంగ్ల మాధ్యమ విభాగాలను కోరినవారికి నిర్వహించవచ్చు.**
4. **మొత్తం విద్యారంగంలో ప్రభుత్వ భాషావిధానాన్ని స్పష్టంగా ప్రకటించాలి.**

**ఉపాధ్యాయులు, కళాకారులుతో సహా అన్ని రంగాలలోని మేధావులు, నిపుణులు, రచయితలు,**
**కళాకారులు, భాషోద్యమకారులు అందరూ ఉద్యమంలో పాల్గొనాలని కోరుతున్నాం.**
**కనీసం ప్రాథమిక విద్యలో మాతృభాషా మాధ్యమాన్ని కాపాడుకోవడానికే ఈ ఉద్యమం.**
**ఇది ప్రారంభం మాత్రమే!**

**విఠపు బాలసుబ్రహ్మణ్యం,**
ఎం.ఎల్.సి. 94900 98912
**e.mail:** vbsjvv@gmail.com

**డా॥సామల రమేష్‌బాబు,** 98480 16136
**e.mail:** ammanudi@gmail.com

**ఎస్.ఆర్.పరిమి,** 94906 35846
**e.mail:** parimi@gmail.com

**డి.రమేష్‌పట్నాయక్,** 94409 80396
**e.mail:** drameshptk@gmail.com

ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846, **e.mail:** guraohyd@gmail.com

**మాతృభాషామాధ్యమ వేదిక**



## పాల్కురికి సోమన

**'తెలుగు మాటలనంగ వలదు**
**వేదముల కొలదియకాజూడు'**

12వ శతాబ్దంలో శైవ మతవ్యాప్తికోసం కంకణం కట్టుకొన్న శివకవులలో అగ్రేసరుడైన పాల్కురికి సోమన అన్న పంక్తులివి. ఆ రోజుల్లో సంస్కృతానికే ప్రాధాన్యం. చసంస్కృతంలో పాండిత్యం ఉన్నవాడూ, సంస్కృతంలో రచనలు చేసేవాడూ మాత్రమే గొప్ప కవిగా ఆదరణ పొందేవాడు.

పాల్కురికి సోమన శైవమతం ప్రజలలోకి వెళ్ళాలన్నదీక్షతో కలంపట్టినవాడు. అందుకోసం ప్రజలభాష అయిన తెలుగులో (సంస్కృతంలో కూడా) చాలా రచనలు చేశాడు. బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, వృషాధిప శతకం మొదలైనవి. సోమన తెలుగులో కవిత్వం రాస్తున్నప్పుడు పండితులు "తెలుగులోనా? తెలుగా?!" అని హేళనచేసి వుంటారు. ఆ కాలంలో అలా ఈసడించటం సహజం కూడా ! అందుకని సోమనకు ఒళ్ళు మండింది. నా తెలుగును ఇలా అవమానిస్తారా? అని దిగులు చెందాడు. అప్పుడన్నదే ఈ మాట.

"తెలుగా! అని చిన్నచూపువద్దు. దీనిని మీ వేదాలలాగా చూడండి"

ఇలా అనటానికి అప్పుడు ధైర్యం (దమ్ము) ఉండాలి. నా తెలుగు వేదం వంటిదే అన్న తొలి తెలుగు కవి సోమన. మనం ఇవాళ ఇలా అనలేని దుస్థితిలో ఉన్న సంగతులు తెలుసు మనకి. కాబట్టి 12వ శతాబ్దంలోనే తెలుగు-జాను తెనుగు అంటూ ప్రజల భాషకి ప్రాధాన్యమిచ్చిన తెలుగు భాషా సంస్కర్తల్లో ఆద్యుడు పాల్కురికి సోమన.

"వెంటాడే వాక్యాలు"
– డా॥ద్వా.నా. శాస్త్రి



ప్రాథమిక విద్యను మాతృభాషామాధ్యమంలోనే నేర్పాలని, ఎక్కువ భాషలు నేర్పేందుకూ, నాణ్యమైన విద్యను అందించేందుకూ ఇదే సరైన దారి అని యునెస్కో స్పష్టంగా ప్రకటించింది. 2017 మాతృభాషా దినోత్సవ సందేశమూ ఇదే. ఇకనైనా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వినిపించుకుంటాయా?

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదకహృదయం :** | అమ్మనుడిలో బోధనే అందలానికి తొలిమెట్టు | -డా॥సామల రమేష్‌బాబు | 7 |
| **ఇదీ సంగతి :** | తెలుగుదేశం పార్టీ భాషావిధాన ప్రకటన | | 8 |
| **చర్చ :** | కూడు పెట్టేది ఇంగ్లీష్ కాదు..నైపుణ్యమే | -డా॥దాసరి రామకృష్ణప్రసాదు | 9 |
| **చర్చ:** | సొంత భాషే ఎందుకు | -డా॥పుచ్చలపల్లి మిత్ర | 10 |
| **చర్చ:** | అమ్మభాషను హరించే కుట్రలు | -డా॥నూకతోటి రవికుమార్ | 12 |
| **సాహిత్యరంగం :** | మనం మనం బరంపురం | -డా॥మధురాంతకం నరేంద్ర | 14 |
| **కంప్యూటర్ :** | నెట్‌బ్యాంకింగ్ ఏటియంలలో సేవలు | -రహ్మానుద్దీన్ షేక్ | 17 |
| **ముఖాముఖి:** | పాపినేని శివశంకర్‌తో ముఖాముఖి | -నార్నె సురేష్‌బాబు | 18 |
| **పిట్టచూపు :** | అసంబద్ధ చర్యలు...అవినీతి పరిణామాలు | -డా॥చలసాని నరేంద్ర | 21 |
| **శ్రద్ధాంజలి :** | మాట కరుకు-మనసు మెత్తన | -డా॥వావిలాల సుబ్బారావు | 27 |
| **శ్రద్ధాంజలి :** | బౌద్ధ రచనల అగ్రగణ్యుడు | -బొర్రా గోవర్ధన్ | 28 |
| **తెలుగులెంక సూక్తులు :** | | -డా॥నాగభైరవ ఆదినారాయణ | 30 |
| **ఓ సంచారి అంతరంగం :** | ధారావాహిక | -టి.ఎస్.రామచంద్రరావు | 31 |
| **సాహిత్యం :** | చిత్ర కవిత్వం | -ప్రయాగ కృష్ణమూర్తి | 34 |
| **నుడి కూర్పు:** | ప్రత్యామ్నాయ పదకల్పనం | -వెలుదండ నిత్యానందరావు | 39 |
| **మన రాజులు -బిరుదులు :** | కళ్యాణ చాళుక్యులు | -డా॥ఈమని శివనాగిరెడ్డి | 41 |
| **ఆదర్శం :** | ఈ కాలపు జాతిరత్నం-రాజీవ్ దీక్షిత్ | -వుప్పల నరసింహం | 43 |
| **పుస్తక పరిచయం :** | ... | -మందరపు హైమవతి | 44 |
| **గౌతమీపుత్ర శాతకర్ణి :** | | -సంకేపల్లి నాగేంద్రశర్మ | 45 |
| **కవితలు** | రెక్క | -డా॥రమణ యశస్వి | 13 |
| | మరణాక్షర శాసనం | -పి.లక్ష్మణరావ్ | 30 |


కైసేత, ముఖచిత్ర అలంకరణ : **కలిమిశ్రీ**
ఫొటోలు : **తమ్మా శ్రీనివాసరెడ్డి**
కథలకు బొమ్మలు : **చిదంబరం** పకపకలు : **సరసి**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా
**డాక్టర్ సామల రమేష్‌బాబు**, సంపాదకుడు, **అమ్మనుడి,**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520004.
దూరవాణి: కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136
e-mail : editorammanudi@gmail.com



పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం.
వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

• నుడి • నాడు • నెనరు

సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు

శాలివాహన శకం 1938 : దుర్ముఖినామ సంవత్సర మాఘ

*(ఏరిమాపి) శుద్ధ పంచమి బుధవారం మొదలు

ఫాల్గుణ*(వేగాపి) శుద్ధ విదియ మంగళవారం వరకు

* ఏరిమాపి * ఏగాపి : తెలుగు నెలలు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.



శ్రద్ధాంజలి

## కీ. శే. ముక్కాల రాజ గోపాలరావు గారు

**బు**ద్ధుడి గురించీ బౌద్ధాన్ని గురించీ సమగ్రంగా విశ్లేషించి చెప్పగల, వ్రాయగల సాధికారత గల తెలుగువాడు, తత్త్వశాస్త్ర పండితుడు ముక్కాల రాజగోపాలరావుగారు. వారి కుమా రులు శ్రీ విజయకుమార్ గారు జనవరి 13న ఫోన్‌చేసి నాన్న గారు కన్నుమూశారని చెప్పగానే నివ్వెరపోయాను. కొద్దిసంవత్సరాలుగా అనారోగ్యం ఎంతోకొంత ఆయనను బాధపెడుతూనే ఉందని నాకు తెలుసు. 83వ ఏడు నడుస్తూ ఉంది ఇప్పుడు. (1933 మార్చి 22 పుట్టినరోజు). రాజగోపాలరావు గారి నిర్యాణంతో తెలుగువాళ్ళం ఒక తత్త్వశాస్త్ర అధ్యాపక నిపుణుడిని, బౌద్ధవిజ్ఞానిని కోల్పోయాం.

నడుస్తున్న చరిత్రలో బౌద్ధంపై ఆయన వ్రాసిన వ్యాసాలు ఎన్నో పుస్తకరూపంలో వెలుగుచూశాయి. ఆయన రచనలవల్ల నడుస్తున్న చరిత్రకు ఎంతో గౌరవం, విలువ చేకూరాయి. ఎప్పుడూ ఆయన నాకు నైతిక బలాన్ని, విజ్ఞానాన్ని అందిస్తూండేవారు. ఆయనమరణం నాకు, పత్రికకు తీరనిలోటు.

గుంటూరుజిల్లా రావిపాడులోని ముక్కాల చెల్లయ్య, తిరుపతమ్మ దంపతులకు జన్మించిన రాజగోపాలరావుగారు తన 23వ ఏటనే గుంటూరు ఎ.సి.కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగ జీవితం మొదలుపెట్టారు. నిరంతర అధ్యయనం, రచనా వ్యవసాయం, అధ్యయనం ముప్పేటగా సాగిన జీవితం రాజగోపాలరావు గారిది. ఎవరితోనూ మొహమాటంలేని, నిష్కపటిగా, జ్ఞానప్రతినిధిగా గడిపిన జీవితం ఆయనది. ఎన్నో సదస్సుల్లో తెలుగు, ఇంగ్లీష్‌లలో పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఎన్నో పుస్తకాలు వ్రాశారు. భారతీయదర్శనం, భారతీయ, పాశ్చాత్య సమకాలిక దర్శనాలు, పరిణామ పరిశీలన, తత్త్వశాస్త్ర నిఘంటువు, తర్కశాస్త్రము, జైన ధర్మము, ఇంకా ఎన్నో పుస్తకాలు ఆయన జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. బౌద్ధంపై తొమ్మిది పుస్తకాలు రాశారు. (వాటిలో కొన్నిటిని గురించి శ్రీ బొర్రా గోవర్ధన్ వ్యాసాన్నీ, శ్రీ వావిలాల సుబ్బారావుగారి ప్రత్యేక వ్యాసాన్నీ ఈ సంచికలో 27,28,29 పుటలలో చూడండి)

రాజగోపాలరావు గారి శ్రీమతి ఒక దశాబ్దం క్రిందటే కాలం చేశారు. వారి కుమారులు కొంత శ్రద్ధవహించి ఆయన రచనలను పూర్తిగా అందుబాటులోకి తెస్తారని ఆశిస్తున్నాను.

**-సామల రమేష్‌బాబు,** సంపాదకుడు.



# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం-2017

## ఫిబ్రవరి 21 : పిలుపు

2003 ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నాడు 'తెలుగు భాషోద్యమ సమాఖ్యను స్థాపించడంతో తెలుగునేలపై భాషోద్యమ స్ఫూర్తి వెల్లివెరిసింది. నాటినుండి తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రభుత్వాన్ని అనేక సమస్యలపై నిగ్గదీసి ఫలితాలను రాబట్టింది. 1 నుండి 10వ తరగతి వరకు తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేసిన జి.ఒ.86(2003), తెలుగుకు మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసిన జి.ఒ.ఎం.909 (2013)లతో సహా ఎన్నో కీలక నిర్ణయాలను, మార్పులను రాబట్టింది.

తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ- రెండు రాష్ట్రాల్లోనూ ఏర్పడినా, వాటిముందు ప్రత్యేక కార్యక్రమమేమీ లేనందున అవి లాంఛనంగా ఉన్నాయి. మనం తొలినుంచీ కోరుతున్నట్లు తెలుగు అభివృద్ధి ప్రాధికార సంఘాన్ని (డెవలప్‌మెంట్ అథారిటీ) నిపుణులతో నియమించమని మళ్ళీ మూడేళ్ళపాటు ప్రభుత్వం వెంటపడగా చివరికి 2016 తెలుగు భాషాదినోత్సవం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అందుకోసం ఒక తగు సిఫారసులను చేయమని కోరుతూ ఒక కమిటీని ఏర్పాటుచేశారు. వారి నివేదిక కొద్దిరోజులలోనే వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ లోపుగా ఆం.ప్ర.పురపాలక మంత్రిత్వశాఖ తమకింద ఉన్న అన్ని పాఠశాలలో ప్రాథమిక విద్యతో సహా ఇంగ్లీషు మాధ్యమానికి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దాన్ని మనమూ, మనతోపాటు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయి. ఈ ఏడాదికిఅది ఆగినా వచ్చే విద్యాసంవత్సరం నుంచి తప్పక అమలు చేస్తామని సంబంధిత మంత్రి ప్రకటించారు. దీన్ని శాశ్వతంగా ఎదుర్కోవలసి ఉంది. అందుకోసం మనం ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ప్రత్యేకంగా మాతృభాషా మాధ్యమాన్ని కాపాడుకోవడం కోసమే "మాతృభాషా మాధ్యమ వేదిక' ను ఏర్పరిచాము. ఫిబ్రవరి 19న విజయవాడలో జరుగబోయే నిరాహార దీక్షను మనం విజయవంతం చెయ్యాలి.

**2017 ఫిబ్రవరి 21 కార్యక్రమం**

1. **అన్ని మునిసిపల్ పాఠశాలల్లో తెలుగుమాధ్యమాన్ని తొలగించి, పూర్తిగా వాటిని ఇంగ్లీషు మాధ్యమంలోకి మార్చుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జనవరి 2న ఇచ్చిన జి.వో. నెం.14 ను తక్షణమే రద్దు చెయ్యాలి.**
2. **ప్రాథమిక స్థాయిలో తప్పనిసరిగా విద్యార్థుల మాతృభాషా మాధ్యమంలోనే విద్యను గరపాలి. ఇది రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలకింద నడుస్తున్న అన్ని పాఠశాలలకు వర్తించాలి.**
3. **ఉన్నత పాఠశాలలలో మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించాలి.**
4. **మొత్తం విద్యారంగంలో ప్రభుత్వ భాషావిధానాన్ని రెండు రాష్ట్రాల్లో స్పష్టంగా ప్రకటించాలి.**

రెండు రాష్ట్రాల్లోనూ- ఉద్యమ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, రచయితల సంఘాలు ఆ రోజున తమకు వీలైన విధంగా సభలు, ఊరేగింపులు జరిపి జిల్లా కలెక్టర్ గారికి, ఆర్.డి.ఒ.కు పై డిమాండ్లతో వినతిపత్రం ఇవ్వాలి. ఆ సమాచారాన్ని పత్రికలకు, మీడియాకు విడుదల చెయ్యాలి. నేరుగా ముఖ్యమంత్రికీ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికీ, భాషా మంత్రిత్వశాఖకూ పంపాలి.

ఎవరికి వారే పూనుకొని కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

తెలుగు భాషోద్యమ సమాఖ్య, 98480 16136; 93930 15584

# తెలుగుజాతి (ట్రస్టు) విన్నపం

'నడుస్తున్న చరిత్ర' ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లోనే కాక, పొరుగు రాష్ట్రాల్లోనూ నివసిస్తున్న తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగు భాషోద్యమ నిర్మాణానికి కృషి జరిగింది. దక్షిణ భారతదేశమంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, అనేక ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించుకొనివున్న తెలుగుజాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావసమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపి వేయవలసి వచ్చింది. మళ్ళీ పత్రికను ప్రచురించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసరమైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' పేరిట ఒక ట్రస్టును నమోదు చేయించాము. (92/ 2014). తెలుగు అమ్మనుడిగా కలిగినవారు ఎక్కడ నివసిస్తున్నా, వారి శ్రేయస్సు కోసం ఈ సంస్థ పనిచేస్తుంది.

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తున్నాము. పుస్తకాల ప్రచురణ కార్యక్రమంలో భాగంగా తొలుత స.వెం.రమేశ్ వ్యాసాల సంకలనం **'ఎల్లలు లేని తెలుగు'**ను విడుదల చేశాము. త్వరలోనే మరికొన్ని ప్రత్యేకమైన పుస్తకాలను వెలువరించ బోతున్నాము. ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో బలపరచటానికి మీ అందరి చేయూత కావాలి. ట్రస్టు నిర్మాణంలో తోడ్పడాలని విన్నవిస్తున్నాము.

**ట్రస్టుకు విరాళాలనిచ్చి తోడ్పడ గోరుతున్నాము.**

| | |
|---|---|
| రాజ పోషకులురు. 1,00,000/-లు | పోషకులు రు. 25,000/-లు |
| విశిష్ట పోషకులు రు. 50,000/-లు | ప్రోత్సాహకులు రు. 10,000/-లు |

**దాత ఫొటోను, క్లుప్తంగా పరిచయాన్ని 'అమ్మనుడి' పత్రికలో ప్రచురిస్తాము.**

**దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా ఉచితంగా పంపిస్తాము.**

సొమ్మును చెక్ / డ్రాఫ్టుగా / ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర పంపాలి. యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు.

అక్కౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068

**డా॥ సామల రమేష్‌బాబు,** మేనేజింగ్ ట్రస్టీ, 9848016136 ట్రస్టీలు : **పారుపల్లి కోదండరామయ్య** 9505298565, **డా॥వెన్నిసెట్టి సింగారావు** 9393015584, **స.వెం.రమేశ్** 8500548142, **సామల లక్ష్మణబాబు** 9440448244

## మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి' పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక-

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.
2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్/మెయిల్ గాని పంపించి సహకరించగోరుతున్నాము.
3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు.5000/లు) గాని, 5 సం॥ల చందా (రు.1000/లు) గాని, 3 సం॥ల చందా (రు.700/లు) గాని పంపి పత్రికకు ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥చందా రు.240/లు పంపించి ఏటా పునరుద్ధరించుకొనవచ్చు.

**-ప్రచురణకర్త,** అమ్మనుడి

**నడుస్తున్న చరిత్ర**
(2013 నవంబరు వరకు)
**అమ్మనుడి**
(2015 మార్చి నుండి...)

**పాత సంచికలు విడిగా గాని, సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని కావలసినవారు సంప్రదించండి.**

అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.
ఫోన్ : 98480 16136, 0866-2439466

సంపుటి : 2 సంచిక : 12
**అమ్మనుడి**
ఫిబ్రవరి 2017

సంపాదకీయం

# అమ్మనుడిలో బోధనే అందలానికి తొలిమెట్టు

ఎన్ని భాషలైనా నేర్చుకోవాలి. అయితే సొంతభాషతో సాగేదే విద్యార్థి చదువుకు సరైన దారి. సొంతభాషతోనే విజ్ఞానపు వినువీధులకు ఎగురగల చేవ చేకూరుతుంది. ఆ బలం పైనే ఇతర భాషలను ఎన్నయినా నేర్చుకోగల సత్తా విద్యార్థికి సమకూరుతుంది. ఇదీ అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవ (ఫిబ్రవరి 21) సందర్భాన-ఎల్లనాడుల అమ్మనుడి పండుగ వేళ ప్రతిఏటా - ప్రపంచవేదిక 'యునెస్కో' మానవాళికి ఇస్తున్న పిలుపు. 2000 సం. నుండీ ప్రతిఏటా చూపు సారించవలసిన ఒక ముఖ్య కార్యాచరణ అంశంగా, ప్రాణావసర అంశంగా ప్రపంచం ముందు పెడుతూవుంది యునెస్కో.

2015, మే 19-22 తేదీల్లో కొరియా దేశంలోని ఇంచియాన్‌లో 100 దేశాలనుండి అత్యున్నత స్థాయిలోని పదహారు వందల మంది ప్రతినిధులు సమావేశమైన విశ్వ విద్యావేదిక-2030 వరకూ విద్యవిషయంలో ప్రపంచవ్యాప్తంగా అనుసరించదగిన ఒక విద్యావిధానాన్ని ప్రకటించింది. ఇందులో బోధనాభాషగా సొంతభాష తప్పనిసరి అనే అంశాన్నే ప్రధానమైనదిగా వివరించింది. బహుభాషా సందర్భాల్లో చేపట్టవలసిన విద్యావిధానానికి సరైన దారి చూపిన ఈ 'ఇంచియాన్ విధానపత్రం' మనవంటి బహుభాషా దేశాలకు సరిగ్గా సరిపోతుంది. ఆ మాటకొస్తే ప్రపంచ మానవాళి మధ్య ఇచ్చి పుచ్చుకోవడాలు, రాకపోకలు విస్తరిస్తున్న ఈ యుగంలో అందరి శాంతిసౌభాగ్యాలకోసం, అభివృద్ధి కోసం ఈ విధానపత్రాన్ని ఒక 'దిక్సూచి'గా చెప్పుకోవచ్చు. అందులోని అంశాలు ఇవి: 1. బోధనలో, అధ్యయనంలో మొదటిభాష లేదా ఇంటిభాషను ప్రోత్సహించాలి. 2. తొలిచదువును మొదటిభాష లేదా ఇంటిభాషలో మొదలుపెట్టి, రెండూ అంతకంటె ఎక్కువ భాషలలో విద్యను బోధించాలి. 3. విద్యార్థికి వివిధ దశలలో ముందడుగుకై ప్రాథమిక పాఠశాలకు సిద్ధం చేసేందుకు తగిన ఆరోగ్యం, పోషణ, గ్రహణశక్తి, భావ వ్యక్తీకరణలతో ఎదుగుదల ముఖ్యం. 4. అక్షరాస్యత సాధనలో, విద్యాబోధనలో విద్యార్థుల మొదటిభాష పాత్రపై ప్రత్యేకదృష్టి సారించాలి. 5. ప్రాథమిక విద్యాబోధనలో విద్యార్థుల శాతాన్ని బట్టి, వారి మొదటి లేదా ఇంటి భాషను బోధనాభాషగా నిర్ణయించాలి. ఇదీ విశ్వవేదిక మన ముందుంచిన విధానపత్రం.

అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పాలకులు ప్రాథమిక స్థాయినుంచే విద్యాబోధనలో అమ్మనుడి తెలుగుకు తలుపులు మూసేస్తున్నారు. ఆ పై చదువుల్లోనూ ఇదే ధోరణి. మనం తెలుగువాళ్లమే అయినా, మనభాషను చదువుకు పనికిరాకుండా చెయ్యాలనే దుష్టవ్యూహంలో మన పాలకులు, అధికారులు ఉన్నట్లుంది. దీనికి తగ్గట్లు కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన నూతన జాతీయ విద్యావిధానం ముసాయిదాకూడా విద్యాబోధనలో మాతృభాషలను నిరుపయోగం చేసేందుకు నిర్ణయించుకొన్నట్లుగా ఉంది.

కళ్ళుండీ చూడని, చెవులుండీ వినని వాళ్లని మన నేతలు, ప్రభుత్వాలూ విశ్వవేదిక పిలుపును ఆమోదిస్తారో, 'ఊరంతా ఒకదారి, ఉలిపికట్టెది మరొకదారి' అన్నట్లు ప్రవర్తిస్తారో తేల్చుకోవలసిన సమయం వచ్చేసింది. ప్రజలను, వారి భవిష్యత్తును సర్వనాశనం చేసే పద్ధతులను అనుసరించడం మన తెలుగు ప్రభుత్వాల నేతలకు తగదు. ముఖ్యనేతలు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. అందుకే ఇప్పుడు ప్రజలందరి తరపున ఈ అంశాన్ని చేపట్టి ఉద్యమించవలసిన బాధ్యత అన్ని రంగాల్లోని మేధావులపైనా, సామాజిక స్పృహ కలిగిన ప్రజలపైనా, ఉద్యమకారులపైనా ఉంది.

ఇందుకోసం తెలుగు భాషోద్యమసమాఖ్య, విద్యార్థి వికాస వేదిక, ఆం.ప్ర.విద్యా పరిరక్షణ కమిటీ వంటి కొన్ని సంఘాలు, మరికొందరు వ్యక్తులు ఇటీవల విజయవాడలో రెండుసార్లు సమావేశమై 'మాతృభాషా మాధ్యమ వేదిక'ను ప్రారంభించారు. దీనిలోకి ఇంకా ఆసక్తిగల సంఘాలు, వ్యక్తులు చేరవలసిందిగా ఆహ్వానిస్తున్నాము. ప్రభుత్వాన్నీ, ప్రజలనూ చైతన్యపరచడానికీ, అత్యవసర, దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకూ ఉద్యమకార్యక్రమాన్ని చేపట్టారు. తొలిగా మాతృభాషా దినోత్సవానికి (ఫిబ్రవరి 21) రెండురోజుల ముందుగా 19 ఆదివారంనాడు - విజయవాడలో ఆంధ్రప్రదేశ్ అన్నిప్రాంతాల మేధావుల ఒకరోజు నిరాహార దీక్షకు పిలుపిచ్చారు. ఆ తర్వాత నిరంతర ఉద్యమ కార్యక్రమం ఉంటుంది.

తెలుగు ప్రజలు కదలాలి. తమ పిల్లల భవిష్యత్తును రక్షించుకోవడానికి పూనిక వహించాలి. మన పిల్లల విద్యావికాసం పైనే జాతి అభివృద్ధి అంతా ఆధారపడి ఉంది. అందుకోసమే ఈ ఉద్యమం.

మాతృభాషా మాధ్యమ వేదికను బలపరచండి. ఎవరికెన్ని సందేహాలున్నా అన్నిటినీ వేదిక బాధ్యుల ముందుకు తేవచ్చు. అందరి భాగస్వామ్యంతోనే ఉద్యమం ముందుకు సాగుతుంది. లక్ష్యాలను సాధించి తీరుతుంది.

1-2-2017

సామల రమేష్‌బాబు

## 1982 మేలో తిరుపతిలో ప్రకటించిన

# తెలుగుదేశం పార్టీ భాషావిధాన ప్రకటన

**1982 మే 28 తెలుగు ప్రజానీకం తిరుపతిలో 'తెలుగుదేశం' ద్వితీయ సదస్సు సందర్భంగా 'జనవాహిని'గా పొంగి పొరలింది. ఆనాడు పార్టీ చేసిన తీర్మానం పూర్తిపాఠం ఇది:**

రాజరికపు వ్యవస్థలోను, తదనంతరం బ్రిటిషువారి పాలనా కాలంలోను ప్రజలను అన్నివిధాల అణచివుంచటానికి ప్రభుత్వ పాలన నుండి వారిని దూరంగా వుంచటానికి పాలక వర్గాలు సాధారణ ప్రజలకు తెలియని భాషనే పాలనా భాషగా పోషిస్తూ వచ్చాయి. రాజ్యశక్తికి అదనంగా భాషను గూడా ఒక ఆయుధంగా ఉపయోగించుకొని వారు ప్రజలను అణచి వుంచుతూ వచ్చారు. ప్రజాభాషలు కానట్టి సంస్కృతం, పారశీకం, ఇంగ్లీషు భాషలనే వారు అధికార భాషలుగా ఆదరిస్తూ, ప్రజల భాషల అభివృద్ధి వికాసాలను నిరోధిస్తూ వచ్చారు, విద్యాబోధనకు, పరిపాలనకు, విద్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, న్యాయస్థానాలలో అనేక శతాబ్దాలుగా పరభాషలే చలామణి అవుతూవచ్చిన కారణంగా పాలక వర్గాలు, మేధావివర్గాలు భాషాపరమైన ఆధిక్యతను పెంచుకొని ప్రజలనుండి దూరమైపోవడమే గాక, సాధారణ ప్రజలలోని సృజనాత్మక శక్తులు నశించిపోతూ వచ్చాయి.

భిన్న భాషలు, సంస్కృతులు గల విశాల భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపుష్టి చెందాలన్నా దేశ సమగ్రత కాపాడాలన్నా సమైకృత పెంపొందాలన్నా, అభివృద్ధి సాధించబడాలన్నా ప్రజల భాషలలోనే పరిపాలన సాగాలనే మౌలిక ప్రజాస్వామ్య సూత్రాన్ని స్వాతంత్ర్య సమరం కాలంనాటి భారత జాతీయ కాంగ్రెస్ గుర్తించి, భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం కోరుతూ తీర్మానించింది. అయితే స్వాతంత్ర్యం వచ్చి మూడున్నర దశాబ్దాలు గడచిపోయినా స్వభాషా రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఏర్పడి రెండున్నర దశాబ్దాలు గడచినా తెలుగు భాషకు ప్రభుత్వ కార్యాలయాల్లో, న్యాయస్థానాలలో, విద్యాలయాల్లో స్థానంలేని దౌర్భాగ్య స్థితిలోనే తెలుగు ప్రజలు ఉంచబడ్డారు.

రాజ్యభాషగా పరిగణించబడి ప్రభుత్వంచే అధికార యుతంగా ఆదరింపబడని ఏ భాషా పరిపుష్టి చెందదు. వికసించదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, కోర్టులలో, విద్యాలయాల్లో అన్ని స్థాయిలలో ఉపయోగపడగల విధంగా తెలుగు రాష్ట్రంలో స్థానం లేకుండా చేయటానికి ప్రజావ్యతిరేకులైనపాలకవర్గాలవారు ఇంతకాలంగా సాగిస్తూ వచ్చిన మోసపూరిత విధానాలు యికముందు సాగనివ్వమని 'తెలుగు దేశం' పార్టీ తీవ్ర హెచ్చరిక చేస్తున్నది.

1. సచివాలయం మొదలు, సమితి కార్యాలయం వరకు అన్ని స్థాయిలలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో తక్షణం తెలుగు ఏకైక అధికార భాషగా పరిగణించబడి తెలుగు భాషలోనే రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగాలి.

2. దిగువ న్యాయస్థానాలు మొదలు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వరకు అన్నిస్థాయిల్లో తెలుగు భాషలోనే కార్యకలాపాలు జరగాలి.

3. ప్రాథమిక పాఠశాలలు మొదలు, విశ్వవిద్యాలయాల వరకు అన్ని స్థాయిలలో తెలుగుభాషే బోధనా భాషగా గుర్తించబడాలి.

4. గవర్నరు పిల్లలు మొదలు శ్రామికుని బిడ్డల వరకు బాల బాలికలందరికీ ఒకే విధమైన ఏక ప్రమాణ విద్యాభ్యాసం జరిగేవిధంగా విద్యావ్యవస్థను సంస్కరించాలి అంతేకాక తెలుగునాడులో తెలుగు భాష ఒక్కటి మాత్రమే తప్పనిసరిగా నేర్చుకోవలసిన భాషగా అమలు చేయాలి.

5. హిందీ, తమిళం, కన్నడం, మలయాళం లాంటి ఇతర భారతీయ ప్రజా భాషలుగాని, ఇంగ్లీషు, రష్యన్, జర్మన్, జపానీస్ లాంటి విదేశీ భాషలు గాని, నేర్చుకోదలచిన వారికి అవి ఐచ్ఛిక భాషలుగా బోధించటానికి ఏర్పాట్లు జరగాలి.

6. తెలుగునాడులో వుండే తంతి తపాలా రైల్వేలాంటి ప్రజా జీవన సంబంధిత కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో గూడా తెలుగుభాషలోనే కార్యకలాపాలు జరగాలి.

7. తెలుగునాడులోవున్న పారిశ్రామిక, వ్యాపారసంస్థలు అవి ప్రభుత్వ సంస్థలయినా, ప్రయివేటు సంస్థలయినా – అన్నీ, తమ కార్యకలాపాలన్నీ తెలుగులోనే నిర్వహించాలి.

8. కేంద్రప్రభుత్వంలోను, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతోను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాల మేరకు మాత్రమే ఇంగ్లీషుభాష వాడకాన్ని పరిమితం చేయాలి.

9. తెలుగునాడులో భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన వారు తమ పిల్లలకు తమ మాతృభాషలో విద్యాబోధన చేసుకునేందుకు సౌకర్యాలు కలుగచేయటంతోపాటు, తెలుగు నేర్చుకునే విధానం అమలు పరచాలి.

10. తెలుగునాడులో ఉర్దూ మాతృభాషగా గల ప్రజలు అసంఖ్యాకంగా వున్న కొన్ని ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలలో ఉర్దూ భాషకు తగు ప్రాధాన్యత యివ్వబడాలి.

భాషారంగంలో ఈ దశసూత్ర పథకాన్ని తక్షణం అమలులో తీసుకొని రావటానికి తెలుగుదేశం తనను తాను అర్పించుకొంటూ, తెలుగు రాష్ట్రంలో తెలుగు భాషకు అన్నింటా ప్రథమస్థానం లభింప చేయుటకు, అవసరపడిన ఎట్టి త్యాగాలకయినా సంసిద్ధులుగా వుండాలని తెలుగు ప్రజలకు పిలుపు యిస్తున్నది.

**పార్టీని స్థాపించినప్పుడు వున్న ఆదర్శాలవి! చేసిన వాగ్దానాలవి. వాటిలో దేన్నీ అమలుకు తేకపోగా తెలుగు భాషను అన్నిరంగాల్లో దిగజార్చి అణగదొక్కిన చరిత్రను తెలుగుదేశం పార్టీ మూటగట్టుకుంది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈ విషయంలో తక్కువేమీ కాదు. ఇప్పుడధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు మళ్ళీ వాగ్దానాలు చేస్తున్నారు!**

-డా॥ దాసరి రామకృష్ణప్రసాదు
98850 51179

# కూడు పెట్టేది ఇంగ్లీష్ కాదు - నైపుణ్యమే!

**మూడు,** నాలుగు సంవత్సరాలు ఇంటి భాషలో పదజాలాన్నీ, వాక్య నిర్మాణాన్ని నేర్చుకొని చక్కగా భావ వ్యక్తీకరణ చేయగలిగిన పసివారు ఈ ప్రకృతిని, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, సమన్వయం చేసుకోవడానికే పాఠశాలకు పంపబడతారు. ఆడుతూ, పాడుతూ అలవోకగా లెక్కలు, సైన్స్, సోషల్ శాస్త్రాలు నేర్చుకోవాల్సిన వాళ్ళకు -తెలియని ఆ సబ్జెక్టులను బొత్తిగా తెలియని ఇంగ్లీష్ భాషలో నేర్చుకోవలసిన పరిస్థితి అత్యంత బాధాకరం.

పిల్లల సొంత భాషలో మరిన్ని విషయాలు చెప్తే త్వరగా నేర్చుకోగలరు గానీ, అర్థంకాని ఇంగ్లీషులో నేర్చుకోవడానికి వాళ్ళు పడే కష్టం ఎంత దురదృష్టం! బట్టీ పట్టి అప్పచెప్పటమూ, రాయడం ద్వారా మార్కులు తెచ్చుకుని తలిదండ్రులనూ, ఉపాధ్యాయులనూ సంతోషపెట్టవలసి వస్తుంది. బాల్యాన్నీ, బాలల సృజనాత్మకతనూ ఇలా చిదిమేసే హక్కు తల్లిదండ్రులకు ఎక్కడిది? "భాషా పునాదులు పూర్తిగా ఏర్పడటానికి మొదటి 7 సంవత్సరాలు పడుతుంది. ఈ మొదటి భాష పునాదిపై ఎన్ని భాషలయినా సులభంగా నేర్చుకోవచ్చు" అని భాషా శాస్త్రవేత్తలు చెబుతున్నారు కదా! ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల మానేసేవారి సంఖ్య (Drop outs) పెరుగుతున్న విషయం నిరూపించబడినది. పల్లెటూళ్ళలో ఉండేవారికి ఇది విదితమే! ఇంతకు ముందు సరిపడా ఆర్థిక స్థాయి లేక మానేసేవాళ్ళు; ఇప్పుడు పరాయిభాషా మాధ్యమం కూడా కారణంగా తోడయ్యింది.

ఇంగ్లీష్ మాత్రమే కూడు పెట్టదు. మన చుట్టూ ఉన్న అనేక ఉద్యోగాలలో చూస్తే ఇంగ్లీష్ వలన మాత్రమే సంపాదిస్తూ బ్రతికేవారు అతి తక్కువమంది. ఏదో ఒక పని నైపుణ్యమే వారికి కూడు పెడ్తోంది. ఇంగ్లీషులో వ్యవహరించగలగడం, కంప్యూటర్‌తో పనిచేయగలగడం కొన్ని ఉద్యోగాలలో కేవలం అదనపు అర్హతలు. కావలసినవారు ఇంగ్లీషును నేర్చుకోవడం పెద్ద సమస్యేమీ కాదు. కానీ పసిప్రాయం నుంచీ సొంత భాషలో పాఠాలు చెప్పకుండా పరాయి భాషలో చెప్పడం పిల్లల సృజనాత్మకతను దెబ్బతీయడమే కాక, దేశ స్వావలంబనకు అతి పెద్ద నష్టం కూడా. పరాయీకరణ చెందిన యువతరంతో మన దేశాన్ని నిర్మించడం అత్యంత కష్ట సాధ్యం. శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందిన ఏ దేశమూ పరాయి భాషలో చదువు చెప్పడం లేదు. పరాయి భాషలో చదువు చెప్పిన దేశాలు కేవలం సేవారంగంలో తప్ప ఉత్పత్తి రంగంలో అభివృద్ధి చెందనే లేదు.

కృష్ణా జిల్లా బొబ్బర్లంక గ్రామంలో దళిత కుటుంబంలో జన్మించిన మాతంగి కోటేశ్వరరావు 11 భాషలు మాట్లాడగలడు. కేవలం 9వ తరగతి మాత్రమే చదివిన అతనొక ఎలక్ట్రీషియన్. తన కాంట్రాక్టరు ఏ దేశం వెళ్ళమంటే ఆ దేశం వెళ్లి అక్కడి భాషను 3 నెలల్లోనే నేర్చుకునేవాడు. అవసరం అతనికి అన్ని భాషలూ నేర్పింది. పనిలో నైపుణ్యంతో మాత్రమే అతనికా ఉద్యోగం లభించింది.

రామన్ మెగసెసే అవార్డు విజేత డాక్టర్ రజనీంకాంత్ అరోలి వద్ద కేవలం నాల్గవ తరగతి మాత్రమే చదువుకున్న దళిత యువకుడు. ఆఫ్రికాలోని అనేక దేశాలకు వెళ్లి కృత్రిమ కాళ్ళను తయారు చేయడంపై వర్క్ షాప్స్‌ను ఆంగ్లంలో నిర్వహించేవాడు. ఇంగ్లీషు ఇంత బాగా ఎలా నేర్చుకున్నావు అని అడిగితే నవ్వేసి 'అదేమన్నా బ్రహ్మ విద్యా అండి, అవసరం అయితే ఏ భాష అయినా కొద్ది రోజుల్లోనే తేలికగా నేర్చుకోవచ్చు' అని సమాధానమిచ్చాడు. ఒక కొత్త భాషను నేర్చుకోవడానికి కేవలం 3 నెలల సమయం సరిపోతుంటే చిన్నప్పటి నుండే సైన్స్, సోషల్, లెక్కలు ఇంగ్లీషులో నేర్చుకోవలసిన అవసరం ఏమిటి?

పరాయి భాషను నేర్పే పద్ధతులలోనే ఏ కొత్త భాషనైనా నేర్పాలి గదా! సైన్స్, సోషల్, లెక్కలు సబ్జెక్టుల ద్వారా కొత్తభాషను నేర్పడం అనే ప్రయోగం ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. ఎందుకంటే అది ఇంగితజ్ఞానం (కామన్ సెన్స్)కు కూడా అశాస్త్రీయమని అర్థమవుతుంది. అందుకే అతి చిన్న దేశమైన కొరియాలో కూడా ఎల్‌కేజీ నుంచి పీహెచ్‌డీ వరకు వారి సొంత భాషలోనే బోధిస్తారు. మరి మన పిల్లలేం పాపం చేసుకున్నారు?

ఇది శాస్త్రీయం అని తెలిసినపుడు ప్రభుత్వాలను వత్తిడి చేసి సొంత భాషలోనే పాఠశాల విద్య ఉండేటట్లు చేయాలి కానీ, తల్లిదండ్రులందరూ కోరుకుంటున్నారు కనుక రాష్ట్రమంతా ఇంగ్లీషు మీడియం స్కూళ్ళే ఉండాలని నిర్ణయించడం వివేకమేనా? తెలియక నిప్పును పట్టుకునే పసివాడిని వదలి ఊరుకుంటామా? వెంటనే నిప్పుకు దూరంగా తీసుకువెళ్తామా?

గత వారంలో మా బంధువు కోపెన్ హెగాన్ (డెన్మార్క్ రాజధాని) నుంచి వచ్చాడు. అక్కడి విద్య గురించి చెబుతూ ఎల్‌కేజీ నుంచి పీహెచ్‌డీ వరకూ బోధన అంతా డేనిష్ (వాళ్ళ భాష)లోనే ఉంటుందనీ, కేవలం విదేశస్తుల కోసమే ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళు ఉంటాయనీ చెప్పాడు. యూరప్ అంతా అలానే ఉంటుంది. ఇంగ్లీష్ మాతృభాష కాని ఏ అభివృద్ధి చెందిన దేశంలోనైనా (ఉదాహరణకి- ఇంగ్లాండ్ మినహా మిగిలిన యూరప్ దేశాలు, జపాన్, చైనా, కొరియా) విద్య మొత్తం వారి సొంత భాషలోనే ఉంటుంది. వ్యాపారావసరాలకు కానీ, మరే ఇతర అవరసరాలకైనా గానీ వేరే దేశాలకు వెళ్ళవలసిన వారు మాత్రమే ఇంగ్లీషూ, వేరే దేశ భాషలూ నేర్చుకుంటారు.

అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాలలో ఉద్యోగాలు చేస్తున్న తెలుగువారు వారి నైపుణ్యంతో

(తరువాయి 20వ పుటలో..)

-డా. పుచ్చలపల్లి మిత్ర
9959989345

# సొంత భాషే ఎందుకు?

**మ**న భాషల్లో అభినివేశం పొంది, మనసారా మాట్లాడి కొత్తదనం నింపే బదులు, దేనికీ కొరగాని కొత్త భాషా బోధనలతో బిడ్డల్ని హింసించడమెందుకు? 300ఏళ్ల పాలనలో ఆంగ్లేయులు కూడా ఇంతటి అకృత్యం చేయలేదు. ఒక వంక అమెరికన్లు స్పానిష్ ప్రభావం గల ప్రాంతాల్లోని బడులలో నేటికీ ఇంగ్లీష్ బదులు స్పానిష్ మాధ్యమంలోనే ప్రతిదీ వాళ్లకి నేర్పిస్తామంటారు. విదేశాలకుపోయే 2శాతం మంది కోసం కోట్లమంది పిల్లల గొంతుకల్ని నులుముతారా?

నరజాతి తత్త్వాన్వేషకుల (Anthropologists) నిర్ణయాన్నిబట్టి, ఇతర జంతుజాలం నుంచి మానవుడిని ప్రత్యేకిస్తున్న ప్రముఖ లక్షణాలలో విరుద్ధ గ్రహణశక్తులైన 'ఆలంకారిక భాష, ఆలోచనా ధార' ముఖ్యమైనవి. ఇవి సమాచారాన్ని జ్ఞానంగా మార్చి, ప్రసారం చేసే -అన్వయించే శక్తులన్నమాట.

జ్ఞానానికి ఆలోచనే పునాది. భావాలే (ఆలోచనలు) మాటలౌతవి, మాటలు భాష ఔతుంది. మనం ఆలోచించేది పదాలుగానే. పదాలు లేకుంటే ఎవరికైనా ఏకీకృత భావనాధార ఉండదు. భాషా పునాది మీదే – ఆలోచన, ఊహ, భావం నిర్మించబడేది. పదాల మీద పట్టు, భాష మీద అధికారం ఉండి తీరాల్సిందే.

మానవ సమాజాల పరిణామ క్రమంలో జనం తమ చుట్టూ జరిగే వాటిని పరిశీలిస్తూ ఆ జ్ఞానాన్ని ఆచరణాత్మకంగా సాంకేతికంగా మలుచుకొన్నారు. ఆ నిక్షిప్త జ్ఞానం అలా విస్తరించి, సమాచార ప్రసారమే దారంగా విశాల సమాజ వస్త్రం రూపొందింది. ఈ మొత్తం ప్రక్రియలో సామాజిక చైతన్యాన్నీ, సౌభాగ్యాన్నీ, భూత వర్తమాన భవిష్యత్ కాలాలనూ ఏకంచేసిన గొలుసు భాష మాత్రమే.

అలనాటి సమాజాలలోని సంఘటనను వర్ణించి నమోదు చేయటానికి మనిషి ఊహలు, భాషా శక్తి విస్తృతమై, కథనం, వర్ణనలూ శిఖరాగ్ర స్థాయికి చేరాయి. వాటిని మరింత క్లుప్తంగా, శక్తివంతంగా వెలిబుచ్చేందుకు వ్యాకరణాలూ బైలుదేరాయి. కొత్తపేర్లూ, క్రియా పదాలు పెరిగిపోయి కథనం కాస్తా వర్ణనంగా మారింది. కొత్తపదాలు పుట్టుకొచ్చాయి. పరభాషల్లోంచి కూడా వచ్చి చేరాయి. ఇక రచయితలు, కవులు, వక్తలు పెరిగి చివరకు మనిషి భాష మీద అధికారం సాధించాడు.

భాషా దారిద్ర్యం మనిషి ఆలోచనకీ, గ్రహణ శక్తికీ, వ్యక్తీకరణకీ సంకెళ్ళు వేసి, స్వశక్తి మీద నమ్మకాన్ని తగ్గిస్తుంది. మాతృభాష మన పుట్టుకతోనే సంప్రాప్తిస్తుంది. నేపథ్యం, చరిత్ర, అనుబంధంతో సహా తెలియకుండానే ప్రతి పదాన్ని నేర్చుకొంటాం. అప్రయత్నంగా, సహజంగా పదం యొక్క భావాన్ని సామాజిక వాతావరణం నుంచే తీసుకోగలం. పరభాష విషయంలో దాని జాతీయాలు, అలంకారాలు, సామాజిక, చారిత్రక నేపథ్యంతో సహా గ్రహించాలంటే అదొక బ్రహ్మ ప్రయత్నమే! మనిషి తన మాతృభాషలో ఆలోచించి, సహజసిద్ధమైన సాధికారతతో, ఆత్మవిశ్వాసంతో సునాయాసంగా వ్యక్తీకరిస్తాడు. బిడ్డకు



ఆరేళ్ళకే భాషా పునాదులు పడతాయనేదీ, 12 ఏళ్ళకే భాషా సౌధం పూర్తవుతుందనేదీ రుజువైన సత్యం. ఫలితార్థం ఏమంటే: "అరకొర సమాచారంతో – సంకుచిత హ్రస్వ దృష్టితో, రాజకీయ లబ్ధి కోసం పిల్లల మీద పరభాషా బోధనలో ప్రయోగం చేయటం ప్రమాదమూ, బాధ్యతారాహిత్యమూ". భాష మీద పట్టు లేనపుడు భావ వ్యక్తీకరణ లోపించి, పిల్లల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఒక తరం మొత్తం ఆత్మన్యూనతతో కృంగిపోతుంది. అన్ని దరిద్రాలను తలదన్నేది భావ దరిద్రమే.

ఆంగ్లేయుడు రాకముందు గణితం, ఖగోళం, భౌతిక శాస్త్రం, వైద్యం, కళలు, శస్త్ర చికిత్సలు అన్నీ స్థానిక భాషల్లోనే ఉండేవి. అవసరాన్ని బట్టి కొత్త పదాలు పుట్టుకొచ్చేవి. ఇప్పుడు మాత్రం అది ఎందుకు కుదరదు? ప్రపంచ ప్రసిద్ధ దేశాలన్నిటా అమలౌతున్నదిదే గదా! మాతృభాషలో విద్యాబోధన సాగిస్తున్న ఇటలీ, చైనా, జర్మనీ, జపాన్, స్పెయిన్, కొరియా, రష్యా వంటి ఆంగ్లేతర జాతులన్నీ ఎంతో పురోగమించాయి గదా! అభివృద్ధికీ, సౌభాగ్యానికీ ఇంగ్లీష్ మీడియమే మూలమని చెప్పే నిర్బంధ ఆంగ్లమాధ్యమ బోధనాప్రవక్తలు అమెరికాలోని అధికసంఖ్యాకులు ఆంగ్లభాషను సరిగా చదవలేని, రాయలేని, అంతగా పదజాలమూ వ్యాకరణమూ తెలియనివారని గ్రహించాలి. ఆంగ్లానికి జన్మస్థానమైన బ్రిటన్‌లోనే ఈ సమస్య ముదిరిపోతున్నది. పాలకుల భాష మాట్లాడటమే ప్రత్యేకతగా, గౌరవంగా భావించే ఒకప్పటి వలస దేశాల్లో మాత్రమే ఆంగ్ల మాధ్యమ వ్యామోహం కనిపిస్తుంది. ఒకప్పటి పాలకుల భాషకీ, నేటి అభివృద్ధికీ సంబంధం ఏమిటో మరి. శాస్త్ర సాంకేతికత అంతా ఆంగ్లంలోనే ఉన్నదని వాదించేవారు ఇజ్రాయేల్ దేశాన్నొకసారి పరిశీలించాలి. వాళ్ళ హిబ్రూ, ఇద్దిష్ భాషల్లోకి ఆంగ్లంలోని గ్రంథాలను కేవలం 40 ఏళ్ళలో తర్జుమా చేసుకున్నారు. శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక రంగాల్లో ప్రబలశక్తి ఐన ఇజ్రాయేల్ తమ భాషా సాంస్కృతిక సమగ్రత కోసమే ఆ పని చేసింది.

మన సువిశాల దేశంలో సుసంపన్నమైన వర్ణ రంజితమైన శక్తివంతమైన – వేల ఏళ్ల ప్రాచీన అద్భుత భాషలు మనకున్నాయి. వాటిలో అభినివేశం పొంది, మనసారా మాట్లాడి కొత్తదనం నింపే బదులు, దేనికీ కొరగాని కొత్త భాషా బోధనలతో బిడ్డల్ని హింసించడమెందుకు? 300 ఏళ్ల పాలనలో ఆంగ్లేయులు కూడా ఇంతటి అకృత్యం చేయలేదు. ఒక వంక అమెరికన్లు స్పానిష్ ప్రభావం గల ప్రాంతాల్లోని బడులలో నేటికీ ఇంగ్లీష్ బదులు స్పానిష్ మాధ్యమంలోనే ప్రతిదీ వాళ్లకి నేర్పిస్తామంటారు! విదేశాలకు పోవలసి వచ్చిన రెండుశాతం మంది కోసం కోట్లమంది పిల్లల స్వేచ్ఛా గొంతుకల్ని నులిమి, వేలకొద్దీ ఏళ్ళుగా వికసించిన గొప్ప మాతృభాషను కాలరాసి, ఆంగ్ల మాధ్యమం తెస్తారా?

నాదేమీ దేశాభిమాన భావోద్వేగం కాదు.. అద్భుత నేపథ్యం ఉన్న ఒక గొప్పజాతిని పరాధీనత నుంచీ, కాలం చెల్లిన శాస్త్ర సాంకేతికత నుంచీ, మేధోవలసల నుంచీ తప్పించి సృజనశీలమైన నూతనావిష్కరణలతో ఆత్మవిశ్వాసపూరక మహోగ్ర శక్తిగా మలిచే ప్రయత్నం. ఈ దేశంలోని సహస్ర వృత్తుల అసంఖ్యాక జనావళి తమ తమ రంగాలలో కృషితో ఉత్పత్తి సాధించేందుకు ఆంగ్ల మాధ్యమ బోధనే అవసరమనటం అర్థరహితం. ఇక్కడో, విదేశాల్లోనో కంపెనీ ఉద్యోగాల కోసం ప్రయత్నించే అత్యల్ప సంఖ్యాక విద్యార్థుల కోసం జాతి అంతటినీ ఆంగ్ల మాధ్యమంలోకి నెట్టాలా?

మనం మన వాణిజ్యాలను తెలుగులోనే నిర్వహిస్తే– అవసరమున్న వాళ్ళే తెలుగు నేర్చుకోరా? చైనీస్, జపాన్ భాషల్ని విదేశస్తులిప్పటికే నేర్చుకుంటున్నారు. లక్షల కొద్దీ ఉన్న మన పాఠశాలలోని అప్రామాణిక, అస్తవ్యస్త ఆంగ్ల భాషా బోధనను చూస్తే భాషాభిమానం ఉన్న ఏ ఆంగ్లేయుడూ బ్రతకడు. గల్ఫ్ దేశాలకు వెళ్లి, ఏటా వేల కోట్లు ఇక్కడికి పంపుతున్న లక్షలాది మన కార్మికులు అక్కడ ఒక్కముక్కైనా ఆంగ్లం మాట్లాడరు. న్యాయస్థానాలలో ఆంగ్లంలో జరిగే వాదోపవాదాలు, ఆస్పత్రుల్లో రోగులకు అర్థంకాని డాక్టర్ల ఆంగ్ల సంభాషణలు, దేశీయ విమాన ప్రయాణాల్లో అర్థంకాని ఆంగ్లభాషా ప్రకటనలు... ఎవరికి పనికొస్తాయి?

"వెనుకబడిన వర్గాల పిల్లలకు ఆంగ్లం బోధిస్తే చాలు – అద్భుత అవకాశాలు అంది పుచ్చుకోగల"రనే వింతవాదం మన ప్రసార మాధ్యమాల్లో వినిపిస్తున్నది. ఇదే నిజమైతే– ఆంగ్లభాషాధిక్య దేశాలైన బ్రిటన్, అమెరికా, తదితర దేశాల్లో నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం, మాదకద్రవ్యాల మత్తులో జోగడం, పరిశ్రమలు, నౌకాశ్రయాలు మూతబడటం, దారిద్ర్యం తాండవించటం ఎందుకో చెప్పగలరా? ట్రంప్‌లు, బ్రిటన్ ప్రధానులు ఇక్కడికొచ్చి పనికిరాని ఆయుధా లమ్ముకోవడం కాదు, వాళ్ళ ప్రజలకే మన భాషలునేర్పి, 'బ్రతకండిక్కడ' అని చెప్పాలి.

మనమేమో ఆంగ్ల భాష వస్తే చాలు– జీవితం పూలపాన్పు అనుకొంటాం. మరి అవతార్, టైటానిక్ వంటి హాలీవుడ్ సినిమాలు తెలుగులోకి మారి, కోట్ల కొద్దీ డబ్బు సంపాదించుకుపోతాయి. మార్కెట్ అధ్యయనాల సౌలభ్యం కోసం ఇవాళ గూగుల్, సెల్‌ఫోన్ కంపెనీలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు తెలుగు వంటి భారతీయ భాషల కోసం చూస్తున్నాయి. ఎమిరేట్, బ్రిటిష్ విమానాల్లోనేమో భారతీయ భాషల్లో ప్రకటనలా? బ్రిటిష్ డాక్టర్లకు భారతీయ భాషలన్నీ నేర్చుకోవాలని ఆ ప్రభుత్వ ఆదేశాలా?

స్థానిక భాషల్ని కూడా పట్టించుకోండర్రో అనే ఆయా సుప్రసిద్ధ కంపెనీల సూచనలకు పూర్తి భిన్నంగా మన విద్యావేత్తలు కొందరు మాత్రం "మాతృభాషలెందుకు? ఆంగ్లమే బువ్వ పెడుతుంద"ని ఘోషిస్తున్నారు. ఎక్కడెక్కడో విదేశీ విమానాల్లో టాయ్‌లెట్ల దగ్గర మన తెలుగు సూచన చూస్తాం. ఇక్కడ హైదరాబాద్‌లో టాయ్‌లెట్లు మాత్రం ఆంగ్లంతోనే తెలుసుకోగలం. ప్రజలకు చేరువ అయ్యేందుకు వాళ్ళేమో బైబిల్, ఖురాన్‌లను తెలుగులో ముద్రిస్తారు. మనం మాత్రం తెలుగు భాషా సమావేశాల్ని ఆంగ్లంలో నిర్వహించుకొంటాం! ఏ ఇతర దేశాల్లోనూ ఇలా జరగదు! తీవ్రమైన ఆత్మ పరిశోధనకిదే సమయం.

నా ఈ సొద అంతా ఐచ్ఛికంగా ఇతర భాషలు నేర్చుకోవడానికి వ్యతిరేకంగా కాదు సుమా! మనం మన సొంతభాషల పునాదుల్ని గట్టిపరచుకోవడానికి మాత్రమే. మాతృభాషలో మనం ప్రావీణ్యం సాధిస్తే– ఆంగ్లం, జర్మన్, ఫ్రెంచ్, గుజరాతీ, బెంగాల్, రష్యన్– ఏ భాషనైనా దున్నేయగలం. అయితే పరభాషలు ఆసక్తితో, అవసరంతో నేర్చుకొంటున్నామంటే– దానర్థం మాతృభాషను నిర్వీర్యం చేసి, హేళన చేయడమని కాదు. ❊

*(ఆంధ్రజ్యోతి – 31, జనవరి– సౌజన్యంతో)*

- డాక్టర్ నూకతోటి రవికుమార్,
98481 87416

# అమ్మభాషను హరించే కుట్రలూ కుయుక్తులూ...

'నాగరికుడైన ఒక మానవుని సుఖదుఃఖాలు ఒక మొరటు జంతువుపై ఆధారపడి ఉండటం ఎంత విచిత్రం! జీవితం నానా విధాలైన వైరుధ్యాలతో నిండి ఉంది. (అతడు అడవిని జయించాడు: కేశవరెడ్డి)

ఈ మాటలోంచి తెలుగు విశిష్టత, ఉన్నతి, ఆదరణ, ఆచరణ అనే మాటలను అవలోకించాలని అనిపిస్తోంది. తెలుగును ద్వితీయ భాషగా కూడా నిరాకరిస్తున్న ఒక విచిత్రకర సంస్కృతి ప్రబలిపోతున్న ఈనాటి పాలక వాతావరణాన్ని స్పృశించటం, వివేకవంతులుగా అప్రమత్తం కావటం ఈనాటి అవసరం. నిజానికి, దేశవ్యాప్తంగా విద్యారంగాన్ని ఒక గొడుగు కిందకు తీసుకురావాలని కొందరు భావిస్తుంటే, ఇది స్థానిక భాషలను నిర్మూలించటం అన్నట్టుగా కొన్ని రాష్ట్రాలు భావిస్తున్నాయి. ఈ క్రమాన్ని విస్తరించే ఆలోచనే గత కొన్ని దశాబ్దాలుగా ఆంధ్ర పాలకుల్లో విస్తరిస్తుండగా, తాజాగా యూజీసీ, రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లు తీసుకున్న నిర్ణయం తల్లి భాషలకున్న కొద్దిపాటి ఉసురును కూడా తీసేస్తోంది. నిజానికి, 2020 నాటికి తెలుగుభాష అంతరించిపోతుందని ఐక్య రాజ్యసమితిలోని భాషాధ్యయన విభాగం హెచ్చరించిందని మన మందరమూ చదివే ఉన్నాం. ఈ సూచనను హెచ్చరికగా స్వీకరించి తెలుగు ఉన్నతికి చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వాలు ఒక ప్రణాళిక ప్రకారం తెలుగుభాష మనుగడను ఎద్దేవా చేస్తూ నిర్ణయాలు తీసు కుంటున్నారు. తెలుగుమీద కక్ష కట్టి మరీ వేర్వేరు తరగతుల్లో ద్వితీయ భాషగా ఉన్న దానిని కాస్తా రద్దు చేస్తున్నారు. ఇంకోవైపు 'తెలుగును బతికించుకోవటం ఎలా' అనే అంశం మీద భాషా సాహిత్యవేత్తలు లేకుండానే ఆమాత్యులు, శాసనసభ్యులు చేసిన విహారయాత్రలు ప్రభుత్వానికి ఏం సూచనలు చేశాయో కానీ, ఇప్పుడు తాజాగా డిగ్రీ స్థాయిలో ద్వితీయ భాషగా ఉన్న తెలుగును సైతం నాలుగో సెమి స్టర్‌లో రద్దు చేస్తూ ఎపి ఉన్నత విద్యామండలి తీర్మానించింది. ఈ విషయాన్ని విద్యామండలి తాను ప్రకటించిన డిగ్రీ కోర్సుల సిలబస్ ద్వారా వెల్లడి చేసింది కూడా.

ఏపిలోని అన్ని విశ్వవిద్యాలయాల అనుబంధ డిగ్రీ కోర్సుల్లో నాలుగవ సెమిస్టర్‌లో ద్వితీయ భాషగా ఉండాల్సిన తెలుగుకు బదు లుగా 'లీడర్‌షిప్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్' అనే సబ్జెక్టును ప్రవేశపెట్టింది. ఇంగ్లీష్ మీడియంలో ఉండే ఈ సబ్జెక్టును తెలుగు అధ్యాపకులే బోధించాలనే నిబంధనను కూడా ప్రవేశపెట్టింది. యూజీసి ఉత్తర్వు లంటూ, రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లుపెట్టిన ఈ చర్య వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో 50పై చిలుకు సంప్రదాయక యూనివర్సిటీల 500లకు పైగా డిగ్రీ కాలేజీల విద్యార్థులు తెలుగుకు దూరం కానున్నారు. వాస్తవానికి సెమిస్టర్ విధానం అమల్లోకి రాకముందు మూడేళ్ల డిగ్రీ కోర్సులో ప్రతి విద్యార్థీ రెండో సంవత్సరం వరకు తెలుగును ద్వితీయ భాషగా తీసుకునే అవకాశం ఉంది. అలాగని అది నిబంధనేం కాదు, ఇంకోవైపు మార్కులు ఈజీగా వస్తాయనే నినాదాన్ని సొంతం చేసుకున్న కార్పొరేట్ విద్యాసంస్థల ఆసరాగా ఉన్న సంస్కృతం ఇంకోవైపు ఉండనే ఉంటుంది. ఉన్నత విద్యామండళ్ల తాజా నిర్ణయం వల్ల డిగ్రీ నాలుగో సెమిస్టర్‌లో ఏకంగా ద్వితీయ భాష హోదాలో ఉన్న తెలుగును రద్దు చేయటం, తద్వారా ఎలా లేదన్నా, రెండు రాష్ట్రాల్లో ఏడాదికి కనీసం నాలుగున్నర లక్షల మంది విద్యార్థులను తెలుగుకు దూరం చేయడం జరిగిపోతోంది.

తెలుగు రాష్ట్రాల్లో మాతృభాషపై పాలకులు కక్ష పెంచుకున్నట్టుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. నిజానికి పదో తరగతి స్థాయిలో ద్వితీయ భాషగా ఉన్న తెలుగును కుదించి, 'కాంపోజిట్ తెలుగు'ను మార్కులు బాగా వస్తాయనే పేరుతో సంస్కృతం ప్రవేశపెట్టారు. దీనికి కొనసాగిం పుగా ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగుకు బదులుగా సంస్కృతం బలవంతంగా రుద్దుతున్నారు. అదేమంటే, మార్కుల కోసం అంటున్నారు. ఇలా పది, ఇంటర్ తరగతుల్లో ఏడాదికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్కో తరగతిలో 50 వేలమంది విద్యార్థులు, వెరసి లక్షమందికి పైగా మాతృభాష తెలుగుకు దూరం అవుతున్నారు. దీనికి కొనసాగింపు అన్నట్టుగా ఇప్పుడు డిగ్రీ స్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లు తాజాగా డిగ్రీ నాలుగో సెమిస్టర్‌లో తెలుగును రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇంకో విషయమేమంటే, ప్రొఫెషనల్ కోర్సులుగా ఉన్న బిబిఎం, బిసిఏ వంటి కోర్సుల్లో అసలు డిగ్రీ స్థాయిలో మొదటి సంవత్సరం నుంచే తెలుగును రద్దు చేశారు. ఈ విషయమై భాషా సాహిత్య సంఘాలు నోరు మెదపకపోవటంతో తాజాగా జనరల్ డిగ్రీ కోర్సుల్లో సైతం తెలుగును రద్దు చేసేంత తెంపరితనం ప్రదర్శిస్తూ ఉన్నత విద్యామండలి ద్వారా నిర్ణయాలు చేశారు.

ఇంకో అసలైన సత్యమేమంటే, పిజి స్థాయిలో తెలుగును దుంప నాశనం చేసేందుకు కూడా ఈ నిర్ణయం ద్వారా మరో దుర్మార్గపు ముందడుగు వేశారు. నిజానికి డిగ్రీస్థాయిలో తెలుగు రెండు సంవత్స రాలు చదవనివారు పిజిలో ఎంఏ తెలుగు చేయటానికి అనర్హులు అవుతారు. ఇలా పిజి స్థాయిలో తెలుగు భాష, సాహిత్యాల ఉనికిని కూడా దెబ్బ తీయాలనే దుస్సాహసం పాలకుల నిర్ణయాల్లో ఉన్నట్టుగా తేటతెల్లమవుతోంది. డిగ్రీ నాలుగో సెమిస్టర్‌లో తెలుగును రద్దు చేస్తూ ప్రత్యామ్నాయంగా హ్యూమన్ వాల్యూస్, ప్రొఫెషనల్ ఎథిక్స్ ఫౌండేషన్ రూపకల్పన చేసింది తెలుగు పండితులేనని, ఇది నిపుణుల కమిటీ పర్యవేక్షణలోనే జరిగిందని ఎపి ఉన్నత విద్యామండలి అధికారులు పేర్కొనటం కూడా హాస్యాస్పదంగా ఉంది. వాస్తవానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో సంస్కృతం ద్వితీయ భాషగా స్వీకరించే విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఆయా పరీక్షలను సంస్కృతం




లోనే రాయాలనే ఉత్తర్వులు రెండేళ్ల క్రితమే వచ్చాయి. కానీ, అవి ఆచరణలో నీరుగారిపోతున్నాయి. సదరు సంస్కృతాన్ని ద్వితీయ భాషగా తీసుకుని సంస్కృతం సబ్జెక్టు పరీక్షలను ఆ భాషలో రాయకున్నప్పటికీ నూటికి నూరు మార్కులేస్తూ ఉదారత్వాన్ని ప్రదర్శిస్తున్న అధ్యాపకులు ఉన్నారు. దానికి అండగా ఓ వైపు అధికారులు, ఇంకోవైపు అదే అధికారులను అడ్డం పెట్టుకుని తెలుగు భాషకు చితిని పేరుస్తున్న పాలకులూ తెలుగు భాష ఉనికి చుట్టూ మోహరించి ఉన్నారు.

సంస్కృతం ద్వితీయ భాషగా పది, ఇంటర్‌లో తీసుకున్న విద్యార్థులు తెలుగులోనే పరీక్షలు రాస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు పక్కన బెట్టి, వారికి భారీగా మార్కులు వేయటానికి ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఇంకోవైపు ఒక్కో కోర్సులో తెలుగు ప్రవేశాన్ని విడతలవారీగా కోత వేస్తున్నారు. ఇలా ఇతర భాషల ఉన్నతికి ఉత్తర్వులు ఇస్తూ, మాతృభాష తెలుగు ఉసురు తీస్తూ పాలకులు, ఆయా విద్యారంగాల ఉన్నతాధికారులు తెలుగుపై కక్ష కట్టినట్టుగా వ్యవహరించటం దారుణం. దీనిపై భాషా, సాహిత్యాభిమానులు తీవ్రంగా ఆలోచించాలి. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగును ప్రణాళికాబద్ధంగా రద్దు చేసేందుకు కసరత్తు చేస్తున్నారా అన్నట్టుగా పాలకులు వ్యవహరించటం పరిపాటిగా మారిపోయింది. నిజానికి విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యుజిసి) చెప్పినదొకటైతే, ఉన్నత విద్యామండళ్లు చేస్తున్నది ఒకటిగా ఉంటోంది. అన్ని స్థాయిల్లో మాతృభాష తెలుగు ప్రవేశాన్ని విడతల వారీగా రద్దు చేయటం అనేది పాలకులు ఒక మాండేటరీగా పెట్టుకున్నట్టుగా వారి నిర్ణయాలు చాటిచెబుతున్నాయి. దీనిని ఉన్నత విద్యామండళ్లలో ఉన్న మాతృభాషా వ్యతిరేక శక్తులు ఆచరణలోకి తెస్తున్నాయి. ఇలా ఏకకాలంగా అటు పాలకులు, ఇటు అధికారులు తల్లి భాష మీద పగబట్టి రద్దు చేసే ధోరణిని నిరసిస్తూ భాషా సాహిత్య రంగాలకు చెందిన పెద్దలు ముందుకు రావాల్సిన అవసరం చాలా ఉంది. తాము నిర్వహించే ప్రతి సాహిత్య సభ, సమావేశాల్లో ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నీ డిగ్రీ నాలుగో సెమిస్టర్‌లో రద్దు చేసిన ద్వితీయ భాష తెలుగును పునరుద్ధరించాలని తీర్మానించి ప్రభుత్వానికి విజ్ఞాపనలు పంపించాలి. జిల్లాస్థాయి సాహిత్య సంఘాలు జమిలిగా ఉన్నత విద్యామండలికి ఉత్తరాల ద్వారా తమ నిరసన తెలియచెప్పే కార్యక్రమాలు రూపొందించాలి. తద్వారా ఇంగ్లీషు మోజులో మూసుకుపోయిన పాలకుల కళ్లు తెరిపించాలి. భాష ఒక జాతి జీవనాడి. అధ్యయనంలో అంతరించిపోయే భాష క్రమంగా వాడుకలోనూ అంతరించిపోతుందని, ఈ క్రమంలో ఆ జాతే అంతరించిపోతుందన్న సత్యాన్ని తెలుగువారంతా తెలుసుకుని మసలుకోవాల్సిన సందర్భం మనముందు సవాలు చేస్తున్నదన్న నిజాన్ని తెలుసుకోవాలి.

*(ప్రజాశక్తి దినపత్రిక సౌజన్యంతో...)*

**రెక్క**

రహదారి అనకొండ
చెట్లు మింగింది
తారు 'తాగిన' రోడ్డు
ప్రాణాల్ని తీసింది –
మనిషి నీడ
ఏడుస్తోంది !



**–డా॥రమణ యశస్వి,** 98480 78807

–డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

# “మనం మనం బరంపురం...”

నెలక్రితం బరంపురం నుంచీ కవిమిత్రుడు విజయచంద్ర ‘వికాసం’ 47వ వార్షికోత్సవానికి రమ్మని ఆహ్వానించారు. ఫిబ్రవరి నెలలో యేదైనా వొక శని ఆదివారాల్లో నయితే అనుకూలంగా వుంటుందని చెప్పారు. అయితే మరొక సాహిత్య సదస్సులో పాల్గొనడం కోసం జనవరి మూడవ వారంలో కలకత్తాకెళ్ళవలసి రావడంతో, తిరుగు ప్రయాణంలో భువనేశ్వరంలో ఆగి బరంపురం కెళ్ళి రావడానికి సన్నద్ధమయ్యాను.

1970 ప్రాంతంలో బరంపురం నుంచీ వొక సాహితీ ప్రేమికుడు మా నాన్నను కలవడం కోసం దామల్ చెరువు కొచ్చారు. బహుశా అదే నేను బరంపురం గురించి తొలిసారిగా వినడమయి వుంటుంది. ఆ బ్యాంకు వుద్యోగి తాను తీసుకొచ్చిన కెమెరాతో మానాన్న ఫోటో తీసి, ఆ తరువాత బరంపురం నుంచీ దాని ప్రతులు పంపాడు. బహుశా మానాన్న ఫోటోల్లో దానంత అందమైంది మరొకటిలేదు. తరువాతది పోయింది. వీలయితే బరంపురంలో ఆ పాత మిత్రుడ్ని పట్టుకుని ఆ పాత ఫోటోను సంపాదించుకోవాలనే కోరిక చాలా రోజులుగా వుంది. ఆ మిత్రుడే ఆ సమయంలో వుప్పల లక్ష్మణరావు గారి ప్రసక్తి తెచ్చారు.

అదే కాలంలో వుప్పల లక్ష్మణరావుగారి ‘బతుకు పుస్తకం’ ఆంధ్ర జ్యోతిలో ధారావాహికగా వచ్చేదనుకుంటాను. ఆయన రష్యాకెళ్లడం, రష్యన్ స్త్రీని పెళ్లి చేసుకోవడం, తరువాత మళ్లీ తిరిగొచ్చి బరంపురంలో స్థిరపడడం–యిదంతా గొప్ప సాహసగాథగా తోచిందప్పుడు.

తరువాత కాలంలో గిడుగు రామమూర్తి గారిది గూడా బరంపురమేనని తెలిసినప్పుడు వులిక్కిపడ్డాను. తాపీ ధర్మారావు గారి సాహితీ యాత్ర అక్కడి నుంచే ప్రారంభమయిందని తెలిసినప్పుడు ఆ వూరిని గురించి మరింత తెలుసుకునే ప్రయత్నం చేశాను. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం వెళ్లినప్పుడు కళింగాంధ్రలో బరంపురం గూడా ముఖ్యమైన ప్రాంతమనీ, అక్కడ యిప్పటికీ యెక్కువశాతం ప్రజలు తెలుగే మాట్లాడుతారనీ తెలిసింది. అప్పటి నుంచీ బరంపురం వెళ్లి రావాలనే కోరిక వెంటాడుతోంది. చివరికిప్పటికీ అవకాశం దొరికింది.

భువనేశ్వరంలో విమానం దిగేసరికి సేతుపతి ఆదినారాయణ




గారు యెదురు చూస్తూ కనిపించారు. ఆయన బావమరిది ‘బాలి’ తోకలిసి బరంపురానికి కారులో ప్రయాణం. పంటలకోతలు ముగిసిన కాలం గావడంతో దారికి రెండువైపులా ఖాళీ పొలాలే వున్నాయి. కొంతసేపు ప్రయాణం చేశాక ఖుర్దారోడ్డు కూడలి వచ్చింది. కొన్ని తెలుగు కథలలో ఆ కూడలి ప్రసక్తి రావడం గుర్తుకొచ్చింది. మరికొంత ప్రయాణం తర్వాత ‘నిరాకారపూర్’ అనే వూరు తగిలింది. దగ్గరలో పూరీ ఆలయం వుండడం, భువనేశ్వరంలో లింగరాజ కోవెల వుండడం, ఆవూరికి నిరాకారపురమనే పేరుండడం– వీటికంతా వెనక మనకు తెలియని లంకేదో వున్నట్టు తోచింది.

మరికాస్సేపు ప్రయాణం తర్వాత, పర్వతాసానువుల పక్క చిల్కా సరస్సు సరిహద్దొకటి పలకరించింది. దాదాపు వెయ్యి చదరపుకిలో మీటర్ల వైశాల్యముండే ఆ విశాలమైన సరస్సు దగ్గరి నౌకాయాన వుద్యోగాలలో తర్ఫీదు కోసం వెళ్లిన వ్యక్తులంతా జ్ఞాపకం వచ్చారు. తరువాత ప్రసిద్ధమైన గంజాం పట్టణం వచ్చింది. తరువాత కాస్సేపటికి ‘ఛత్రపురం’ అనే వూరొచ్చింది. అది గంజాం జిల్లా రాజధాని. ఆ వూరిలోనే ముళ్లపూడి వెంకటరమణగారూ, గోరాశాస్త్రిగారూ పుట్టారని ఆదినారాయణ గారన్నారు. భువనేశ్వర్ నుంచీ మూడు గంటల కారు ప్రయాణం తర్వాత బరంపురం చేరుకున్నాం.

బరంపురంలో వున్న రెండురోజులూ రెండుక్షణాల్లా గడచాయి. పొద్దున్నుంచీ అర్ధరాత్రి వరకూ సాహిత్య సమావేశాలూ, చర్చలూ, యిష్టాగోష్ఠులూ వుండడమే అందుక్కారణం.

తొలినాడు వుదయాన పదిగంటలకు యిమ్మిడిశెట్టి రమేష్‌గారి యింటిలో కొద్దిమంది మిత్రులతో యిష్టాగోష్టి. రమేష్ గారిల్లు బజారు వీధిలో దాదాపు పట్టణపు నడిబొడ్డులో వుంది. ఆయనకు వ్యాపారాలూ, వ్యవసాయాలూ వున్నట్టుంది. ఆయన యింటిలో ఆయన గదిలో రెండు పొడవాటి అలమరాలనిండా తెలుగు పుస్తకాలున్నాయి. పత్రికల్లో చూసి కావల్సిన పుస్తకాలనంతా ఆయన యింటర్నెట్ ద్వారా తెప్పించుకుంటారట! పొద్దున్నే ఆ యింటికి నన్ను తీసుకెళ్ళిన మిత్రుడి పేరు కొత్తకోట కేదారినాథ్. ఆయన ‘వికాసం’ కోశాధికారి. వృత్తిరీత్యా బంగారు వ్యాపారం. ఆయన పెన్నిధిలా దాచుకున్న ‘ఆటోగ్రాఫ్’ పుస్తకంలో బరంపురం కెళ్ళిన తెలుగు కవుల సంతకాలున్నాయి. ఆ పుస్తకం చివరి పేజీలను చూస్తోంటే ఆయన సిగ్గుపడి దాన్ని తీసేసుకోబోయారు. నేను రెట్టించి అడిగితే ఆ పేజీలు తాను కవితలు రాసుకున్నానన్నారు. బంగారు వ్యాపారానికీ, రసవాదానికీ సంబంధముండడంలో ఆశ్చర్యమేముంటుంది?

వికాసం కార్యదర్శి విజయచంద్రగారు ప్రముఖకవి. దాదాపు 7 కవితా సంపుటాలు ప్రచురించారు. ఆ రోజున అక్కడ కొచ్చిన వికాసం సభ్యులందరూ వుప్పల లక్ష్మణరావుగారినీ, అవసరాల రామకృష్ణరావు గారినీ పదేపదే స్మరించుకున్నారు. అసలు ‘వికాసం’ సాహిత్యసంస్థను స్థాపించినవారు అవసరాల వారేనట! వుద్యోగరీత్యా ఆయన మూడుదశాబ్దాలు బరంపురం లోనే వున్నారట! అంటే ఆయన

ప్రసిద్ధి పొందిన కథలన్నీ బరం పురం లోనే వుట్టాయని అర్థం. అలాగే చాగంటి తులసిగారు గూడా అక్కడే తమ వుద్యోగ జీవి తాన్నంతా గడిపారు. చాసోగారు ఆ వూరికి చాలాసార్లే వెళ్లివచ్చి వుంటారు.

భారతదేశ సాంస్కృతిక పున రుజ్జీవనం 19 వ శతాబ్దంలో కల కత్తాలో ప్రారంభమైంది. యింగ్లీషు వాళ్ళు తమ రాజ్యాధికారానికి వీలుగా వుండేలా భారతీయుల్లోంచి వుద్యోగుల్ని తయారు చేసుకో వడం కోసం ప్రవేశపెట్టిన యింగ్లీషు చదువు ఫ్రెంచి విప్లవ భావాలైన స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాలను కలకత్తా తీరానికి మోసు కొచ్చింది. దాని ప్రభావంతోనే స్వాతంత్ర్య వుద్యమమూ చురుకుగా మొదలయ్యింది. యింగ్లీషు వాళ్ళు తలచిందొకటీ, జరిగింది మరొ కటీ. కలకత్తా నుంచీ పునరుజ్జీవన భావనలు విజయనగరానికి బరం పురందారిలోనే చేరి వుండాలి. అందుకే వ్యావహారిక భాషావుద్య మంలో బరంపురంవాసి గిడుగు రామమూర్తి పంతులుగారు ప్రారం భిస్తే ఆయన సహాధ్యాయి గురజాడ అప్పారావుగారు విజయనగరంలో తెలుగు ఆధునిక సాహిత్యానికి యుగకర్తగా పాదులువేశారు. తాపీ ధర్మారావు గారు తెలుగు సినిమాకు వ్యావహారిక భాషను నేర్పించాడు.

బరంపురంలో సినిమా థియేటరు 1927 చాటికే వెలిసింది. 1922లోనే బరంపురంలో "పుష్కకాలం" అనే లిఖిత మాసపత్రిక పుట్టింది. అప్పుడు జర్మనీలో వున్న వుప్పల లక్ష్మణరావుగారు ఆ పత్రిక కోసమనే "అతడు-ఆమె" నవలను రాయడం ప్రారంభించారు. ఆ నవల మొదటి భాగమంతా 1926-27 సంవత్సరాల కాలంలో ఆ పత్రికలో ధారావాహికగా ప్రచురించారు. ఆ నవల మొదటి భాగపు ముద్రణా ప్రతిని లక్ష్మణరావుగారి కుటుంబ సభ్యులంతా ముందుగా చదివారట! ముఖ్యంగా లక్ష్మణరావుగారి అమ్మగారు పెదవి విరిచేసి "మొగుడూ పెళ్ళామూ కీచులాట యేమంత బాగులేదు. దేశంలో స్వాతంత్ర్యయుగం జరుగుతూవుంటే, యీమహా సంగ్రామా నికి పూర్వరంగంగా మంచి నవల చిత్రించివుంటే బాగుండేది. నవ లకు కొంత విలువ వుణ్ణు. ఇప్పటి రూపంలో నవల అతిసామాన్యంగా వుంది అనేశారట! ఆమె చెల్లెల్లందరూ అదేమాటన్నారట! అప్పుడు- అంటే 1950లో వుప్పల లక్ష్మణరావుగారు ఆ నవలనంతా తిరిగి రాశారట! "అతడు-ఆమె" కు ఆయన రాసిన ముందుమాటలో యీ విషయాలనంతా చదివినప్పుడు ఆధునిక తెలుగు సాహిత్య పునరు జ్జీవనం బరంపురంలోనే మొగ్గలు తొడిగిందన్న విషయం స్ఫురిస్తుంది. ఆయన కుటుంబం రవీంద్రనాథ ఠాగూరు కుటుంబంలా వో లలిత కళా సమితిగా తయారయ్యింది. మన మాజీ రాష్ట్రపతి వి.వి. గిరిగారు లక్ష్మణరావుగారికి చాలా దగ్గరి చుట్టమే! వి.వి.గిరిగారు పుట్టి పెరి గిందీ బరంపురమే!

"అతడు-ఆమె నవల చివరిభాగాన్ని 1970 ల తర్వాత వుప్పల లక్ష్మణరావుగారు చెబుతూండే వికాసం సభ్యులే రాస్తుండేవారట! అందులోని కొంత భాగానికి తానే లేఖకుడినని సేతుపతి ఆదినారా యణగారు చెబుతూ ఆ రోజుల్లో వుప్పల లక్ష్మణరావు గారుండే యింటిని చూపెట్టారు. యిప్పుడా యింటిని యింకెవరో కొనేశారు. దాని రూపురేఖలు మారిపోయేలా యిప్పుడా యింటికి రెండవ అంతస్థు కట్టుకున్నారు. క్రమం తప్పకుండా వికాసం సమావేశాలు జరపాలనీ, సమావేశాలు క్రమశిక్షణతో జరగా లనీ, ప్రతి సమావేశంలోనూ సభ్యులు కొత్త రచనలు చదవాలనీ, తర్వాతి వారంలో దానికి మిగిలిన వాళ్ళు సమీక్షలు రాసుకురావాలనీ లక్ష్మణ రావుగారొక మార్గాన్ని యేర్పరచి వెళ్ళారు. యిప్పటికీ వికాసం సభ్యులు ఆ మార్గం తప్పకుంతా నడవడమే గొప్ప విషయం.

భాషా ప్రయుక్తరాష్ట్రం మొదట పోరాటం చేసినవాళ్ళు తెలుగు వాళ్ళుగాదనీ, ఆపని ముందుగా చేసినవాళ్ళు వొరిస్సా వాళ్ళేననీ బరంపురం మిత్రులు చెప్పారు. బెంగాలీ, తెలుగు అనే యిద్దరు సోదరుల నీడలో వున్న చిన్న తమ్ముడు 'ఒరియా' తనదైన అస్తిత్వంకోసం పోరాడ్డంలో పొరబాటేమీ లేదు. తనదైన రాష్ట్రంవచ్చాక తమదైన ప్రాంతాలను యితర రాష్ట్రాలకప్పగించాల్సిన స్థితి ఒరియాకు రాలేదు. కానీ తెలుగు వాళ్ళ చరిత్ర అలాంటిది గాదు. దాదాపు దక్షిణ భారతమంతా వ్యాపించిన తెలుగు వాళ్ళు భాషాప్రయుక్తరాష్ట్రం కోసం పోరాడ్డమే పొరబాటు.

21 వతేదీ సాయంత్రం 7 గంటలకు వికాసం 47వ వార్షికోత్సవ సభ ఆంధ్రభాషాభివృద్ధినీ సమాజం వేదికలో జరిగింది. పట్టణం మధ్యలో ఆ వుండే ఆ సమాజ మందిరం రాజమండ్రిలో వున్న వీరేశలింగం పంతులుగారి పాతయిల్లు లాగే వుంది. 1909లో ప్రారంభమయ్యిందట ఆ భవనం. మరమ్మత్తుల కోసం కొంత భాగం మూసివేశారు. అవి కూడా సిద్ధమయితే అక్కడ పెద్దపెద్ద వేడుకలు జరుపుకోవచ్చు.దాదాపు పజ్జెనిమిదడుగుల యెత్తున్న ఆ పాత హాలులో



దాని నిర్మాణానికై శతాబ్దం క్రితం విరాళాలిచ్చిన వదాన్యుల పేర్లున్న శిలాఫలకాలున్నాయి. ఆపేర్లన్నీ మన పాత తరం వైతాళికులను గుర్తుకు తెచ్చేవే!

సభకు వికాసం వుపాధ్యక్షులు రామనరసింహారావుగారు అధ్యక్షత వహించారు. ప్రముఖ కథకులు కాళీపట్నం రామారావు గారికి దగ్గరి బంధువూ, కథకులూ అయిన ఎమ్మెస్సీ గంగరాజుగారు గూడా ఆవూరి వాళ్ళే! అలాగే తెలుగు- ఒరియా తెలుగువాళ్లకు వారధిలా పనిచేస్తున్న తుర్లపాటి రాజేశ్వరిగారిది గూడా బరంపురమే! ఆమె యిటీవల 'అభినవాంధ్ర సభ- 1933, బరంపురం' అనే ఆధునిక సాహితీ రూపకాన్ని రాసి ప్రచురించారు. 1910లో బరంపురంలో జరిగిన సహవర్ణ, సహపంక్తి భోజనాల సంగతిని జ్ఞాపకం చేస్తూ, 1933లో జరిగిన అభినవాంధ్ర కవి పండిత సభను ఆమె రూపకంగా రాసి ఆనాటి వైభవాన్ని పునర్నిర్మించడానికి ప్రయత్నించారు. ఆ సభ వాళ్లు వ్యావహారిక భాష వాడుకను అత్యవసరమైనది గుర్తించి ప్రతిపాదన చేశారప్పుడు. ఆ సభలో గిడుగు రామమూర్తి పంతులుగారితో బాటు



చిలుకూరి నారాయణరావు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, దేవుల పల్లికృష్ణశాస్త్రి, తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, వేదుల సత్యనారాయణ శాస్త్రి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, చింతా దీక్షితులు, గుండిమెడ వెంకటసుబ్బారావు, మండపాక పార్వతీశ్వరశాస్త్రి, దేవరాజు వెంకట కృష్ణారావు, తాపీ ధర్మారావు, గిడుగు సీతాపతి శ్రీశ్రీ, కొంపెల్ల జనార్ధనరావు మొదలైన సుప్రసిద్ధులంతా పాల్గొన్నారు.

22 తేదీ వుదయాన మళ్లీ వికాసం సభ్యులు సాహిత్యగోష్ఠి యేర్పాటు చేశారు. సభను క్రమశిక్షణతో నిర్వహించేపని యీసారి విజయచంద్రగారు తీసుకున్నారు. సభ చిన్నదే అయినా ఆహ్వానం, వందన సమర్పణ వంటివేవీ విడిచిపెట్టక పోవడం, నాలాంటివారికి యిబ్బందిగా తోచినా, సభా నిర్వహణకు మాత్రం బాగా తోడ్పడ్డాయి. అప్పుడా గోష్ఠికి వచ్చిన పన్నెండుమందీ తమ రచనేదో వొకటి చదివే వినిపించారు. శిల్పమూ, ఆధునికతావంటి విమర్శాసూత్రాలను పట్టించుకోగలిగిన చోట లేక పోయినా, వాళ్ళు తీసుకున్న వస్తువులన్నీ అభ్యుదయకరమైనవే గావడం అక్కడి విశిష్టత. రవివర్మ అనే యింజ నీరు కవితను చదివారు. తిరుమల అనే వ్యాపారి గూడా నాన్న గురించిన కవితను చదివారు. తుర్లపాటి రాజేశ్వరిగారూ, కోకా సావిత్రిగారూ కథలు చదివారు. యీగోష్ఠికి వేదికగా తన యింటిని వాడుకోనిచ్చిన యిమ్మిడిశెట్టి రమేష్‌గారు గూడా కవిత చదివారు. కోకాసావిత్రిగారు అక్కడే బ్యాంకులో వుద్యోగం చేసి యిటీవలే పదవీ విరమణ చేశారు. ఆమెకు యింగ్లీషులో యెమ్మే పట్టావుంది. ఆమె తన తల్లి జీవితకథనూ, మరో డాక్టరు గారి జీవిత కథనూ పుస్తకాలుగా ప్రచురించారు.

బరంపురం వీధులూ, మనుషులూ తెలుగుతనాన్ని గుబాళిస్తూనే వున్నాయి. కేదారినాథ్‌గారు తాము చదువుకున్న తెలుగు పాఠశాలకు తీసుకెళ్లారు. అక్కడి గోడలపైన తెలుగు సూక్తులు వెలిగిపోతున్నాయి. అదినారాయణగారు ఆవూర్లోనే బలివాడ కాంతారావు గారి అమ్మాయి వుండేదనీ, ఆయన అసలుపేరు బలివాడ కాంతారావు పట్నాయక్ అనీ గుర్తుచేశారు. నాకు రఘునాథ్ పాణిగ్రాహి (గొప్ప గాయకుడు) సుబ్బారావు పాణిగ్రాహి (గొప్ప విప్లవ కారుడు) గుర్తుకొచ్చారు. బరంపురం విజయనగరాల మధ్య ప్రాంతాల్లో శ్రీకాకుళ మన్యపోరాటాలు జరగడం జ్ఞాపకం వచ్చింది. తెలంగాణా విప్లవ పోరాటాలకు గూడా మార్గదర్శులైన గొప్ప విప్లవకారులు గుర్తుకొచ్చారు. భూషణంగారి కథలన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఆదినారాయణ గారు విఠలాచార్య జానపద సినిమాల కంతా మాటలు, పాటలు రాసిన జి.కె. మూర్తిగారిది గూడా బరంపురమేనని చెప్పారు.

బరంపురంలో యిప్పుడూ, వొకప్పుడూ జీవించిన, జీవిస్తున్న వాళ్లలో చాలామంది యిప్పటి తెలుగురాష్ట్రాల్లోనే పుట్టారు. అక్కడ పుట్టినవాళ్లు చాలామంది యిప్పుడు అనేక ప్రాంతాలకు వలసలు వెళ్లారు. ఏ కుటుంబంగానీ అయిదుతరాల కాలం వొక చోటులో వుండడం సాధ్యంకాదని శాస్త్రవేత్తలు చెబుతారు. అవసరాల కోసం మనుషులు వలసలు వెళ్లారు. వాళ్ల ప్రాంతాలూ, జీవితాలూ మారిపోతాయి. కానీ అందరూ తమ తల్లిభాష కోసం, తమదైన సంస్కృతిని నిలుపుకోవడం కోసం ఆరాట పడతారు. అవసరమైతే పోరాటాలకు గూడా సిద్ధమవుతారు.

భాషా ప్రయుక్తరాష్ట్రం మొదట పోరాటం చేసినవాళ్ళు తెలుగు వాళ్ళుగాదనీ, ఆపని ముందుగా చేసినవాళ్ళు వొరిస్సా వాళ్ళేననీ బరంపురం మిత్రులు చెప్పారు. బెంగాలీ, తెలుగు అనే యిద్దరు సోదరుల నీడలో వున్న చిన్న తమ్ముడు 'ఒరియా' తనదైన అస్తిత్వం కోసం పోరాడ్డంలో పొరబాటేమీ లేదు. తనదైన రాష్ట్రంవచ్చాక తమదైన ప్రాంతాలను యితర రాష్ట్రాలకప్పగించాల్సిన స్థితి ఒరియాకు రాలేదు. కానీ తెలుగువాళ్ళ చరిత్ర అలాంటిది గాదు. దాదాపు దక్షిణ భారత మంతా వ్యాపించిన తెలుగు వాళ్ళు భాషాప్రయుక్తరాష్ట్రం కోసం పోరాడ్డమే పొరబాటు.

అనుకూలమైన పాలనకోసం దేశాన్ని చిన్న విభాగాలుగా విభజించడం అనివార్యం. కానీ యేరాష్ట్రంలో వున్నా ప్రజలు తమదైన భాషనూ, సంస్కృతినీ అలవరచుకోవడానికి కావల్సిన పరిస్థితిని రూపొందించాలి. 'తొండనాడు కథలు' 'మొరసునాడు కథలు' అనే రెండు కథాసంపుటాలు ఎల్లలు లేని తెలుగువాళ్ళను గుర్తించడం తోబాటూ, భారతీయ భాషలమధ్య వుండవలసిన సోదరప్రేమను గొప్పగా నిరూపించిచూశాయి. బరంపురంలో జీవించిన ప్రముఖ కథకులు అవసరాల రామకృష్ణ రావుగారు "సహజీవన సౌభాగ్యం" అనే నవల రాశారు. దానిలోని కథవేరే అయినా యిప్పుడు భారతీయ భాషల కంతా కావలసింది సహజీవన సౌభాగ్యమే!

రెండు తెలుగు రాష్ట్రాల లోపల జరుగుతున్న సాహిత్యం పరిణామాలను గమనించినప్పుడు, యీ రాష్ట్రాలకవతలున్న తెలుగు వాళ్ళ పరిణితి స్పష్టంగా అర్థమవుతుంది. పోగొట్టుకునే వరకూ తన కున్న దాని గొప్పతనం తెలుసుకోలేక పోవడం మానవుడి బలహీనత. బరంపురం వికాసాన్ని చూసినప్పుడు తెలుగుతల్లి గూడా యిప్పుడు ప్రవాసంలోనే వుందని తెలుసుకోక తప్పడంలేదు. ❋



# నెట్ బ్యాంకింగులో, ఏటియంలలో తెలుగుసేవలు

-రహ్మానుద్దీన్ షేక్
96869 03386

ప్రస్తుత పరిస్థితులలో పెద్ద నోట్ల రద్దుకు కారణం నల్లధనాన్ని అరికట్టడమనే ధ్యేయాన్ని వదిలి నోట్ల వాడుకను తగ్గిస్తూ డిజిటల్ చెల్లు బాట్లను ప్రోత్సహించడమే లక్ష్యంగా మారిపోయింది. కొన్ని దశాబ్దాలుగా బ్యాంకింగ్ వ్యవస్థ ఉన్నా, ఆ కార్యకలాపాలు తెలుగు (భారతీయ భాషలలో) లో అందుబాటులోకి రావడం చాలా తక్కువే. వ్యవస్థీకృత మార్పుకు పెడమొహం పెట్టే అధికారులు, సహకారం లేని పరికరాల వల్ల నిస్సహాయంగా వినియోగదారుడు బలవంతంగా ఆంగ్ల-హిందీ మాటలకి మారాల్సి వచ్చింది. ఐతే ప్రస్తుతం ఉన్న పరిస్వితుల్లో వినియోగదారుడి అవసరాలను అందుకోలేకపోతే అతడిని వేరే బ్యాంకుకు వదులుకునే పోటీ పరిస్థితి నెలకొంది. అలానే అన్నిరకాల కంప్యూటర్ ఉపకరణాలు తెలుగులోనే అందుబాటులోకి వచ్చాయి. ఇక మారాల్సింది బ్యాంకు సిబ్బంది, వారి ఆలోచన విధానం మాత్రమే! ప్రజలు తెలుగులోనే మాట్లాడటం వలన తెలుగు కాల్ సెంటర్లు ఏర్పాటు చెయ్యాల్సి వచ్చింది. ప్రజలు తెలుగులోనే కార్యకలాపాలు చేస్తామని పట్టుబడితే అంతా తెలుగుమయం చేసుకునే సదవకాశం మనముందు ఇప్పుడు ఉంది. ఇదే సరైన సమయం. ఇప్పుడు గనుక మనం సరిగ్గా ప్రతిస్పందించక పోతే శాశ్వతంగా మన జాతిని ఆంగ్ల భాషకో - హిందీ భాషకో దాసులని చెయ్యాల్సి వస్తుంది కూడా!

డబ్బు వాడే ప్రతి చోటా ఆప్స్ అనీ, వాలెట్స్ అనీ, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, వగైరాల వాడకం పెరుగనుంది. ఇప్పటికే పేటీఎం లాంటి అప్లికేషన్లు తెలుగుకు వచ్చేసాయి. కానీ ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేవలం ఆంగ్లం హిందీ భాషలలోనే పని చేస్తోంది. హిందీలో ఉన్న అన్ని సేవలను తెలుగుకు మార్చటం పెద్ద సమయం పట్టే విషయం కాదు. అయినా ప్రజల నుండి డిమాండ్ లేదన్న సాకుతో ప్రభుత్వరంగ బ్యాంకులు కాలం గడిపేస్తున్నాయి. ప్రయివేట్ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచే స్తోమత ఉన్నవారికి ఎలాగూ తెలుగు అనవసరం. ప్రతి బ్రాంచిలో అర్జీలన్నీ తెలుగులోనే తీసుకునే బ్యాంకులు-అన్ని ఫారాలను తెలుగులో ప్రచురించే బ్యాంకులు. నెట్ బ్యాంకింగ్ వల గూడులో కనిపించే పాఠ్యాన్ని హిందీ, ఇంగ్లిష్‌కు అదనంగా తెలుగునూ చేర్చటానికి మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు.

నేటికీ ప్రభుత్వ రంగ బ్యాంకులలో తెలుగులో ఫారాలు ఉన్నా, ఇంగ్లిష్ లో నింపడానికి మాత్రమే సిబ్బందిని ఏర్పాటు చేస్తారు. చెక్కుల్లో, డ్రాఫ్టుల్లో ఇంగ్లిష్ లోకి మార్చుకొని టైపు చెయ్యాలి కాబట్టి అని ఒక వాదన కూడా ఉంది. మరి కనీసం రాష్ట్రం లోపలే చెల్లుబాటు చేసుకోబోయే డ్రాఫ్టులు చెక్కులు తెలుగులో కూడా ఉండేలా చేయవచ్చుగా. ఆ వైపు బ్యాంకు అధికారులు ఆలోచించాలి. తగు చట్టాలు చేసి బ్యాంకులకు ప్రభుత్వమే ఉత్తర్వులు జారీ చేసి తెలుగు అమలు బ్యాంకుల్లో సైతం మరింతగా జరిగేలా చూడాలి.

నేరుగా బ్యాంకుకు వెళ్ళి జరిపే కాగితపు ఉత్తర ప్రత్యుత్తరాలు ఒక ఎత్తైతే, జాలం (నెట్) ద్వారా, చరవాణి ద్వారా జరిపే బ్యాంకు ఉత్తరప్రత్యుత్తరాలు మన రోజువారీ లావాదేవీలను మరింత ప్రభావితం చేయనున్న అంశాలు. ముఖ్యంగా డబ్బు రహిత వ్యవస్థలో వీటి ప్రాధాన్యత మరింత పెరగనుంది. బ్యాంకులు కూడా ఎక్కువగా కస్టమర్ సెర్విస్ డెస్కులు, కాల్ సెంటర్లు ప్రారంభిస్తున్నాయి, మరింత పెద్ద స్థాయిలో ప్రారంభించనున్నాయి. బ్యాంకుల్లో జరిపే కాగితపు లావాదేవీల ఫారాలు తెలుగులో అందుబాటులో లేని చోట మనమే తెలుగులో తయారు చేసి పంపిణీ చేయవచ్చు కూడా. పాత నోట్ల బదిలీ, పాత నోట్ల జమ జరిగినన్నాళ్ళూ ఆయా ఫారాలు ఆంగ్లంలో ఉండి చాలా మంది ప్రజలకు ఇబ్బంది కలిగించాయి. బెంగుళూరులో, చెన్నైలో కొందరు యువకులు ఈ దరఖాస్తును కన్నడ, అరవం లలోకి అనువదించి పంపిణీ చేసి అటు బ్యాంకు వారికీ, ఇటు మామూలు ప్రజలకు పనిని సులువు చేసారు. అదే మన తెలుగునాట ఇలాంటి ఫారం తొలి రోజుల్లో ఆంగ్లంలోనే ఉంటే ఐదు-పది రూపాయలు తీసుకుని వ్రాయసగాళ్ళు వ్రాసి పెట్టారు. తర్వాత్తర్వాత కొన్ని బ్యాంకులు తెలుగులో తెచ్చినా అందరికీ అందుబాటులోకి రాలేదు. ఇక ముందు ఇలాంటి పరిస్థితి ఏర్పడిన ప్రతిసారీ తెలుగు యువకులు ఆంగ్లం రానివారికి తెలుగులోనే ఆయా ఫారాలను అందిస్తే బాగుంటుంది.

ఏటీఎం లో కనిపించే తెర, ఆ తెరపై పేర్లు అన్నీ కూడా తెలుగులో తప్పనిసరిగా ఉండాలి, లేని పక్షంలో ఆ ఏటీఎం తాలూకు బ్యాంకుకు మనం విధిగా ఆ విషయాన్ని తెలిపితే తెలుగులో ఏటీఎం సమర్ధవంతంగా వాడవచ్చు.

ఇక నెట్ బ్యాంకింగ్ వ్యవస్థలోకి తెలుగు రావాలంటే ప్రతి వినియోగదారుడు కింది స్థాయి నుండి బ్యాంకు అధికారులను పదే పదే అడగటం ద్వారా మార్పును తేవొచ్చు. మరో వైపు ప్రభుత్వం కూడా బ్యాంకుల సేవలు తెలుగులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

పేటీఎం తెలుగులో ఉన్నప్పటికీ ఆ తెలుగు పేర్లలో చాలా వరకు అనువాదాలు అసాధారణంగా, అర్థం కానివిగా ఉన్నాయి. అనువాదాలు పండితులతో కాక సాధారణ జనం వాడే పదజాలంతో చేస్తే మంచిది.

ఎస్.ఎం.ఎస్ మొదలు అన్ని ఉపకరణాలు తెలుగులో అందుబాటులో ఉండేందుకు అన్ని రకాల సాంకేతికాలు అనువుగా ఉండగా, సాధారణ ప్రజలకు తెలుగు తప్ప ఆంగ్లం అర్థం కాని ఈ పరిస్థితుల్లో తెలుగులో బ్యాంకు సేవలు లేవంటే అందుకు కారణం కేవలం బ్యాంకు సిబ్బంది అలసత్వమే!

❋

# కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ పాపినేని శివశంకర్‌తో ముఖాముఖి

**సాహితీ త్రిముఖులు డా॥ పాపినేని శివశంకర్ కవితా సంపుటి 'రజనీగంధ' కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా ఆయనతో డా॥ నార్నె సురేష్‌బాబు ఇంటర్వ్యూ ...**



సురేష్ బాబు: **'రజనీగంధ' కవితా సంపుటికి 2016 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారా?**

శివశంకర్: మూడున్నర దశాబ్దాల సాహిత్య కృషికి జాతీయ స్థాయి అవార్డు రావడం సంతోషదాయకమే. అయితే వ్యక్తిని పొగడటం కన్నా అతని రచనల్ని విశ్లేషించి, విలువగట్టటం ముఖ్యం అనుకుంటాను.

సు.బా. **అవార్డు రావటానికి కారణమైన విశేషాంశాలు 'రజనీగంధ' లో ఏమున్నాయో వివరించండి.**

శి.శం. 'రజనీగంధ' ఏకధార కాదు. అనేక ధారల సమ్మేళనం. స్త్రీ, పురుష సంబంధాలు, మానవీయత, సర్వప్రాణి మైత్రి, పిల్లల పెంపకం, సామాజిక సంఘర్షణలు, ప్రాకృతిక దృశ్యాలు, వ్యక్తిగత అనుభవాలు, అనుభూతులు మొదలైన అనేక విషయాలు ఇందులో కవితా వస్తువులు. వాటిద్వారా కవి మానవజీవిత సారాంశం వెతుకుతూ తనకుతాను 'అన్వేషి' గా గుర్తిస్తాడు. సమకాలీన వచన కవిత్వంలో కనపడని తాత్వికత 'రజనీగంధ' ప్రత్యేకత.

సు.బా. **పల్లెటూరు వ్యవసాయ కుటుంబంనుంచి వచ్చిన మీకు సాహిత్యం పై ఆసక్తి ఎట్లా ఏర్పడింది?**

శి.శం. మాది గుంటూరు జిల్లా నెక్కల్లు గ్రామం. అప్పట్లో ఏ సౌకర్యాలు లేవు. మానాన్న వెంకటకృష్ణారావు ఇరవై ఎకరాల మెట్ట రైతు. అమ్మ శాంతమ్మ భక్తి గీతాలు, లంకాయాగం, బాలనాగమ్మ మొదలైన కథాగేయాలు పాడుతుండేది. ఊళ్ళో కురుక్షేత్రం, రామాంజనేయ యుద్ధం, బ్రహ్మంగారి నాటకం మొదలైనవి ఆడుతుండేవాళ్ళు.

తుళ్ళూరు హైస్కూల్లో చదువుకునే రోజుల్లో అప్పుడే స్థాపించిన శాఖాగ్రంథాలయంలో చందమామ మొదలు ఎన్నో పత్రికలు, సాహిత్య గ్రంథాలు, విస్తారంగా చదివేవాడిని. ఛందస్సు నేర్చుకొని పద్యాలు, ఆ తర్వాత కవితలు, కథలు గిలికేవాడిని. ఒకరోజు క్లాసులో విన్న Where the mind is without fear అనే ఠాగూర్ గేయం పెద్ద ప్రభావమే వేసింది. పద్యాలు తేలిగ్గా ధారణ చెయ్యగలిగేవాడిని. ఇటువంటివన్నీ తొలిముద్రవేసి ఉంటాయి. దానికితోడు గురువుల జ్ఞానదానం. ఏ కవి అయినా బాల్యంలోనే పుడతాడు.

సు.బా. **పల్లెటూరి నుంచి వచ్చిన మీకు ఆ గ్రామీణ నేపథ్యం సాహిత్యంలో ఏ విధంగానైనా ఉపయోగపడిందా?**

శి.శం. పల్లెటూరివాడికి నేలతో, ప్రకృతితో గాఢ సంబంధం ఉంటుంది. వ్యవసాయదారుడి కుటుంబానికి పశువుల్తో, పంటలతో విడదీయరాని బంధం ఉంటుంది. ఆ సజీవ సంబంధం నా రచనల్లో అంతర్లీనంగా వ్యాపించి ఉంటుంది. 'మట్టి గుండె', 'చింతల తోపు', 'సగం తెరిచిన తలుపు' కథల్లో గ్రామీణత, గుంటూరుమెట్ట ప్రాంతం భాష, గ్రామీణమానవ సంబంధాలు మీరు గమనించవచ్చు. అదంతా మట్టివాసనే.

గ్రామీణ జీవన విధ్వంసం నేపథ్యంలో 'నాగలి విరిగినప్పుడు', 'ఋతుపవనం', 'బెట్ట', 'పసిపాట', 'పరాయివిత్తనం', 'పొలాల కల' మొదలైన కవితలు వెలువడ్డాయి.

సు.బా. **తాడికొండలోని బి.ఎస్.ఎస్.బి.కళాశాలలో 33 సంవత్సరాలు అధ్యాపకులుగా పనిచేశారుకదా! మీ సాహిత్యకృషికి బోధనానుభవం ఏమైనా దోహదం చేసిందా?**

శి.శం. వృత్తి, ప్రవృత్తి ఒకటే కావడం కలిసివచ్చింది. బోధన అంటే నా దృష్టిలో నిరంతర సాధనే. ఆ సాధనలో అనేక సాహిత్య, సాంస్కృతిక విషయాల గురించి జ్ఞానం పొందుతాం. ఆ జ్ఞానం సాహిత్య సృజనకి పరోక్షంగా తోడ్పడింది. బోధించేటప్పుడు ఆయా అంశాల పట్ల వివేచనాత్మక స్పష్టత వస్తుంది. అది విమర్శరచనలో ఉపయోగపడింది.

సు.బా. **మీ సాహిత్యాధ్యయనం ఎలా సాగింది?**

శి.శం. ఎవ్వరైనా గొప్ప చదువరి కానిదే గొప్ప రచయిత కాలేరు. నేను ముందు నన్నపనేని అంకినీడు, నాగళ్ళ గురుప్రసాదరావు, తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి, ఓరుగంటి నీలకంఠ శాస్త్రి మొదలైన గురువుల చలువతో ప్రాచీన సాహిత్యం బాగా అధ్యయనం చేశాను. కొన్నివేల పద్యాలు ఇప్పటికీ కంఠస్థమే. తిక్కన, పోతన ఇష్టమైన కవులు. ఆధునిక సాహిత్యంలో శ్రీపాద, శ్రీశ్రీ, తిలక్,

కొడవటిగంటి కుటుంబరావు, మాధవపెద్ది గోఖలే మొదలైనవాళ్ళు నచ్చుతారు.టాగూర్, ప్రేమ్‌చంద్, శరత్, విభూతిభూషణ్ మొదలైన దేశీయ రచయితలతోపాటు గొగోల్, టాల్‌స్టాయ్, దొస్తొయెవ్‌స్కీ, షేక్స్పియర్, హెమింగ్వే, ఇలియట్ మొదలైన విదేశ రచయితల్ని అధ్యయనం చెయ్యటం సృజనాత్మకతకి చాలా తోడ్పడింది. తెలుగు రచయిత తెలుగుకే పరిమితమయితే చాలా నష్టం జరుగుతుంది. రచయిత బహుముఖీనుడు కావాలి. చరిత్ర, తత్వశాస్త్రం కూడా నాకిష్టమైన విషయాలు.

సు.బా. **శివశంకర్‌ది బహుళ తాత్విక దృక్పథం అంటారు? ఏ యే భావ జాల ప్రభావాలు మీ దృక్పథంలో ఉన్నాయి?**

శి.శం. మానవ జీవితసారాంశం తెలుసుకోవటానికి కేవలం ఒక దృక్పథం, సిద్ధాంతం చాలవని నా అభిప్రాయం. ఉపనిషత్ చింతన, బౌద్ధ దర్శనం, మార్క్సిజం, అస్తిత్వవాదం, ఎరిక్ ఫ్రామ్ ఆలోచనా విధానం మొదలైనవన్నీ నామీద ప్రభావం చూపించాయి. ఇటీవల ప్రపంచీకరణ నేపధ్యంలో వేగంగా మారుతున్న ఆధునిక సమాజాన్ని విశ్లేషింటానికి 'ద్రవాధునికత' అనే సరికొత్త సాధనం ఉపయోగించాను.

సు.బా. **ఇప్పటిదాకా మీనుంచి ఎన్ని రచనలు వచ్చాయి?**

శి.శం. కవితా సంపుటులు ఐదు; 1. స్తబ్ధత-చలనం, 2. ఒక సారాంశం కోసం, 3. ఆకుపచ్చని లోకంలో, 4. ఒక ఖడ్గం ఒక పుష్పం, 5. రజనీగంధ. కథాసంపుటులు రెండు; 1. మట్టి గుండె, 2. సగం తెరిచిన తలుపు. విమర్శా గ్రంథాలు మూడు; 1. సాహిత్యం - మౌలిక భావనలు, 2. నిశాంత, 3. ద్రవాధునికత. 'తల్లీ నిన్ను దలంచి' ప్రాచీన కవిత్వ విశ్లేషణ, వివిధ పత్రికల్లో, మాధ్యమాల్లో 250 దాక కవితలు, 300 పైగా వ్యాసాలు, 50 పైగా కథలు వెలువడి ఉంటాయి.

సు.బా. **మీరు వ్రాసిన పుస్తకాల్లో మీకుబాగా నచ్చినవేమిటి? ఎందుకు?**

శి.శం. కవిత్వంలో 'ఒక ఖడ్గం ఒక పుష్పం', 'రజనీగంధ' పరిపక్వ రచనలుగా భావిస్తాను. అవి కేవలం ఏవో ఉద్యమాల నేపధ్యంలో వచ్చినవి కావు. నావైన పరిశీలనలు, ప్రతిపాదనలు, అన్వేషణా ఫలితాలు అందులో ఉంటాయి. 'జీవితం ఒక అద్భుత పుష్పం వికసించే ప్రక్రియ' అంటుంది రజనీగంధ. విమర్శ పుస్తకాల్లో 'సాహిత్యం -మౌలిక భావనలు' విలక్షణమైనది.

సు.బా. **ఆధునిక కవిత్వంలో అస్పష్టత అనేకచోట్ల కనిపిస్తుంటుంది. అటువంటి కవిత్వం పదికాలాలపాటు నిలబడుతుందంటారా?**

శి.శం. కవి పాఠకుల మధ్య ఏర్పడిన అసంబంధ ఫలితమే అస్పష్టత అని నా నిర్వచనం. గహనమైన ఒక సంక్లిష్ట విషయాన్ని కవి లోతుగా వ్యాఖ్యానిస్తున్నప్పుడు, కవి నూతన అభివ్యక్తి పద్ధతి అవలంబించినప్పుడు ఆ కవిత్వం ఆ అవగాహనాస్థాయిలేని పాఠకుడికి అస్పష్టంగా తోచవచ్చు. ఆచారి బైరాగి 'నూతిలో గొంతుకలు' టి. యస్. ఇలియట్ 'వేస్ట్‌లాండ్' మొదలైనవి ఈ కోవలోకి చేరతాయి. ఇక్కడ పాఠకుడే కష్టపడాలి. అర్ధ, తాత్పర్యాల పద్ధతిలో ప్రాచీన కవిత్వాన్ని అర్ధం చేసుకున్నట్లు ప్రయత్నిస్తే కుదరదు.

రెండోరకం కవి వైఫల్యం. చెప్పదలచిన భావం కవి మనస్సులోనే స్పష్టమైన ఆకృతి దాల్చినప్పుడు, కొత్తగా చెప్పాలనే తాపత్రయంతో అన్వయం భావిపదచిత్రాలమధ్య ఉండాల్సిన సామరస్యం కోల్పోయినప్పుడు ఆ కవిత్వం పాఠకుడికి అస్పష్టమవుతుంది. గాఢత కోల్పోకుండా సరళత సాధించడమనేది ఆధునిక కవికి పెద్ద సవాలు.

సు.బా. **మీ కథారచనతో ఏం సాధించారు?**

శి.శం. 'మట్టి గుండె, సగం తెరిచిన తలుపు, చివరి సముద్రం మొదలైన కథలు విలువైనవిగా భావిస్తాను. రైతుబిడ్డకి మట్టితో ఏర్పడే పరాయితనం (Alienation) వస్తువుగా సాగిన 'మట్టిగుండె' తెలుగులో వచ్చిన నూరు ఉత్తమ కథల్లో ఒకటిగా గుర్తించబడింది. 'చివరి పిచ్చుక' జాతీయస్థాయి అవార్డు పొందింది. ఇక 'సముద్రం' తెలుగు కథా రచనలో మధ్యమపురుషుల విలక్షణ శిల్పంతో సాగిన కథ.

సు.బా. **'విమర్శ మీ మూడో కన్నుగా' సాహితీత్రిముఖుడు అన్పించుకున్నారు. 'సాహిత్యం- మౌలిక భావనలు' విమర్శనా గ్రంథం ద్వారా నిగ్గు తేల్చిందేమిటి?**

శి.శం. ఆధునిక సాహిత్య విమర్శకవసరమైన సాధనాలు, భావనల పరికల్పన, అన్వయం అందులో ఉంటాయి. వస్తువు, రూపం, అవిచ్ఛిన్నత, అస్పష్టత, సంక్లిష్టత, అశ్లీలం మొదలైన భావనల్ని (Concepts) తొలిసారిగా నిర్వచించి సాహిత్యానికి అన్వయించాను. అలాగే 'నిశాంత' 'నిసర్గత' (Spontaneity), ధిక్కారం మొదలైన అంశాల్ని ప్రతిపాదించాను.

సు.బా. **తెలుగులో మాండలికాలు ఉపయోగించడం వల్ల అన్ని ప్రాంతాలవారికీ సమానంగా అర్థం కావటంలేదని అంటుంటారు. మీరు కూడ గుంటూరు మాండలికంలో కొన్ని కథలు వ్రాశారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?**

శి.శం. మాండలికం అంటే జీవద్భాష. దానిలో రచన చేస్తే అందులో సహజత్వం, మాధుర్యం ఉంటాయి.కొంచెం ప్రయత్నిస్తే ఇతర ప్రాంతాలవారికీ అర్థం అవుతుంది.

సు.బా. **మూడున్నర దశాబ్దాలుగా మీరు చేస్తున్న సాహిత్యకృషికి ఇప్పటిదాక ఎటువంటి గుర్తింపులు, గౌరవాలు లభించాయి?**

జవాబు: ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు(హైదరాబాదు), డా॥ గరికపాటి పురస్కారం(రాజమండ్రి), తెలుగు విశ్వవిద్యాలయ సత్కారం (హైదరాబాదు), డా॥సి.నారాయణరెడ్డి కవితా పురస్కారం(కరీంనగర్), ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘ పురస్కారం(తిరుపతి), రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు(హైదరాబాదు), నవ్యాంధ్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం(అనంతపురం), డా॥ కేతు విశ్వనాధరెడ్డి అవార్డు(కడప), డా॥ ఆవంత్స సోమసుందర్ అవార్డు(పిఠాపురం), దేవరకొండ బాలగంగాధర తిలక్ అవార్డు(తణుకు) -ఇట్లా ఓ 20దాకా రకరకాల అవార్డులు, గౌరవాలు వచ్చివుంటాయి.

సు.బా. **దేశ విదేశాల్లో....**

శి.శం. జాతీయ కవిగా, రచయితగా ప్రసారభారతి, కేంద్ర సాహిత్య అకాడమి సభల్లో పాల్గొన్నాను. అమెరికాలో 'తానా' మహాసభలకి ముఖ్య అతిధిగా 2001, 2009 సంవత్సరాల్లో పాల్గొని పలుచోట్ల ప్రసంగించాను.

సు.బా. **రైతు కుటుంబం నుంచి వచ్చారు మీరు. ఇవాళ నవ్యాంధ్ర రాజధాని ప్రాంత కవిగా ఆ ప్రాంతంలో జరుగుతున్న మార్పుల్ని మీరెట్లా ఆహ్వానిస్తున్నారు?**

శి.శం. రాజధాని ప్రకటనతో మా వూరు నెక్కల్లుతో సహా ఈ

ప్రాంతపు భూముల విలువ పెరిగి రైతులు తేరుకొన్నారు. ఆర్థిక పుష్టి పెరిగింది. అయితే ఒక రాజధాని నిర్మాణం కోసం ఇన్నివేల ఎకరాల పంటపొలాలు అవసరమా అన్నది నా ప్రశ్న. ఇవన్నీ చివరికి కార్పొరేట్ల వశమవుతాయని అందరికీ అర్థమవుతుంది.ఈ నేపథ్యం లోనే 'కేంద్రం చుట్టూ', 'కొండచిలువ' కథలు వ్రాసాను.

ఇది భూసంబంధాల్లో, భూమితో ముడివడిన మానవ సంబంధాల్లో పెద్ద కుదుపు. ఇవాళ ఈ ప్రాంతపు రైతాంగానికి చేసేందుకు ఏ పనీ లేదు. పోగుపడ్డ డబ్బు రకరకాల వ్యసనాల్లో హారతి కర్పూరం అవుతోంది. పల్లెలన్నీ మద్యప్రవాహంలో ఓలలాడుతున్నాయి. రాజధాని నిర్మాణం లేదా అభివృద్ధి అంటే రహదారులు, ఆకాశ హర్మ్యాలు, కార్పొరేట్ వ్యవస్థలు కాదు. జీవన ప్రమాణం మెరుగుపడటం. అమరావతి ఆవిధంగా నిర్మించబడాలి.

సు.బా. **మీరు కవిత్వం ప్రారంభించినప్పటి పరిస్థితులు వేరు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో అవకాశాలు పెరగటంతో రాసేదల్లా కవిత్వంగా చలామణి అవుతోంది. మారిన సాహిత్యరంగం గురించి మీరేమనుకుంటున్నారు?**

శి.శం. అన్ని రంగాల్లో మాదిరే సాహిత్యరంగంలోనూ విలువలు తగ్గిపోతున్నాయి. కవిత్వానికి, అకవిత్వానికి మధ్య విభజనరేఖ చెరిగిపోతోంది. సామాజిక అభ్యుదయం కోరుతూ మంచి భావాలు వెల్లడించడమే కవిత్వం కాదు.అదొక కళాత్మక విన్యాసం. దానికి ఊహాశక్తి, భాషాభావబలం, వ్యక్తీకరణ సౌందర్యం వంటివి అవసరం. అవి లేనప్పుడు దాని జోలికి పోవటం అనవసరం.

ఇదికాక చాలామందికి సాహిత్యం గమ్యంకాదు, గుర్తింపుకు సాధనం. సభల ఆర్భాటాలు, సభానంతర పానగోష్ఠులూ మామూలయ్యాయి. సాహిత్యనిష్ఠ తగ్గింది. జీవిత సంస్కారానికి సాహిత్యం ఉత్తమ మార్గం అని మనం గ్రహించినప్పుడే ఈ పరిస్థితి మారుతుంది.

సు.బా. **శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావుగారు మీకు గురువు కదా! ఇద్దరికీ ఒకేసారిగా... మీకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, వారికి భాషాసమ్మాన్ రావటంలో మీ అనుభూతి ఏమిటి?**

శి.శం. అది యాదృచ్ఛికం. శ్రీ నాగళ్ళ ఉత్తమ గురువు. తెలుగునాట సుప్రసిద్ధ పండితుల్లో ఒకరు. వారికి భాషాసమ్మాన్ లభించటం నాలాంటి ఎందరో శిష్యులకు సంతోషదాయకం.

సు.బా. **తెలుగు భాషోద్యమం పేరుతో కొన్ని సంఘాలు, భాషాభిమానులు చేస్తున్న ప్రయత్నాలగురించి మీ స్పందనేమిటి?**

శి.శం. అది అత్యంత అవసరం. ప్రభుత్వ విధానాలు భాషని తుదముట్టించే విధంగా ఉంటున్నాయి. భాషని కోల్పోవటమంటే ఒక జాతి సంస్కృతిని కోల్పోవటమే. దాని పరిరక్షణ కోసం తెలుగు భాషోద్యమ సమాఖ్య, అమ్మనుడి వంటి సంస్థలు, పత్రికలు చేస్తున్న కృషిని హృదయపూర్వకంగా అభినందిస్తాను. ఆ కృషిలో నేను కూడా పాల్గొంటాను.

సు.బా. **అమ్మనుడి పాఠకులకు, తెలుగు భాషాభిమానులకూ మీరిచ్చే సందేశం ఏమిటి?**

శి.శం. అమ్మనుడి వంటి పత్రికలు అరుదుగా వుంటాయి. సందేశం కాదుగానీ, తెలుగుభాషాభిమానులందరితో కలిసి ప్రయాణించడానికి ఇష్టపడతాను. తెలుగు భాష తియ్యదనం అనే సెంటిమెంటుతో ఆగిపోకుండా మన భాషలోని మహాసంపదని, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవటం కోసం అందరం కలిసి ముందుకు సాగుదాం. ❋

---

(కూడు పెట్టేది ఇంగ్లీషు కాదు...9వ పుట తరువాయి)

మాత్రమే పొట్టపోసుకుంటున్నారు. ఆంగ్లంలో భావ వ్యక్తీకరణ వారికి అదనపు అర్హత మాత్రమే. అక్కడికి వెళ్ళడానికి, ఆ తర్వాత వ్యవహరించడానికి 3 నెలల కోర్సు చాలు. ఈ కొద్ది మంది కోసం లక్షలాది బాలల బాల్యాన్ని బలిచేయడం అన్యాయం కాదా? మాతృభాషలో విద్య అనే అంశం కేవలం తెలుగు భాష మీద ప్రేమతో కాదు. మన పిల్లల బాల్యం, మన దేశ స్వావలంబన, సర్వతోముఖ వికాసం ఇక్కడ ముఖ్యమైన విషయాలు.

ధనికులు, అగ్ర కులస్తులుగా పిలవబడే వారి పిల్లలంతా ఆంగ్ల మాధ్యమంలో చదవడం వలన లబ్ధి పొందడం ఒక మిథ్య. అలాగే బడుగుల పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల విద్య నేర్వకపోవడం వలన నష్టపోవడం మరొక భ్రమ. ఏ మీడియంలోనైనా రాణించగల బలమైన గిత్తల్లాంటి ఐదారు శాతం పిల్లలకు తప్ప మిగిలిన గ్రామ ప్రాంతాల బడుగు పిల్లలకు ఇంగ్లీష్ మీడియం విద్య వారి పురోభివృద్ధికి పెద్ద అడ్డంకిగా నిలిచి, కీడు చేస్తుందే తప్ప కూడు పెట్టదు.

ఆఖరుగా ప్రముఖ రచయిత "కాలువ మల్లయ్య" గారి మాటలు ఉటంకిస్తూ ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను: "దళిత బహుజనుల్లో నుండి, కటిక పేదరికం నుండి వచ్చిన నాలాంటి వాళ్ళు తెలుగు మీడియంలో చదవడం వల్లనే జీవితాలను గెలుచుకొన్నారు, గెలుచుకొంటున్నారు.

ఇప్పుడు గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో గూడ ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెడితే, అసంఖ్యాక బడుగు జనుల పిల్లలు ధనికుల పిల్లల్లాగే తమ మూలాలకు దూరమై, యంత్రాలుగా మారి, అన్ని విధాలా ఓడిపోతారు."

(ఆంధ్రజ్యోతి దినపత్రిక 27జనవరి నుండి)


**నడుస్తున్న చరిత్ర** (2013 నవంబరు వరకు)

**అమ్మనుడి** (2015 మార్చి నుండి...)

పాత సంచికలు విడిగా గాని,

సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని

కావలసినవారు సంప్రదించండి.

అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ,
హిందీ కళాశాల వీధి, మాచవరం,
విజయవాడ-4.
ఫోన్ : 98480 16136, 0866-2439466

–చలసాని నరేంద్ర
98495 69050

## పెద్దనోట్ల రద్దునుంచి నేటిదాకా...

# అసంబద్ధ చర్యలు....అవినీతి పరిణామాలు



**ఆయా సంఘటనల గురించి ఉన్నత స్థానాలలో ఉన్నవారెవ్వరూ నోరు మెదపటం లేదు. వీటిపై బాధ్యులైన వారిపై చర్యలు కూడా తీసుకోవడం లేదు. కీలక స్థానాలలో ఉన్నవారిపై చర్య తీసుకొంటే ఆయా వ్యవస్థలు కూలిపోవచ్చనే భయం వ్యక్తం చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవహారాలపై ఆర్థిక మంత్రిత్వ శాఖకు గాని, రిజర్వు బ్యాంకుకు గాని ఏమాత్రం అదుపు లేదని గత మూడు నెలల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.**

నవంబర్ 8న పెద్ద నోట్ల రద్దు గురించి ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అందుకు చెప్పిన ప్రధాన లక్ష్యాలు నల్లధనాన్ని అరికట్టడం, నకిలీ ధనాన్ని అరికట్టడం, ఉగ్రవాదాన్ని కట్టడి చేయడం. అందుకోసం 50 రోజుల పాటు దేశ ప్రజలను కొన్ని ఇబ్బందులకు గురి కావాలని ఆయన అభ్యర్థించారు. దీనిని నల్లధనంపై యుద్ధంగా అభివర్ణించారు. 50 రోజుల తరువాత సాధారణ పరిస్థితులు నెల కొంటాయని అంటూ అభయం ఇచ్చారు.

ఈ విషయంలో అసాధారణ రీతిలో ప్రజలు ప్రభుత్వానికి సహక రించారు. ప్రతిపక్షాలు ఎంతగా రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా దేశం కోసం కొంత కష్టపడక తప్పదు అంటూ సర్దిచెప్పుకున్నారు. సంపన్నుల నల్లధనాన్ని తామే పెకిలించి వేస్తున్నంత సంబర పడ్డారు. అయితే 50 రోజులు పూర్తి కావడమే కాకుండా, మరో 30 రోజులు కూడా గడిచింది.

ఇంతవరకు నోట్ల రద్దు ద్వారా ఏ మేరకు ఈ లక్ష్యాలను సాధిం చారో ఎవ్వరూ పెదవి విప్పడం లేదు. అసలు పాత నోట్లు ఏ మేరకు తిరిగి బ్యాంకులకు చేరాయో కూడా చెప్పడం లేదు. కొత్త నోట్లు ఎన్ని ముద్రించి అందుబాటులోకి తెచ్చారో కూడా నోరు విప్పడం లేదు. అవన్నీ రహస్యాలు అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

ఇప్పుడు నల్లధనంపై యుద్ధం ముగిసి, నగదు రహిత పాలన వైపు అడుగులు వేయడంపై మొత్తం ప్రభుత్వం–కేంద్రంలో, రాష్ట్రాలలో ప్రయత్నాలు చేపట్టింది. నగదు రహితం ద్వారా ప్రధానమంత్రి చెప్పిన లక్ష్యాలను చేరుకోగలమా అంటే ఎవ్వరూ సమాధానం చెప్పడం లేదు. నగదురహితం వలన ఎవ్వరికి ప్రయోజనమో కూడా పేర్కొ నడం లేదు. అమెరికాలోని కొన్ని కంపెనీలకు ఈ ప్రక్రియ వలన శాశ్వతంగా ప్రయోజనం కలిగించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నారని అంటూ కథనాలు వెలువడుతున్నా ఎవ్వరూ నోరు మెదపడం లేదు.

సుమారు సంవత్సరం క్రితమే ఈ నిర్ణయం తీసుకొన్నారని, ఆ మేరకు వ్యూహాత్మకంగా అమలు చేపట్టరని కూడా కథనాలు వెలు వడ్డాయి. ఈ విషయంలో మొత్తం మంత్రివర్గాన్ని, పాలనా యంత్రాం గాన్ని, ప్రజలను సహితం విశ్వాసంలోకి తీసుకోకుండా కొద్దిమంది వ్యక్తులు మొత్తం ఈ ప్రక్రియను అమలులోకి తీసుకువచ్చే ప్రయ త్నాలు చేస్తూ ఉండటంతో దేశ భద్రత, సార్వభౌమత్వం పట్ల ఆందో ళన చెందవలసిన అవసరం ఏర్పడుతుంది.

నగదు రహితంగా చేపట్టే ప్రతి లావాదేవీల్లో కొంత రుసుము అమెరికాలోని ఆయా కార్డుల కంపెనీలకు వెడుతూ ఉంటుందని చెబుతున్నారు. మన దగ్గర ఒక రూ. 500 నోటు ఉన్నది అనుకోండి. దానిని ఎన్నిసార్లు మార్చినా, ఎందరి చేతులకు అది మారినా అందుకు అదనపు వ్యయం ఏమీ కాదు. దాని విలువ కూడా మారదు. కానీ నగదు ప్రమేయం లేకుండా మరే విధంగా మార్చుకోవాలి అనుకున్నా అందుకు కొంత వ్యయం కాక మానదు.

బ్యాంకుల ద్వారా మార్చుకోవాలి అనుకొంటే బ్యాంకు సేవలకు కొంత ఛార్జి చెల్లించవలసి ఉంటుంది. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ల ద్వారా అయితే అమెరికాలో ఉండే ఆయా కంపెనీలకు సేవలకు గాను కొంత రుసుము ప్రతిసారి చెల్లించవలసిందే. ఆ ఛార్జీని మనం చెల్లిస్తామా, మరొకరు చెల్లిస్తారా అన్నది వేరే విషయం. ఉచితంగా మాత్రం లావాదేవీలు జరగవు అన్నది మాత్రం వాస్తవం.

ఒక అంచనా ప్రకారం రూ. 500 మొత్తాన్ని పదేళ్లపాటు ఆ విధంగా మార్చుతూ ఉంటే అందుకు లావాదేవీల వ్యయం లక్ష రూపాయలకు పైగానే ఉంటుంది. అమెరికా వంటి బాగా అభివృద్ధి చెందిన దేశంలో సహితం 60 శాతంకు పైగా నగదుతోనే లావాదేవీలు జరుగుతూ ఉన్నాయి.

ఇప్పుడు స్వయంగా మన ప్రధాని పూనుకొని, నగదు లేకుండా లావాదేవీలు జరిపితే భారీ బహుమతులు కూడా ఇస్తామని ప్రక టించడం ఏమేరకు అవసరం? అసలు నోట్ల రద్దును నగదు రహిత లావాదేవీల కోసం చేపట్టారా? ముందుగా ఎందుకో చేపట్టి, మధ్యలో దానితో ఏర్పడే అనర్థాలను గ్రహించి, ఏమీ పాలుపోక ఈ పల్లవిని అందుకున్నారా?

దేశంలో ఆర్థిక రంగంలో అవసరమైన మౌలిక సంస్కరణల పట్ల చూపు సారించకుండా ఇటువంటి చిట్కాలతో దేశ ఆర్థిక వ్యవస్థనే చిన్నాభిన్నం చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మన బ్యాంకింగ్ వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉన్నదో విజయ్ మాల్యా వంటి వారి పట్ల ఎంత ఉదారంగా వ్యవహరించిందో చూశాము. ఎటువంటి హామీలు లేకుండా వందల కోట్ల రూపాయల రుణాలను బ్యాంకులు ఇవ్వడంతో, ఆర్ధికంగా చితికిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా ఒక బ్యాంకు అధిపతిని ఈ మధ్య సి బి ఐ అరెస్ట్ చేసింది.

విజయ్‌మాల్యా విషయంలో మొత్తం 14 బ్యాంకులను ఆయన మోసం చేసిన్నట్లు సీబీఐ అభియోగం చేసింది. ఆయా బ్యాంకుల అధిపతులు కొందరు రాజకీయ నాయకుల వత్తిడి వల్ల కావచ్చు జోక్యం చేసుకొని రుణాలు ఇచ్చేటట్లు చేశారు. ఇన్ని ఆరోపణలు ఉన్నా ప్రస్తుత ప్రభుత్వం వాటిల్లో పలు బ్యాంకుల అధిపతుల పదవీ కాలాన్ని పొడిగించే ప్రతిపాదనలు చేసింది. పైగా విజయ్ మాల్యాపై ఆరోపణలు చేస్తున్న సెబీ అధిపతిగా వీటిల్లో ఒక బ్యాంక్ అధిపతిని నియమించే ప్రయత్నం జరుగుతున్నది.

**అంటే విజయ్ మాల్యా వంటి వారితో లాలూచి పడినవారిలో ప్రస్తుత ప్రభుత్వంలో సహితం కీలక స్థానాలలోని వారున్నారు. ఆయన ఆర్ధికమంత్రి అరుణ్ జైట్లీని కలసిన వెంటనే దేశం విడిచి వెళ్లిపోవడం గమనార్హం. ప్రస్తుత కేంద్రమంత్రులు పలువురి ఇళ్లకు తరచూ వెళ్లి, వ్యవహారాలు చక్కపెట్టుకోగల సమర్ధుడు కూడా. పైగా ఆయన రెండు సార్లు రాజ్యసభకు ఎన్నిక కావడానికి బిజెపి సహితం ఎంతగానో సహకరించింది.**

బ్యాంకింగ్ వ్యవస్థలో, ద్రవ్య వ్యవస్థలో, పన్ను వ్యవస్థలో భారీ సంస్కరణలు రావలసి ఉండగా వాటి గురించి పట్టించు కోవడం లేదు. రైతులు, ఉద్యోగులు, చిన్న చిన్న వ్యాపారులు మినహా నగదును పారిశ్రామిక వేత్తలు ఎవరూ దాచుకోరు. నల్ల ధనాన్ని భూములు, బంగారం, షేర్లు కొనుగోళ్లలో పెట్టుబడులుగా పెడుతూ ఉంటారు. ఇతర దేశాలలో భారీ ఆస్తులను సమకూర్చు కొంటూ ఉంటారు. వాటిని కట్టడి చేయడం కోసం నోట్ల రద్దు ఏమాత్రం ఉపయోగపడదని అందరికీ తెలుసు.

అందుకనే నోట్ల రద్దు ద్వారా నల్లధనంకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం ఫలించినట్లు లేదు. అందుకనే ఆ అంశం గురించి ఇప్పుడు ప్రభుత్వం నోరు మెదపటం లేదు. మరో వంక నోట్ల రద్దు కారణంగా మూడు – నాలుగు లక్షల కోట్లకు పైగా నోట్లు బ్యాంకుకు తిరిగి రావని, ఆ మొత్తం అంతా బ్యాంకులకు మిగిలిపోయి, పేదలకు రుణాలు ఇవ్వ డానికి, ఉత్పత్తికి తోడ్పడే పథకాలకు పెట్టుబడులుగా సమకూర్చడానికి వెసులుబాటు కలుగుతుందని ప్రభుత్వం పథకాలు వేసుకొంది.

అయితే 95 శాతంకు పైగా నోట్లు తిరిగి బ్యాంకులకు వచ్చినట్లు చెబుతున్నారు. కొన్ని అంచనాల ప్రకారం అయితే రిజర్వు బ్యాంకు ముద్రించిన నోట్ల కన్నా ఎక్కువగా బ్యాంకులకు చేరాయి. అంటే నకిలీ నోట్లు కూడా చేరాయి అన్నమాట. దానితో ప్రభుత్వపు అంచ నాలు అన్నీ తలకిందులు అయ్యాయి. అందుకనే ఎంత మొత్తం బ్యాంకులలో డిపాజిట్ చేశారు అంటే ఎవ్వరూ మాట్లాడటంలేదు.

నగదు ద్వారా ఎన్ని దొంగ వ్యాపారాలు చేస్తారో నగదు రహితంగా అంతకన్నా ఎక్కువగా సామాన్య ప్రజలు మోసపోయే అవకాశాలు ఈ మధ్య వెలుగులోకి వస్తున్నాయి. అనేకమంది ఏ.టి.యం. ల నుండి నగదు తెచ్చుకోవడానికి వెళ్లి మోసపోతున్నారు. ఏ.టి.యం. లలో సహితం నకిలీ నోట్లు వచ్చిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. రిజర్వు బ్యాంకు ముద్రిస్తున్న ప్రెస్‌ల నుండే లక్షల రూపాయల విలువ గల కొత్త నోట్లు అక్రమార్కుల ఇళ్లకు నేరుగా వెళ్లిన అనేక సంఘుట నలు ఈ మధ్య వెలుగులోకి వచ్చాయి.

అయితే ఆయా సంఘటనల గురించి ఉన్నత స్థానాలలో ఉన్న వారెవ్వరూ నోరు మెదపటం లేదు. వీటిపై బాధ్యులైన వారిపై చర్యలు కూడా తీసుకోవడం లేదు. కీలక స్థానాలలో ఉన్నవారిపై చర్య తీసు కొంటే ఆయా వ్యవస్థలు కూలిపోవచ్చనే భయం వ్యక్తం చేస్తున్నారు. దేశ ఆర్ధిక వ్యవహారాలపై ఆర్ధిక మంత్రిత్వ శాఖకు గాని, రిజర్వు బ్యాంకుకు గాని ఏమాత్రం అదుపు లేదని గత మూడు నెలల అను భవాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ అంశాలపై పారదర్శకంగా సమాలోచనలు జరపడానికి ప్రభుత్వం వెనుకడుగు వేస్తూ ఉండటం వల్ల సమస్యలు మరింత తీవ్రతరం అవుతున్నాయి. నోట్ల రద్దు గురించి పార్లమెంటులో చర్చకు ప్రధానమంత్రి చొరవ తీసుకొని ఉంటే అందులో జరుగుతున్న అనేక లోపాలు వెలుగులోకి వచ్చి, వాటిని సరిదిద్దే అవకాశం కలిగి ఉండేది. కనీసం ఆయన తన సొంత పార్టీ యంపీలు, నాయకులతో అయినా సమాలోచనలు జరిపితే క్షేత్రస్థాయిలో జరుగుతున్న అనేక మోసాలు తెలుసుకొని సరిదిద్దుకొనే అవకాశాలు ఏర్పడేవి.

అయితే పార్లమెంటులో కానీ, రాజకీయ పార్టీలతో కానీ, ప్రజా ప్రతినిధులతో గాని సమాలోచనలు జరపడానికి ప్రధానమంత్రి, ఆర్ధిక మంత్రి ముందుకు రావడం లేదు. దీని అమలులో కీలకపాత్ర వహించ వలసిన ముఖ్యమంత్రులను పిలిచి ప్రధానమంత్రి మంచి, చెడులు ప్రస్తావించుకొనే అవకాశం ఇవ్వనే లేదు.

గతంలో తనతో చేతులు కలపనివారంతా ఉగ్రవాదులలకు మద్దతు ఇస్తున్నవారే అంటూ అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ అహంకార పూర్వక వాఖ్యలు చేశారు. అమెరికా ఆర్ధికంగా పతనం చెందడానికి ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలే కారణం అంటూ ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెంపలు వాయించుకొంటున్నారు. ఇప్పుడు ప్రధాని సహితం అదే ధోరణిలో నోట్లరద్దుకు మద్దతు ఇవ్వని వారంతా అవి నీతికి మద్దతు ఇస్తున్నవారే అన్నట్లు మాట్లాడుతూ ఉండటం దురదృష్ట కరం. ఇటువంటి ధోరణులు దేశాన్ని ప్రమాదకర దిశవైపు నడి పిస్తాయని గ్రహించాలి. ❃

> శిశువు శారీరక వికాసానికి
> తల్లిపాలు
> మానసిక వికాసానికి తల్లి భాష
> గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు
> విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.





















-డా॥వావిలాల సుబ్బారావు
98664 02973

# మాట కరుకు-మనసు మెత్తన-రాజగోపాలరావు గారు



**శ్రీ** ముక్కాల రాజగోపాలరావు గారు జనవరి 13న కాలం చేశారంటే-అందువల్ల కలిగిన లోటు వారి కుటుంబానికి మాత్రమే కాదు. బౌద్ధ తత్త్వాభిమానులందరకూ లోటే. వృత్తిరీత్యా తత్వశాస్త్ర అధ్యాపకుడు కావటం వల్ల ఆ క్రమశిక్షణ తర్వాత తర్వాత తాను అభిమానించిన బౌద్ధ రచనా వ్యాసంగానికి ఉపకరించింది. అందుకనే తెలుగులో వస్తున్న బౌద్ధ విషయ రచనల్లో ఆయన కలం ప్రత్యేకం. తెలుగులో బౌద్ధసాహిత్యాన్ని స్వతంత్ర దృక్పథంతో పెంపు చేయ దలచిన వారికి దృఢమైన దారి ఏర్పరిచారు. ఆ బాట సార్థకత ఆ దారిపై నడిచే వారిమీద ఆధారపడి వుంటుంది.

విషయ నిష్కర్ష, మొగమాటం లేని విమర్శ ఆయన బుద్ధి లక్షణాలు. ఒకసారి 'తథాగత' అన్న హిందీ నాటకాన్ని (కోశాంబిగారి రచన) తెలుగులోకి అనువాదం చేయించి ఆవిష్కరణ సభకు పిలిచారు. అనువాదకుడు, పిలిచినవారు అందరూ బాగా తనకు తెలిసినవారే. అయినా ఏ మొగమాటం లేకుండా దోషాలను ఏరి కుప్పపోశారు. పైగా 'శ్రేయోభిలాషిగా నేను గాక మరెవరు చెబుతారు' అని అనునయించారు. నిజం నిష్ఠురమైనా చెప్పటానికి వెనుకాడరు.

ఒకసారి మా కాలేజీలో సాహిత్య చర్చాగోష్ఠి (సెమినార్) జరుగుతున్నది. నాస్తిక ప్రసిద్ధులైన శ్రీ గోపరాజు సాంబశివరావు గారి ప్రసంగం జరుగుతున్నది. మధ్యలో ఆఫీసు ఫోను నుండి (మొబైల్ ఫోన్లు లేని కాలంలో) ఒక విషాద వార్త వచ్చింది. "మా మేనల్లుడు చనిపోయాడు. ప్రసంగం పూర్తి చేసి వెడతాను- తర్వాతి ప్రసంగాలకు వుండలేను" అని ప్రకటించి, ప్రసంగం పూర్తి చేశారు ఎంతో నిగ్ర హంతో. తర్వాతి వక్త మాట్లాడుతూ 'చనిపోయాడు' అన్నమాటలోనే దేహం విడిచి ఎక్కడికో వెళ్ళాడు..అన్న అర్థం వుంది. ఏదైనా వుంటే గదా వెళ్ళేది. అదే ఆత్మ' అని వివరించారు. తర్వాత రాజగోపాలరావు గారు జోక్యం చేసుకుంటూ 'భాషా సంప్రదాయాలు- పలుకుబడులు.. ఆ జాతిజనుల విశ్వాసాలను తెలియజేస్తాయి. వాటిని తాత్త్విక భావాల చర్చకు సాధనంగా తీసుకోకూడదు. నుడికారాలు చర్చకు ప్రమాణాలు కావు. తానే పుస్తకంగా వ్రాస్తే వేరొక పదాన్ని వాడవచ్చు. సాధారణ భాష వేరు, చర్చా భాష వేరు' అని వివరించారు. వక్త గూడ తృప్తి పడ్డాడు.

నేను 'సుహృల్లేఖ' అనువాదం చేసి ముందుమాట వ్రాయమని కోరాను. నాకు బౌద్ధ ప్రవేశం లేదు. రాజగోపాలరావు గారు నాగార్జున ప్రీతి కలవారు. "తొలి తెలుగు అనువాదాన్ని వీలయినంత సరళంగా వ్యావహారిక భాషలోకి అనువదించిన సుబ్బారావు గారిని అభినందిస్తు న్నాను" అంటూనే 'అనువాదమంతా సామాన్య పరిభాషలో సాగింది. అందువల్ల బౌద్ధ ధర్మస్వభావం మరుగున పడింది. ఎవరయినా ఆ లోటు తీర్చే ప్రయత్నం చేయగలరని ఆశిస్తున్నాను' అని తన అసం తృప్తిని నిర్మొహమాటంగా వ్రాశారు. ఆయనకున్న శాస్త్ర ప్రమాణనిష్ట అట్లాంటిది. నా సుహృల్లేఖ అనువాదం తర్వాత అదే ఉత్సాహంతో 'శూన్యతా సప్తతి'(ఆచార్య నాగార్జున రచన) అనువదించారు ఆయన గారు.

భాషలో భావంలో హేతుక్రమంలో రాజీ పడరు. అందువల్ల మాట కఠినంగా వుంటుంది. జనప్రీతిగా మాట్లాడే నటన చేయరు. మా కాలేజీలో నా సహాధ్యాయుని ఉద్యోగ విరమణ సభలో నా మాటలకు ఆర్ద్రమై ఆ మిత్రుడు సభలోనే కన్నీరు పెట్టాడు. రావు గారు కూడా కరిగిపోయారు. తర్వాత నాతో 'నాకు యిచ్చే వీడ్కోలు సభలో ఇట్లా మాట్లాడే మిత్రులు ఎవరైనా ఉంటారా?' అంటూ సాలోచనంగా నన్నడిగితే జాలిపడ్డాను. తన పరుషవాక్కు ప్రభావం తానెరుగును. ఆయన కఠినవాక్కు అందరికీ తెలుసు. ఆయన రస హృదయం కొందరికే తెలుసు. 'నిందు మనంబు నవ్య నవీనత సమా నము పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము' అన్న నన్నయ్య గారి మాటకు వారొక ఉదాహరణం. 2013 మే నెలలో నాగార్జునసాగర్‌లో జరిగిన బుద్ధజయంతి సెమినార్ సమయంలో వారితో కలిసి బౌద్ధ మ్యూజియం చూడటం నిజంగా విజ్ఞానదాయకం. నిష్టగల తత్వాన్వేషి. స్వీయదృక్పథం వున్న పరిశోధకుడు. వారిని సగౌరవంగా స్మరించు కుంటున్నాను. ❋

# బౌద్ధరచనల అగ్రగణ్యుడు
# శ్రీ రాజగోపాలరావు

- బొర్రా గోవర్ధన్,
9390600157

మన జీవితప్రవాహంలో ఎన్నో మలుపులుంటాయి. ఒక ప్రవాహం మలుపు తిరిగిందంటే దానికి బలమైన ఏదో ఒక ప్రభావిత అంశమే కారణమై ఉంటుంది. ఇది నదీ ప్రవాహానికైనా, జీవిత ప్రవాహానికైనా ఒక్కటే...

తెలుగునాట ఆధునిక కాలంలో బౌద్ధప్రవాహంలో ఒక మలుపు యం. రాజగోపాలరావు గారు. బౌద్ధ మూలగ్రంథాల్లోని విషయాల్ని ఎంతో సాధికారికంగా, చదువరులకు అర్థమయ్యే విధంగా చెప్పిన వ్యక్తులలో మొదటివాడే.

మామూలుగా తత్త్వశాస్త్రం అంత తేలిగ్గా తలకెక్కదు. తత్త్వశాస్త్ర పుస్తకాలు తక్కెట్లో తూస్తానికి తప్ప, తలల్లో తోస్తానికి పనికిరావు అంటారు. పైగా రాజగోపాలరావు గారు తత్త్వశాస్త్ర ఆచార్యులు. అయినా వారి రచనల్లో తత్త్వంకూడా తేనెరసమంత పలుచన కాక పోయినా పటికబెల్లం అంత కఠినం కాదు..

బౌద్ధంమీద వారు రాసిన గ్రంథాలు ఆరు. నిజానికి ఇవి ఈ నేల మీద బౌద్ధం అంతగా గుర్తించబడని కాలంలో రాసినవే. అంటే 2010కు ముందు. నిజం చెప్పాలంటే...వారిలాంటి వారు అలాంటి బౌద్ధగ్రంథాలు రాయబట్టే ఆ తర్వాత బౌద్ధానికి గుర్తింపు వచ్చింది అనడం వాస్తవం. చారిత్రక సత్యం.

అందుకే ఆయన ప్రస్థానం తెలుగు నేలమీద బౌద్ధానికి ఒక మలుపు. వారు రాసిన బౌద్ధగ్రంథాల్ని ఒకసారి సంక్షిప్తంగా తెలుసు కొంటే బౌద్ధానికి ఆయన చేసిన సేవ అవగతమవుతుంది.

**1. శూన్యతా సప్తతి:-** ఇది ఆచార్య నాగార్జుని సంస్కృత గ్రంథానికి తెలుగు అనువాదం. అనువాదం అనడంకంటే వ్యాఖ్యానం అనడం సరైనది. ఆచార్య నాగార్జునుడు రెండో బుద్ధునిగా కీర్తిగాంచిన బౌద్ధ తాత్త్వికుడు. మహాయాన సంప్రదాయ పితామహుడు. బుద్ధుని తర్వాత భారతదేశం గర్వించదగ్గ దార్శనిక దిగ్గజం. ఈయన గ్రంథాల్లో బౌద్ధంలో ఉన్న ప్రతీత్య సముత్పాదం (క్షణికవాదం-ప్రతిదీ మారుతూ ఉంటుంది) సిద్ధాంతాన్ని విశేషంగా వివరించిన రచన శూన్యతా సప్తతి. బౌద్ధుల కార్యకారణ సిద్ధాంతాన్ని విశ్లే షించిన గ్రంథం ఇది. ఈ గ్రంథం లోని కారికల్ని డేవిడ్ రాస్ కొమిటా, సెషెరించన్, టిన్ జిన్ దోర్జీ, రాహుల్ సాంకృత్యాయన్ లాంటివారి వ్యాఖ్యా నాల్ని అధ్యయనం చేసి తనదైన దృక్ప థంతో వ్యాఖ్యానం రాశారు రాజ గోపాలరావు గారు. తెలుగు బౌద్ధ చరిత్రలో చిరకాలం నిలిచిపోయే గ్రంథం ఇది. నాగార్జునాచార్యుడు తాను రాసిన 'మూల మాధ్యమిక




కారిక' గ్రంథంలో విషయాల్ని వివరించడం కోసం ఈ శూన్యతా సప్తతి రాశాడు. ఈ శూన్యతా సప్తతిని మరింత విపులంగా వివరిం చడం కోసం రాజగోపాలరావుగారు ఈ గ్రంథానికి వ్యాఖ్యానం రాశారు.

ఈ పుస్తకానికి ఉన్న మరో గొప్పతనం ఏమంటే దీనికి తొలిపలు కులు రాసింది, రాజగోపాలరావుగారి గురువుగారు, ఆధునిక తెలుగు తాత్త్వికులైన శ్రీ కె.సచ్చిదానందమూర్తిగారు కావడం. ఈ గ్రంథం 1995లో వచ్చింది. దాదాపుగా ఈ సమయంలో వచ్చిందే 'పాళీ త్రిపిటక సుత్తాలు'.

**2. పాళీ త్రిపిటక సుత్తాలు:-** ఇది మొత్తం పాళీ త్రిపిటకాల్లోని గ్రంథాలన్నింటి వివరాలు తెలిపే పుస్తకం. కేవలం గ్రంథాల పేర్లే కాకుండా, పాళీభాష, దాని పుట్టుపూర్వోత్తరాలగురించిన సమాచారం ఉన్న పుస్తకం కూడా. త్రిపిటకాల్లో ఏఏ పిటకంలో ఏఏ భాగాలు న్నాయి, ఆయా భాగాల్లో ఏఏ గ్రంథాలున్నాయి, ఆయా గ్రంథాల్లో ఏఏ సుత్తాలున్నాయి, ఏఏ కథలున్నాయి? ఇలా మొత్తం బౌద్ధ సాహి త్యాన్నంతా ఒక క్రమపద్ధతిలో చూపే పుస్తకం ఇది. కేవలం ఆయా గ్రంథాల పేర్లే కాకుండా వాటిలోని విషయాల్ని క్లుప్తంగా తెలియ జేశారు రాజగోపాలరావు గారు.

**3. కృష్ణాతీరంలో బౌద్ధక్షేత్రాలు:-** ఇది చిన్న పుస్తకం. అయినా చాలా విశేష సమాచారం ఉన్న పుస్తకం. కొండను తనలో ఇముడ్చు కుని చూపించే అద్దం లాంటిది ఈ పుస్తకం.

2002లో వచ్చిన కృష్ణాజిల్లా ఉత్సవాల సందర్భంగా "కృష్ణాజిల్లాలో బౌద్ధం" అనే పేరుతో రేడియోలో చేసిన ప్రసంగాలివి. ఆ తర్వాత 'నడు స్తున్న చరిత్ర'లో ప్రచురించిన ప్రసంగ వ్యాసాలివి. అప్పుడే నడుస్తున్న చరి త్రలో "గుంటూరు జిల్లాలో బౌద్ధం" పేరుతో కొన్ని వ్యాసాలు రాశారు. వీట న్నింటిని 2006లో "కృష్ణా తీరంలో బౌద్ధక్షేత్రాలు" పేరుతో పుస్తకంగా రాజగోపాలరావు గారు తీసుకొచ్చారు.




అమరావతి స్థూపం, నాగార్జున కొండ, భట్టిప్రోలు, జగ్గయ్య పేట, ఘంటసాల, గుడివాడ, గుమ్మడిదుర్రు, అల్లూరు, వడ్డమాను, నందాయపాలెం, కేసానిపల్లె, తక్కెళ్ళపాడు, వెంటాల- ఈ బౌద్ధక్షేత్రాల వివరాలన్నీ ఇందులో చారిత్రక ఆధారాలతో ఉన్నాయి.

**4. యశోధర జాతక కథలు:-** 2008లో వచ్చిన ఈ పుస్తకం బౌద్ధ సాహిత్యంలో అత్యంత అరుదైనది. ఖుద్దక నికాయంలో 547 జాతక కథలున్నాయి. అవన్నీ బుద్ధుని జీవితానికి ముడిపడినవే. అలాగే.... సిద్ధార్థుని అర్ధాంగి యశోధర. వీరిద్దరి జీవితాలకు ముడిపడి ఉన్న

జన్మజన్మల విషయాల్ని తెలిపే కథలు 'అవధాన కథల్లో, వినయ పిటకంలో, మహావస్తులో" ఉన్నాయి. అవి 40 కథ లున్నాయి. అ కథల్లో నుండి 12 కథల్ని తీసుకొని చక్కగా తెనిగించారు రాజ గోపాలరావు గారు. ప్రతి కథకీ తగిన విధంగా అర్థవంతమైన, అందమైన బొమ్మలతో ఈ పుస్తకాన్ని తెచ్చారు. ఈ పుస్తకం ప్రత్యేకత ఏమంటే రాజగోపాల రావు గారు ఈ పుస్తకాన్ని తన భార్య తిరుపతమ్మగారి దివ్యస్మృతికి అంకితం చేయడం.




**5. గౌతమ బుద్ధుని చరిత్ర:-** ఇది 2009లో వచ్చిన గ్రంథం. ఇది ఒక అపురూపమైన గ్రంథం. బుద్ధుని జీవితం మీద ఎన్నెన్నో పుస్తకాలు వచ్చాయి. అయితే ఈ పుస్తకం ప్రత్యేకత ఏమిటి? నిజం చెప్పాలంటే.. ఈనాడు చాలామంది చెప్పుకునే బుద్ధుని జీవిత చరిత్రలోని చాలా సంఘటనలు బౌద్ధ మూలగ్రంథాలైన త్రిపిటకాల్లో ఎక్కడా కన్పించవు. చాలా ఘట్టాలు ఆయా కాలాల్లో ఆయా రచయితలు ఏర్చి కూర్చినవే! త్రిపిటకాల్లో 'బుద్ధుని జీవిత చరిత్ర' అనే గ్రంథం ఏదీలేదు. అయితే, అనేక గ్రంథాల్లో కొన్ని కొన్ని ఘటనలున్నాయి. లలిత విస్తరం, మహావస్తు, అశ్వఘోషుని బుద్ధ చరితం, బుద్ధఘోషుని నిదాన కథ, బుద్ధవంశ, వినయపిటకం, జాతక కథలు, ధమ్మపథం, అట్ఠ కథలు, మూలాలంకార వస్తు, ఇంకా కొన్ని నికాయాలు-వీటన్నింటిలో అనేక సంఘటనలున్నాయి. వీటిలో కొన్ని విభేదాలూ ఉన్నాయి. అయితే వీటిలో కీలకమైనవి లలితా విస్తరం, నిదాన కథ, మహావస్తు. ఈ గ్రంథా లన్నింటినీ సమీక్షిస్తూ బుద్ధుని జీవిత చరిత్రని అద్భుతంగా మల చిన గ్రంథం ఈ 'గౌతమ బుద్ధుని చరిత్ర'. దీనిలో కొంతభాగం నడు స్తున్న చరిత్రలో ధారావాహికగా వచ్చింది. ఈ రచనకు ప్రధాన ఆధారమైన 'మహావస్తు' అనే గ్రంథం రాజగోపాలరావు గారికి మొదట్లో దొరకలేదు. చివరికి సారనాథ్ లోని కేంద్రీయ ఉచ్చ తిబ్బతి సంస్థాన్ వారి గ్రంథాలయంలో శిథిలావస్థలో ఉన్న గ్రంథం కని పించింది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి దాని జిరాక్స్ కాపీలు తెప్పించి, తన రచనను పరిపుష్టం కావించారు రాజగోపాలరావు గారు. ఇప్పటివరకూ తెలుగులో బుద్ధుని జీవితం మీద వచ్చిన సాధి కారిక గ్రంథం ఇది.




**6. గౌతమ బుద్ధుని సాంఘిక విప్లవం:-** ఇది 2011లో వచ్చిన పుస్తకం. అంతకుముందు 13 నెలలపాటు "నడుస్తున్న చరిత్ర"లో నిరాటంకంగా నడచిన ధారావాహిక ఇది. బౌద్ధం, బౌద్ధ దృక్పథం, బౌద్ధ సిద్ధాంతాల్ని, వాటిలోని విప్లవాత్మకమైన విషయాల్ని, ఆనాటి సమకాలీన భారతదేశ పరిస్థితులను అన్వయిస్తూ రాసిన అద్భుత గ్రంథం ఇది. రాజగోపాలరావు గారి రచనల్లో మణిమకుటం. ఋగ్వేదకాలం నుండి, ఉపనిషత్తులు, నాస్తిక దర్శనాల్ని వివరిస్తూ, వాటి మధ్య బౌద్ధం ఎలాంటి సాంఘిక పరి ణామాల్ని ముందుకు తెచ్చింది అని శాస్త్రీయంగా విశ్లేషించిన గ్రంథం ఇది. కులాలు. స్త్రీలు, అంటరానితనం ఇలాంటి విషయాల్లో బౌద్ధం ఎంత ప్రగతిశీల దృక్పథంతో ఉందో రాజ గోపాలరావుగారు చక్కగా వివరిం చారు. బౌద్ధులు చెప్పిన కర్మవాదాన్ని (ఈ సృష్టికి మూలం 'కర్త' కాదు 'కర్మ' అని చెప్పడం) భగవద్గీత ఎలా సంగ్రహించిందీ, బౌద్ధం చెప్పిన ఆర్థిక విధానాల్ని 'అర్థశాస్త్రం'లో కౌటిల్యుడు ఎలా చేర్చిందీ, బౌద్ధంలోని కొన్ని నైతిక జీవన విషయాల్ని మనుస్మృతిలో ఎలా చొప్పించిందీ-ఎంతో సత్ ప్రమాణికంగా వివరించారు రాజగోపాలరావు గారు.




-ఇవీ రాజగోపాలరావు గారి బౌద్ధ రచనలు.

**వారితో నా అనుబంధం:** చాలా తక్కువ. బౌద్ధంలో నాకు వచ్చే అనుమానాల్ని ఫోన్ ద్వారా చాలాసార్లు నివృత్తి చేశారు. వారి కోరికపై ఒకసారి వారి ఇంటికి వెళ్ళాను. అయితే, 2013లో మే 25న నాగార్జున సాగర్‌లో జరిగిన బౌద్ధ సమ్మేళనంలో వారితో కలిసి ఉన్నాను. బౌద్ధంలో ఉన్న "దుఃఖం" మీద (అసలు ఏది దుఃఖం?) నాకు కొంత సందిగ్ధత ఉంది. చాలామంది నుండి నాకు తృప్తికరమైన సమాధానాలు రాలేదు. ఆ రోజు సదస్సు ముగిశాక, మరునాడు లాంచీలో నాగార్జున కొండకు వెళ్తూ ఈ విషయం మీదే చర్చించాను. దాదాపు రెండు గంటలు (వచ్చేప్పుడు, వెళ్ళేప్పుడు) ఇదే చర్చ. ఆ చర్చ అక్కడా తెగలేదు. ఆ తర్వాత వయస్సురీత్యా వారికి శ్రమ కలిగించడం ఇష్టంలేక, ఈ విషయం చర్చించలేదు.

నాగార్జునసాగర్‌లో రాజగోపాలరావు(మధ్యలో ఉన్న వ్యక్తి) తో శ్రీ బొర్రా గోవర్ధన్ (కుడి). ఎడమపక్క కోటులో వున్న వ్యక్తి 'తెలంగాణా అంబేద్కర్' శ్రీ బోసి



కానీ, వారి పుస్తకాల్ని వారు పరిచయం కాకముందే చదివాను.

బౌద్ధాన్ని మాలాంటి భావితరం వారికి అర్థమయ్యేలా అందించిన వారిలో అగ్రగణ్యులు రాజగోపాలరావు గారు.

వారి రచనల్ని బౌద్ధులేకాకుండా, తెలుగు ప్రజలకి అందేలా చేయడం ఒక చారిత్రక అవసరం. ఈ పనిని 'ధర్మదీపం' వారు చేయాలనీ, ఇందుకు రాజగోపాలరావు గారి మిత్రులు, కుటుంబ సభ్యులు సహకరించాలని కోరుకుంటున్నాను.

తెలుగు నేలమీద బౌద్ధం వర్ధిల్లినంతకాలం శ్రీ రాజగోపాలరావు గారి రచనలూ వర్ధిల్లుతాయి.

అజరామరంగా నిలుస్తాయి!

వారికిదే నా అక్షరాంజలి!! ❊

# 'తెనుగులెంక'సూక్తులు-19



**పెత్తనంబు వలచు పెద్దలూరూర బా**
**కాల నూదుకొంద్రు గగన మదర**
**నిక్కమైన సేవ నెఱపెడి పిన్నలు**
**కంటబడరు సెనగ పంట వోలె.**

'తెనుగు లెంక' 'అభినవ తిక్కన'
**తుమ్మల సీతారామమూర్తి.**

**మ**నుషులు రెండురకాలుగా ఉంటారు. కొంతమందికి 'కడుపే కైలాసం. ఇల్లే వైకుంఠం'. తాము, తమ సుఖాలు, తమ సంపాదన తప్ప తక్కినవన్నీ పట్టనివారు. వీళ్ళు తాము సుఖంగా ఉంటే చాలనుకుంటారు. తమ చుట్టూ ఉన్న సమాజం వీళ్ళకి పట్టదు. వీళ్ళలో కొందరు సంపాదిస్తారు. దాచుకుంటారు. వీళ్ళకి అను భవించడం కూడా చేతకాదు. వీళ్ళంతా స్వార్ధ పరులు.

మనుషుల్లో రెండోరకం వాళ్ళు ఉంటారు. వీరు సంపాదించినా సంపాదించకపోయినా 'పొరుగువారికి తోడుపడవోయ్' అనుకుంటూ ఉంటారు. తాము సుఖపడుతూనే తమ ప్రక్క నున్నవారు కష్టపడుతుంటే చూడలేరు. ఎంతో కొంత సహాయం చేయాలనుకుంటారు. చేస్తారుకూడా! 'నువ్వు బ్రతుకు. నీచుట్టూ ఉన్నవారిని బ్రతికించు' అనేది వారి సిద్ధాంతం. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి, ఆక లితో ఉన్నవారికి అన్నంపెట్టడానికి, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉంటే కొంతవర కైనా సాయంచేసి తృప్తిపడతారు.

ఇతరులకు సహాయం చేయాలనుకునే వాళ్ళు మళ్ళీ రెండు రకాలుగా ఉంటారు. వీరిలో కొందరికి సహాయం ఎంత చేస్తారో అంతకుమించిన ప్రచారం కావాలి. వంద రూపాయలు సాయంగా ఇచ్చి వేయిరూపా యలు ప్రచారంకోసం ఖర్చుచేస్తారు. గాంధీ జయంతికో, స్వాతంత్ర్యదినోత్సవానికో ఆసు పత్రికి వెళ్ళి అనాథలకు అరడజను అరటి పండ్లిచ్చి అరవై ఫొటోలు తీయించుకుం టారు. ఆ ఫొటోలను పత్రికలలో ప్రకటించు కుంటూ అనాథ బంధువునని ప్రచారం చేసు కుంటారు. గోరంత సాయంతో కొండంత ప్రచారం – ఈ పత్రికలలో ముద్రించిన విష యాలను, ఫొటోలను పెద్దలకు చూపి తద్వారా సన్మానాలు, సత్కారాలు సంపాది స్తారు. వీలయితే ఉన్నత పదవులు సాధిస్తారు. తమ అభ్యున్నతికి సోపానాలుగా మలచు కుంటారు.

రెండోరకం వాళ్ళు అవసరమైన వాళ్ళకి సాయం చేస్తారు తప్ప, ఆ విషయాన్ని మరొ కరికి చెప్పరు. చెప్పాలని అనుకోరు. కుడిచేత్తో తాము చేసిన సహాయం ఎడమ చేతికి కూడా తెలియకూడదనుకుంటారు. తాము చేసే సాయం ఆత్మతృప్తికే కాని ప్రచారంకోసం, పదవులకోసం కాదు. సహాయం పొందిన వ్యక్తి కళ్ళలో కనిపించే కృతజ్ఞతా భావమే అతనికి పెన్నిధిలా కనిపిస్తుంది. పట్టరాని సంతోషాన్ని మిగులుస్తుంది.

గాంధీ లాగానో, మదర్ థెరిస్సా లాగానో గొప్ప గొప్ప పనులు చేయకపోయినా, తమ స్థాయిలో, తమకు నచ్చిన రీతిలో సేవచేసే మహానుభావులు ప్రతి గ్రామంలో ఒకరో ఇద్దరో ఉంటారు. వారిని ఎవరూ గుర్తించరు. గుర్తింపు పొందాలని వారూ ఆశించరు. పద వులు ఆశించేవారు మాత్రం తాము చేసిన వీసమెత్తు సాయాన్ని వీశెడంతగా ప్రచారం చేసుకుంటారు.

అందుకే తుమ్మల "పెత్తనాన్ని కోరుకునే పెద్దలే ఆకాశం అదిరిపోయేటట్లు తమ సేవను గురించి బాకాలను ఊదుకుంటూ ఉంటారు. కాని నిజమైన సేవచేసేవారు సెనగ పంటలాగా కంటికి కనిపించరు. (వేరు సెనగ భూమిలో ఉంటుంది గాని కంటికి కనిపించదు. అయినా దాని విలువ దానిదే) ఇతరులకు తెలియకుండా సేవచేసే తత్వం ఉన్నవారు నిజంగా గొప్పవారు కదా!" అంటారు. నిజమేకదా! అలాంటివారు ఈ సమాజంలో ఎంతమంది ఉన్నారు?

**–డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ,**
98497 99711

## మరణాక్షర శాసనం

–పి.లక్ష్మణ్‌రావ్, 94412 15989

నా మాతృభాషకు
నేనే పరాయివాడ్నై పోతున్నాను
ఇక నుండి రాష్ట్రంలోనే నేను
ప్రవాసాంధ్రుడ్ని!

మాతృగర్భం నుండి శ్వాసించిన భాష
వెంటిలేటర్ మీద ఊగిసలాడుతూ
పాలకుల చేతిలో
ఉరికంబం ఎక్కబోతోంది!

అమృత తుల్యమైన నా భాషపై
మరణశాసనం రాసి
మృత భాషల జాబితాలో చేర్చుతున్న
దయలేని పాలకులు
పెరిగిందీ ఈ మాతృభాష లాలనలోనే!

ఆంగ్లభాష అడుగులే
అందల మెక్కిస్తాయని
కొత్త సిద్ధాంతానికి రూపమిస్తున్న
పాలకులారా! ఒక్క విషయం

అమ్మ భాషకు దూరమై
మమ్మీ భాషకు చేరువైన
అనేకమంది విద్యార్థులు
రెండింటికీ చెడ్డ రేవడులై
అసమర్థులుగానే మిగిలిపోతున్నారని
గ్రహించండి!

అమ్మభాషలో ఆలోచించి
ఆంగ్లభాషను అన్వయిస్తేనే కదా
మాటలో స్పష్టత
వాక్య నిర్మాణంలో విశిష్టత!
పునాది బలంగా ఉంటేనే కదా
భవనం పటిష్టత!

నా నుండి నా భాషను వేరు చేస్తుంటే
తల్లి పాలనుండి బిడ్డను
వేరుచేస్తున్నట్లుంది!
నా నుండి నా భాషను వేరు చేస్తుంటే
మాతృ గర్భంలోనే
మృతశిశువు నైనట్లుంది!

పరాయి భాష అవసరమే కాని
దానితోనే బతుకు ముడిపడి వుందంటే
అర్థంలేని వాదన!

అమ్మభాషకు వేటువేయకుండా
మాతృభాషకు నష్టం లేకుండా
ఆంగ్లభాషను కూడా నేర్పండి!
తెలుగు భాషనే రక్షించండి
పాలకుల చేతితోనే పాడె కట్టకండి!



# ఓ సంచారి అంతరంగం

కుప్పె నాగరాజు గారు
కన్నడంలో రచించిన
'అలెమారియ అంతరంగ'కు
రంగనాథ రామచంద్రరావు
(9059779289) గారి
తెలుగు అనువాదం

## గట్టిపిండం మా మూగూరవ్వ

మా తాత, అవ్వల గురించి తెలుసుకోవాలని నాకు చాలా ఆసక్తి ఉండేది. అయితే నాన్న ఎన్నడూ తన తండ్రి గురించి మా దగ్గర మాట్లాడేవాడు కాదు. మేము తాత ముఖం చూడనే లేదు. మా తాతను తనను గుర్తుంచుకునేలా మా నాన్నకు ఏ ఆస్తిని వదిలిపెట్టి పోలేదు. అయినా అందరికీ తమ తండ్రుల పట్ల ఒక గౌరవమైన జ్ఞాపకం, అభిమానం ఉండటం సహజం. నేను ఇప్పుడు మీకు చెప్పబోతున్న విషయం మా తాత గుర్తుగా ఉన్న మా 'మూగూరమ్మ' అవ్వ గురించి. ఆమెను మేమంతా మూగూరవ్వ అనేవాళ్ళం. మా మూగూరవ్వ చెప్పినట్టు మా తాతకు ముగ్గురు భార్యలట. మొదటి ఇద్దరి భార్యలకు పిల్లలు ఉన్నారు. మా నాన్న మొదటి భార్య కొడుకు. మా చిన్నాన్న గోవిందయ్య రెండవ భార్య కొడుకట. మరదప్ప అని ఇంకొకడు మొదటి భార్య కొడుకున్నాడు. మూడవ భార్యగా వచ్చిన మా మూగూరవ్వకు పిల్లలు లేరు. పాపం తన చిన్న వయస్సులోనే మసూచికం వచ్చి ముఖమంతా మసూచికపు మచ్చలతో గుంటలుపడి వికారంగా ఉండేది. ఈ అవ్వ మా చిన్నాన్న దగ్గర ఉండేది. దృఢమైన శరీరంతో పొట్టిగా ఆరోగ్యంగా ఉండేది. అవ్వకు నాటు వైద్యం బాగా తెలుసు. మంచి గాయకురాలు కూడా. తానొక్కతే పల్లెలకు పోయి జోలె నిండా దవసధాన్యాలు నింపుకుని వచ్చే శక్తి ఉండేది. ఒక మగవాడిని ఎదురించగలిగేటట్టు జబర్దస్తుగా ఉండేది. పిల్లలు కలగని ఆడవాళ్ళకు పిల్లలు కలగటానికి మందులు ఇవ్వటం, దొంగతనంగా కడుపు తెచ్చుకున్నవాళ్ళకు మందులిచ్చి కడుపు తీయటం, మందులు మాకులు పెట్టినవారి కడుపులోంచి మందులు తీయటం చేసేది. దాంతోపాటు వందలాది కాన్పులు చేసి తల్లి బిడ్డలను బతికించిన మంత్రసాని ఈ అవ్వ. ఒకసారి కేక పెట్టి పిలిస్తే మొత్తం ఊరికి ఇది మూగూరమ్మ కంఠం అని గుర్తుపట్టడం కష్టమయ్యేది కాదు. పొలం ఇంటి పనులు బాగా నేర్చుకుంది. మొత్తం మీద సకలకళావల్లభురాలు మా మూగూరవ్వ.

మేము చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు, మాకు బడికి సెలవులు ఇచ్చినపుడు ఈ అవ్వ వెంబడి పశువులు, మేకలు కాయటానికి వెళ్ళేవాళ్ళం. తాను వాటిని కాయటానికి వస్తున్నప్పుడల్లా తనతోపాటు వలలు, ఉచ్చులు అన్నిటిని తెచ్చేది. ఏదైనా ఉడుతనో, పక్షినో పట్టి అక్కడే మంటవేసి కాల్చి ఇచ్చేది. ఈ అవ్వ నోరు తెరిస్తే



వందలాది పాటలు, జానపద కథలు పుంఖానుపుంఖాలుగా వెలు వడేవి. నా బాల్యంలో నాకు గుర్తున్నంత వరకు మొదటిసారిగా బాలనాగమ్మ కథను ఈ అవ్వ నోటి ద్వారా విన్నాను. ఇప్పటికీ ఆ కథ నా జ్ఞాపకాల పొరల్లో ఉండిపోయింది. 'బిదరొళగిన చదర', 'మాయాకార మంత్రవాది', 'రాజా-రాణి' ఇలాంటి అనేక కథలను ఆమె చెబుతుంటే మాకు పొద్దుపోవడమే తెలిసేది కాదు. ఈ అవ్వతో పశువులను కాయటానికి వెళ్ళటమంటే మాకు పట్టరాని సంతోషం కలిగేది.

ఈ అవ్వకు పిల్లి అంటే చాలా ప్రాణం. 'అన్నీ జబ్బులకు పిల్లి మాంసం శ్రేష్ఠం' అనేది. ఎవరి ఇంట్లో అయిన తుంటరి పిల్లి ఉంటే దాని పీడ భరించలేని వారు దాన్ని పట్టుకుని అవ్వకు ఇచ్చేవారు. పొరబాటున ఎవరి ఇంటి పిల్లి అయినా ఈ అవ్వ ఇంటికి వచ్చిం దంటే , ఇక ఆ పిల్లి అవ్వనుంచి తప్పించుకుని పోవటానికి సాధ్య మయ్యేది కాదు. దాని కథను ముగించి తన కడుపులో చేర్చుకునేది. బాలింతలకు వచ్చే జ్వరంతో ఎవరైనా బాధపడుతూవుంటే ఈ చలాకి అవ్వ ఊరి పిల్లి మాంసానికే వెల్లులి, మిరపకాయలు, ఉప్పు వేసి బాగా ఉడకబెట్టి ఇది అడవి పిల్లి మాంసం అని చెప్పి ఆ ఆడమనిషికి తినిపించేది. ఏమీ తెలియని ఆ ఆడమనిషి మూగూరవ్వ మాటలు నమ్మి ఆ పిల్లి మాంసాన్ని లొట్టలేసుకుంటూ తినేది.

ఇంత ఉత్సాహం, లోతైన నాటు వైద్య జ్ఞానం, జానపద సంపద ఉన్నటువంటి అవ్వ నేను మరొకసారి సెలవులకు ఇంటికి వచ్చేలోపు మా చిన్నాన్నతో పోట్లాడి వెళ్ళిపోయింది. అవ్వ ఊరు వదిలిపోయిన విషయం తెలిసి నాకు చాలా బాధ కలిగింది. ఈ సెలవులను అవ్వ లేకుండా గడపటం ఎలా అనిపించేది. మా తాతకు మూడవ భార్యగా, పిల్లాజెల్లా లేకుండా దిక్కుదివాణం లేకుండా మా చిన్నాన్న ఆశ్రయంలో ఉన్న అవ్వ ఇప్పుడు ఎక్కడుందో తెలియదు. అత్యంత ఆత్మాభి మానురాలైన అవ్వ తన అన్నాన్ని తానే సంపాదించుకుని తినేంతగా సామర్థ్యం కలిగివుండటం నిజం. అవ్వ వయస్సు మీద పడుతుండగా, ఏదో ఊళ్ళో తన దూరపు బంధువుల ఇంట్లో చేరుకున్నదట. తరువాత ఏదో తీవ్రమైన రోగానికి బలియై చనిపోయిన విషయం తెలిసింది. ఆఖరువరకూ నాకు అవ్వ ముఖం చూడటానికి కుదరనే లేదు.

## కోతల కాలపు అతిశయం

సంక్రాంతి పండగ దగ్గర పడ్డప్పుడు దాసరులు తమ ఊళ్ళల్లో ఉండేవారు కారు. ఎందుకంటే అది కోతల కాలం. రైతులు తాము పండించిన పంటలను కళ్ళం చేసి ధాన్యాన్ని తమ గాదెల్లో నింపుకుని సంభ్రమించే కాలం. రైతులు ధాన్యాన్ని చేతికి ఎముకేలేని దాతల్లా అడిగినవారందరికి ఇవ్వటం ఈ కోతల సమయంలోనే. మా దాస రులు ఈ సందర్భాన్ని బాగా ఉపయోగించుకునేవారు. కళ్ళం చేసే చోటికి వెళ్ళి అక్కడ పదాలు పాడి, కథలు చెప్పి, అలుపు తీర్చి చాటల నిండా ధాన్యాన్ని పొంది తమ జోలెలను నింపుకునేవాళ్ళు. వయసు మీరిన వాళ్ళు, చిన్నపిల్లలు మా ఊళ్ళల్లోనే గింజలను తూర్పారబట్టే కళ్ళం దగ్గరికి వెళ్ళే వాళ్ళు. కళ్ళం చేసే చివరి రోజున ధాన్యపు రాశిని కళ్ళం మధ్యలో కుప్పగా పోసి దానికి పూజలు చేసేవారు. పూజ తరువాత అక్కడికి వచ్చిన అందరికి పళ్ళతో చేసిన ప్రసాదం పంచిన తరువాతే ఆ ధాన్యపు రాశిని కదిలించేవారు. ఆ రాశిలో ప్రత్యేకించి కొంత భాగాన్ని పక్కన పెట్టి సంవత్సరమంతా వ్యవసాయ సామగ్రులను చేసిచ్చిన ఆచారులకు, శుభ, అసుభ కార్యాలకు వచ్చి తమకు సేవచేసిన వారికి, ముట్టుబట్టలు ఉతికి శుభ్రం చేసిన చాకలికి, తల క్షవరాలు చేసిన క్షురకులకు మొదలైన సేవలు అందించిన అందరికి భాగాలు కొలిచి ఇచ్చేవాళ్ళు. మేము ఎవరెవరు ఎక్కడెక్కడ కళ్ళం చేస్తున్నారో ఊరంతా తిరిగి తెలుసుకుని అలాంటి రోజుల్లో తప్పనిసరిగా హాజరయ్యేవాళ్ళం. పిల్లలను, పెద్దలను గుర్తించి ఎవరెవరికి ఏ ప్రమాణంలో ఇవ్వాలో నిర్ణయించి, చిన్నపిల్లలకంతా దోసిళ్ళ నిండా ఇచ్చేవాళ్ళు. పెద్దవాళ్ళకు చాటలో, పెద్దపాత్రలో ఇచ్చేవాళ్ళు. నాన్న ఊళ్ళో లేనప్పుడు నేనూ నా తమ్ముడు మా ఇతర బంధువుల వెంబడి వెళ్ళి మా జోలెల్లో దవసధాన్యాలను వేయించుకుని వచ్చేవాళ్ళం. రైతులు చివరి కళ్ళానికి వచ్చిన వారిని ఖాళీ చేతులతో పంపేవాళ్ళు కాదు. తమ యోగ్యతానుసారం ధాన్యం ఇచ్చి పంపేవారు. నాకు ఊహ రానంత కాలం ఈ రాశిపూజా చేస్తున్న కళ్ళం దగ్గరికి వెళ్ళి దవసధాన్యాలు సంగ్రహించేవాడిని. తరువాత వెళ్ళటం ఆపాను.

## గుట్టుగా చేసిన ఎల్లమ్మ పండుగ

"కష్టాలు వచ్చినపుడు వెంకట రమణ' అనడం నానుడి. అలా మా తల్లితండ్రులకు ఏమనిపించిందో ఏమో ఓ రోజు ఇంటి దేవత 'ఎల్లమ్మ' గుర్తొచ్చి ఈ ఏడాది దేవత పండుగ చేద్దామని మాట్లాడు కున్నారు. సాధారణంగా మనిషికి దేవుడు గుర్తుకు రావడం అతడు కష్టాల్లో కాలి, కనిలి, అలసిపోయినపుడు. అమ్మ ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తుండటం వల్ల, రెండవ భార్యగా వచ్చిన అమ్మ వల్ల నాన్నకు సుఖం అన్నది లేకపోవటంతో నాన్న తీవ్రమైన వ్యధకులోనై ఇంటి దేవుళ్ళను గుర్తు చేసుకున్నాడు. పండుగ చేసుకోవటమంటే అంత సులభమేమీ కాదు. దానికి చాలా ఖర్చు అవుతుంది. పైగా నియమనిష్టలతో చేయాలి. పొరబాటున ఏదైనా ఎక్కువ తక్కువలు జరిగితే ఆ ఎల్లమ్మ ఎక్కడ కోపగించుకుని తమ సంసారానికి కీడు చేస్తుందేమోననే భయంతోనే ఈ పండుగ జరుపుకోవడం గురించి ఆలోచించసాగారు. తరతరాలుగా అనుసరిస్తూ వస్తున్న పద్ధతి. నాన్న ఈ విషయమై తన తమ్ముడితో "మీ వదనికి అప్పుడప్పుడు ఉసారు తప్పుతా ఉంది. నాకు యాల్నో ఏమీ సెయ్యి పడ్తా లేదు. మా ఎల్లమ్మ దేవత పండుగ సేసి శానానాళ్ళు అయ్యింది. ఈ యాడాద్లో పండగ సేస్తాము. నీ అభిప్రాయం ఏమబ్బ?" అని అడిగాడు. అందుకు చిన్నాన్న "ఆయా ఇడన్నా, నువ్వు ఎట్ల సేస్తావో అట్లానే కాని. ఆ తల్లి అంద్రుకు మంచిదే సేస్తి. ఒక మంచి దినం సూసి సెప్పన్న, పండగ సేస్తాము" అని అన్నాడు. నాన్న తన శాస్త్రం చెప్పే గంటు విప్పి పంచాంగం తీసి పండుగకు తగిన రోజును నిర్ణయించాడు. పండుగకు అయ్యే ఖర్చును ఇద్దరూ సమానంగా పంచుకోవాలని నిర్ణయించుకుని ఏర్పాట్లకు సిద్ధమయ్యారు.

ఈ పండుగ ప్రత్యేకమైంది. అంటే ఆ పండుగను మేము నివసిస్తున్న ఇంట్లో చేసుకోవడానికి కుదరదు. సూతకం, మైల కాకూడదు. ఏదైనా పొలంలో వేపచెట్టు నీడలో ఒక పందిరి వేసి దానికింద ఒక గద్దెను నిర్మించాలి. అందులో మట్టితో ఒక బొమ్మను చేసి దాన్ని నగలతో అలంకరించి, పువ్వులు ముడిచి, కుంకుమ



పెట్టి, పెరుగన్నం తట్టను నైవేద్యం పెట్టి మొదటి రోజు పూజ చేయాలి. మరుసటి రోజున ఆ గుడి ముందు నాలుగుకాళ్ళ జంతువును బలియిచ్చి రక్త తర్పణం చేసి తల్లిని శాంతింపజేయాలి. మా ఇంట్లో దేవుడి పెట్టె అని ప్రత్యే కంగా ఒక పెట్టె ఉండేది. ఆ పెట్టెలో ఎల్లమ్మ దేవతకు సంబంధించిన నగలు ఉండేవి. అవన్నీ వెండితో చేసిన నగలు. ఈ నగలను వేరే ఏ సందర్భంలోనూ బయటికి తీసేవారు కాదు. కేవలం ఈ పండుగ చేసే సందర్భంలో మాత్రమే వాటిని బయటికి తీసి శుద్ధమైన నీటితో శుభ్రం చేసి వాటిని మట్టితో చేసిన విగ్రహాన్ని అలంకరించేవాళ్ళు. ఆ దేవుడి పెట్టెలో ఉన్న నగలన్నీ ఆ రోజు నాన్న బయటికి తీసి వాటిని శుభ్రం చేశాడు.

ఇక పండుగ రోజు దగ్గర పడుతున్నట్టే ఏర్పాట్లు సాగేవి. ఈ పండుగకు మా బంధువులందరిని అంటే మా పిన్నమ్మలను అమ్మ తప్పకుండా పిలుస్తుందని నేను అనుకున్నాను. అయితే నాన్న, చిన్నాన్నలు ఎవరెవరిని పిలవాలో, ఆ విషయంగా చర్చించారు. ఆ ప్రకారమే మా వంశీకులను తప్ప మాఇంటి నుంచి పెళ్ళి చేసుకుని బయటికి పోయిన అక్కాచెల్లెళ్ళను తప్ప ఇతరులను ఎవ్వరినీ పిలవ కూడదనీ, ఎవరికీ ఈ విషయం తెలియజేయరాదనీ నిర్ణయించుకున్నారు. పండుగ జరిపే స్థలంలో మా వాళ్ళు కాని ఇతరులెవ్వరూ అంటే మాలమాదిగలు మొదలు గౌడ, కురువ, నాయక ఇలా ఏ జాతి జనాంగమువారూ ఇటువైపు రానట్టు చూసుకుని చాలా గుట్టుగా పండుగ ముగించాలి. ఈ నియమాన్ని పాటించకపోతే ఆ ఎల్లమ్మ తల్లి కోపగించుకుని మాకు ఇవ్వకూడని కష్టాలు ఇస్తుందని నాన్న వివరించాడు. ఇదంతా విని నాకు చాలా విచిత్రం అనిపించింది. అనుకున్నట్టుగానే ఆ పండుగ రోజు వచ్చింది. ఒక స్థలాన్ని గుర్తించి సాయంత్రం నాలుగైదు గంటల సమయానికి అందరం ఆ స్థలానికి చేరుకున్నాం. వెనుకటి రోజునే అన్నీ విధులు పద్ధతిగా పూర్తి చేశాం. ఆ గుడిముందు పూజచేసి జంతువును నరికి బలియిచ్చి దాని చర్మాన్ని వొలిచి మాంసాన్ని ముక్కలుగా కోసి వంటకు సిద్ధం చేసుకున్నారు. బలియిచ్చిన ఆ ప్రాణి అవశేషాలను ఆ చోటు నుంచి బయటికి తీసుకుని వెళ్ళడానికి లేదు. వలిచిన చర్మాన్ని కూడా వదిలిపెట్టకుండా దాన్ని మంటల్లో కాల్చి మాంసంగా దాన్ని పులుసులో వాడారు. అందరూ పూజచేసి, నైవేద్యం పెట్టి భోంచేశాం. ఎక్కడంటే అక్కడ ఎముకలను పారవేయకూడదని, ఏ పక్షులకు, జంతువులకు దొరక కూడదని అక్కడే ఒక గొయ్యి తవ్వారు. తిని వదిలివేసిన ఎముకల సమేతంగా మిగిలిన ఆహారపదార్థాలను, చివరికి పాత్రలను కడిగిన నీటిని కూడా ఆ గొయ్యిలో వేసి, దాన్ని మట్టితో మూసివేశాం. అక్కడ ఏమీ జరగనట్టు ఏ గుర్తులూ లేకుండా చేసి రాత్రి అందరం ఇల్లు చేరుకున్నాం. నాకు ఇదొక విచిత్రం అనిపించింది. అయినా ఈ విషయం గురించి ఎవరినీ ఏమీ అడగకుండా నా అంతట నేను మౌనంగా ఉండిపోయాను. నాకు గుర్తున్నంత వరకు ఈ పండుగ జరుపుకుని ఇప్పటికి ముప్ఫయి నలభై ఏళ్ళు గడిచివుండొచ్చు. మళ్ళీ ఈ పండుగను జరుపుకోనే లేదు. ఆ దూరంలోని సవదత్తిలో కొలువైన ఎల్లమ్మ దేవత యొక్క శక్తి సామర్థ్యాల పట్ల మా వంశస్థులకున్న విశ్వాసం అంతులేనిది. ❋

**గమనిక:**

'అమ్మనుడి' చదువరులను ఎంతో ఆకట్టుకొంటున్న ఈ కథల మాలిక 'ఓ సంచారి అంతరంగం' పుస్తకంగా వెలువడింది.. కనుక ఇంతటితో ఈ ప్రచురణను నిలిపివేస్తున్నాము. -సం॥

ఈ క్రింది చిరునామాకు రు.200/ ఎం.ఒ.చేస్తే పుస్తకాన్ని వెంటనే పంపిస్తారు. చిరునామా: శ్రీమతి పూదోట శౌరీలు,1-2-740, హనుమాన్ మందిరం దగ్గర, రాకాసిపేట, బోధన్-503 185. నిజామాబాద్ జిల్లా, తెలంగాణ. ఫోను: 90109 53505




## ఓ సంచారి అంతరంగం
## పుస్తక విడుదల సభ - ఆహ్వానం

'అమ్మనుడి'లో 8 నెలలుగా ప్రచురింపబడుతూ చదువరుల అభిమానాన్ని, ప్రశంశలను పొందుతున్న ఈ రచన 'ఓ సంచారి అంతరంగం' పుస్తకంగా వచ్చేస్తున్నది. ఫిబ్రవరి 11 శనివారం సాయంత్రం 5గం.లకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో- కోటసెంటర్‌లో గల వాసవీ కాన్ఫరెన్సుహాలు, వాసవీ బేకరీ పైన విడుదల అవుతుంది. ఈ సభలో కన్నడ మూల రచయిత శ్రీ కుప్పె నాగరాజు, అనువాదకుడు శ్రీ రంగనాథ రామచంద్రరావు, చిత్రకారుడు శ్రీ చిదంబరం, 'అమ్మనుడి' సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు, ప్రచురణకర్త శ్రీమతి పూదోట శౌరీలు తదితరులు పాల్గొంటారు. శ్రీ శివ రాచర్ల (యు.ఉస్.ఎ) ఈ పుస్తకాన్ని సమీక్షిస్తారు. సభను శ్రీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహిస్తారు.

**అందరికీ ఆహ్వానం.**

# చిత్ర కవిత్వం

- ప్రయాగ కృష్ణమూర్తి,
81790 63842

కవిత్వం అంటే ఒక ఆవేశం. ఒక ఆలోచన. ఆవేశాన్ని నియంత్రించుకొని, ఆలోచనను ప్రత్యేక ధోరణిలో వెల్లడించడమే కవిత్వం. కవిత్వం భంగ్యంతరంగా ఉండాలని కొంతమంది భావం. కాదు, సూటిగా ఉండాలని మరికొందరి అభిప్రాయం. ఏది ఏమైనా ఆలోచనాత్మకంగా, విజ్ఞాన దాయకంగా ఉండి, వినోదం, సందేశాలతో కూడిన కవిత్వం సామాజిక చైతన్యాన్ని కేడా కలిగిస్తే మంచిది. కవిత్వం ఏరూపంలో ఉన్నా ఆదరించదగిందే.

పద్యంలో, గద్యంలో, వచన కవితారూపంలో ఎలా ఉన్నా అందులో వ్యక్తం చేసే భావం ముఖ్యం. పూర్వకాలంలో పద్యకవిత్వమే రాజ్యమేలింది. ఆ కవిత్వం పండిత వర్గానికే పరిమితమైంది. అంతుకే ఆ పద్యాన్ని రచించే కవి తన ప్రతిభా వ్యుత్పత్తుల్ని ప్రదర్శించటానికి భిన్న రూపాల్లో కవిత్వ రచనచేశాడు. కవితా లక్షణాల్ని బట్టి పూర్వులు ఆశు, మధుర, చిత్ర, విస్తర కవితలుగా విభజించారు. ఆశుకవిత్వం అంటే, రసస్ఫోరకంగా ఉండి సరళసుందరంగా అవగాహనా సౌలభ్యంతో ఉండేది. చిత్ర కవిత్వం ఆశ్చర్యాన్ని, అద్భుతాన్ని, చమత్కారాన్ని కలిగింపజేసేది. ఇందులో పాండిత్య ప్రదర్శన ఉంటుంది. ఒకరకంగా పదాలతో చేసే విచిత్ర విన్యాసం. విస్తర కవిత్వం అంటే కథావిస్తృతితోకూడి వర్ణనలతో సాగేది. కావ్యాలు, ప్రబంధాలు ఈకోవలోకి వస్తాయి. ఇలాంటి కవితా ధోరణుల్ని పరిశోధనాత్మకంగా, ఆధునిక కవుల పద్యాలనుకూడా ఉదహరిస్తూ, 'చిత్రకవిత్వాన్ని' గూర్చి పలు విశేషాల్ని వెల్లడిస్తూ ప్రయాగ కృష్ణమూర్తి గారు రచించిన పుస్తకం త్వరలో వెలువడనుంది. పద్యకవిత్వ పరిణామాన్ని, వైవిధ్యాన్ని అవగాహన చేసుకోవడానికి ఎంతో ఉపకరించగల ఈ పుస్తకంలోని కొన్ని అంశాలను మాత్రమే ఈ వ్యాసంలో ఇస్తున్నాము. ఆసక్తి గలవారు ఆ పుస్తకంకోసం రచయితను సంప్రదించవచ్చు-సంపాదకుడు)

**తె**లుగు సాహిత్యంలో కవులకు కొదువలేదు. కోకొల్లలుగా ఆంధ్రదేశమంతా విస్తరించియున్నారు. ప్రవాసాంధ్రులలోనూ వున్నారు. అసలు కవులు కాని వారు ఎవరు? 'గాడిద నీవునుం కవివి కావు గదా యనుమానమయ్యెడిన్' అన్నాడు శ్రీనాథుడు. అప్పుడు కవులు మాత్రమే వుండేవారు. ఇప్పుడు మహా కవులున్నారు, కవిశేఖరులున్నారు, కవివతంసులున్నారు, కవిబ్రహ్మలున్నారు, కుకవులున్నారు, కవిబ్రువులున్నారు. కవులలో ఇన్ని రకాలా? ఎవరు వీరు? ఎట్లా గుర్తించటం? అంతా గందరగోళం. అసలు కవి అంటే ఎవరు?

ఇది రెండక్షరాల పదమే గాని నిర్వచించటం కష్టం. స్థూలంగా చెప్పాలంటే కవిత్వం చెప్పేవాడు కవి. కవిత్వం అంటే? దీన్ని నిర్వచించటం ఇంకా కష్టం. నన్నయభట్టు నుంచి నేటివరకూ ఎవరికి తోచిన నిర్వచనాలు వారు చెప్పారు. ఏదీ సమగ్రంగా వుండదు. అందమైన అబద్ధమే కవిత్వం అన్నాడు ఒకడు. చెప్పదలచుకొన్న విషయాన్ని మామూలుగా చెప్పకుండా మరొక రకంగా చెప్పి మెప్పించటం కవిత్వం అన్నాడు ఇంకొకడు.

లక్షణాన్ని బట్టి కవిత్వం నాల్గు రకాలు. 1) ఆశు కవిత్వం 2) మధుర కవిత్వం లేక సరస కవిత్వం 3) చిత్ర కవిత్వం 4) విస్తర కవిత్వం.

**ఆశు కవిత్వమంటే** అడిగిన వెంటనే పద్యం చెప్పటం. అనగా వేగంగా చెప్పాలి. శరవేగంగా చెప్పాలి. వింటిని విడిచిన బాణం ఎంత వేగంగా పోతుందో అంత వేగంగా అన్నమాట. ఆశుగము అంటే బాణమే. ఆశు కవిత్వంలో ఆరితేరిన కవులు ఎంతోమంది వున్నారు. కాని ఆలోచించుకోటానికి కూడ వ్యవధి లేకుండా చెప్పటం వల్ల అప్పటికప్పుడు పద్యం బాగున్నట్లు కనుపించినా నిదానంగా తరచి చూస్తే అంత బాగాలేదేమోననిపిస్తుంది. అంత మాత్రంచేత అవధాన కవులు ఆశువుగా చెప్పిన అన్ని పద్యాలు బాగుండవని కాదు. కొంతమంది కవులు ఆశువుగా చెప్పిన పద్యాలు సరస కవిత్వమనే భావన కలిగిస్తై.

మచ్చుకు రెండు పద్యాలు. మొదటగా తిరుపతి వేంకట కవుల పద్యం. 1912లో తిరుపతి కవులు అవధానం చేయటానికి వినుకొండ వచ్చారు. విరోధులు పృచ్ఛకులుగా కూర్చున్నారు. ఒక పృచ్ఛకుడు దశావతారాలను కంద పద్యంలో చెప్పమన్నాడు. ఇంకో పృచ్ఛకుడు సభాధ్యక్షుల పేరు కూడ అందులో వస్తే బాగుంటుందన్నాడు. అప్పుడు ఇంకా ఏం కావాలి? అన్నారు వేంకట శాస్త్రిగారు. మీ యిద్దరి పేర్లు కూడ పద్యంలో జొప్పించండి అన్నా డొకడు. పద్యం ఆశీర్వాద పూర్వకంగా వుంటే బాగుంటుందన్నాడు ఇంకో పృచ్ఛకుడు.

ఈ సంభాషణ ఇట్లా జరుగుతూ వుండగానే తిరుపతి శాస్త్రిగారు పద్యం పూరించి చదివారు.

*జల చరధుల కిరి నరహరి*
*కవితవటు త్రివిధ రామ కలుకులు బుద్ధం*
*డిల తిరుపతి వేంకటశా*
*స్త్రులను పరబ్రహ్మ శాస్త్రి జూతురు కరుణన్.*

మరొక అవధానంలో ఒక పృచ్ఛకుడు అవధాని నారాయణం బాల సుబ్రహ్మణ్యం గారిని ప్రజాకవి గద్దర్ అవధానం చేస్తే ఎట్లా వుంటుందో ఉత్పలమాలా వృత్తంలో చెప్పండి అన్నప్పుడు ఆయన చెప్పిన పద్యం.

*ఏందిర యీడిగోల! గణ మేందిర ప్రాసలవేందిరా రసం*
*బేందిర! ఈ సమస్య లివి ఏందిర! ఈటికి పూరణేందిరా*
*మందికి తిండి లేదు పరమాన్నము వాడికి పెట్టుటేందిరా*
*ఏందిర? ఇంతసేపు శ్రమ ఏదిర చెమ్మట పట్టదేందిరా.*

పద్యంలో గద్దర్ భాషనుపయోగించటమే కాదు ఆయన భావాలను, పడికట్టు రాళ్ల వంటి పదాలను ప్రయోగించి చెప్పటం విశేషం.

ఇక రెండవది **మధుర కవిత్వం లేక సరస కవిత్వం.** రసంతో

కూడిన కవిత్వం. ఇది ఎంతో సరళంగా వుంటుంది. ఆస్వాదించ తగినదీ. ఆనందించ తగినది. దీనికి ఉదాహరణలుగా ఎన్ని పద్యాలైనా చెప్పవచ్చు. వేమన పద్యాలు గాని, బద్దెన పద్యాలు గాని ఎంతో మధురంగానూ, అర్థవంతంగానూ, నీతి దాయకంగాను వుంటై. పూర్వకవి పద్యాలు ఒకటి, రెండు చూద్దాం. మా గురువు గారు ఒక రోజు ఒక పద్యం చదివారు. అది ఆయనదే.

*వలపెదదలోన తృళ్ళిం*
*తలుపెట్టగ కౌగలించి నారాయణున*
*కృలశాబ్ధికన్య ఏటికొ*
*వలదు వలదు కనుల చూడ వలదని పలుకున్.*

"ఈ పద్యం అర్థం తెలుస్తూనేవుందిగదా ఎందుకు భర్తను కళ్లతో చూడవద్దని లక్ష్మీదేవి కోరిందో కారణమూహించి జవాబు కంద పద్యంలోనే వ్రాసుకురండి" అన్నారు మా గురువుగారు.

దానికి సమాధానంగా నేను వ్రాసుకొచ్చిన పద్యం.

*నారాయణు నేత్రమలన*
*వారిజపతి కుముదపతులె, పతికవయంగా*
*వారిరువురు చూచెదరని*
*వారిధిసుత, పతిని చూడవలదని పలికెన్.*

పద్యం బాగా కుదిరిందని, చెప్పదలుచుకున్న భావం స్పష్టంగా వుందని, పతితో కలిసి వున్నప్పుడు సూర్యుడు, చంద్రుడు చూస్తారని లక్ష్మీదేవి పతిని కళ్ళు మూసుకోమని చెప్పటం ఎంతో సమంజసంగా వుందని మా గురువుగారు నన్ను మెచ్చుకున్నారు.సూర్యుడు, చంద్రుడు విష్ణుమూర్తి కళ్లు అనే విషయం స్ఫురించటం వల్ల నేను ఈ పద్యం వ్రాయగలిగాను.

ఇక మూడవది **చిత్ర కవిత్వం.** చిత్రం అంటే అద్భుతం, ఆశ్చర్యం, విచిత్రం, దర్శనీయం అనే అర్థాలున్నై. చమత్కారమైన గూఢ కవిత్వాన్ని కూడ చిత్ర కవిత్వం అంటారు. 'ఆశు కవిత్వంబులల్లితేనే సరా చిత్ర ప్రబంధముల్ చేయవలదె' అన్నది ముద్దు పళని.

చిత్ర కవిత్వం మధుర కవిత్వం అంత సరళంగా వుండదు. ఉంటే విచిత్రం ఏముంది? కవి తన ప్రతిభను బయట పెట్టుకోవటానికి వ్రాశాడా అన్నట్లుంటుంది. పద్యాన్ని మామూలుగా నడిపించినా పాదాల మొదటి అక్షరాలు కలిపితే తన పేరు రావాలనో, చదవగానే ఒక అర్థం స్ఫురించి కాస్త ఆలోచించిన మీదట అసలర్థం బోధ పడాలనో వ్రాస్తారు. కొంతమంది రకరకాల గణాలు వేసుకోవటానికి వీలున్నా అన్నీ లఘువులే వుండాలని సర్వ లఘు కందాలు, సర్వ లఘు గీతాలు వ్రాసిన వారున్నారు. మా గురువుగారు సప్తస్వర కందం వ్రాశారు.

*మా పని సరిగాగాగని*
*మా పాపారి గరిమపస మాపగదగదా*
*పాపారి గదా నీగద*
*మాపా, నిగమ పదపాద, మానిస దాదా.*

ఇది ఆయన వ్రాసిన 'గౌరీ కల్యాణం'లోది. నారదుడు తన మహతిని మీటుకుంటూ హిమవంతుడి వద్దకు వెళ్తున్నప్పటిది. ఇటువంటి పద్యాలకు అన్వయం కొంత క్లిష్టమే. ఇందులో 'సరిగమపదని? అక్షరాలు మాత్రమే వున్నై.

మాపని = మా కార్యమును; సరిగా=చక్కగా; కాన్=అగునట్లు; కని=చూచి; మా పాపారి=మా పాపమనే శత్రువు యొక్క గరిమపస =అధిక బలమును; మాపగ తగదా=పోగొట్టకూడదా; నీ గద=నీ కౌమోదకి గద; పాపారి గదా = పాపములకు శత్రువే గదా; మాపా= లక్ష్మీపతీ; నిగమపదపాద=వేదములను వర్ణించు పాదములు గల వాడా; మాని+సదా+దా=చిత్తౌన్నత్యము గలవారి కోర్కెలను ఎల్లప్పుడు తీర్చువాడా.

ఇంకా కొంతమంది రెండు మూడక్షరాలతోనే పద్యాన్ని నడిపించారు. తెనాలి రామకృష్ణుని పద్యం మేకతో కకు మేక తోక మేకకు తోక లాంటివి. కొంతమంది పద్యానికి రెండర్థాలు తెప్పిస్తే, మరి కొంతమంది మూడర్థాలు తెప్పించారు. కొంతమంది నాలుగు అర్థాలూ తెప్పించినవారున్నారు. మరి కొంతమంది ఇంకాస్త ముందుకుపోయి గర్భ కవిత్వం వ్రాశారు. అంటే ఒక పద్యంలో మరొక పద్యాన్ని యిమడ్చటం. చంపకమాల నడుస్తూ వుంటుంది. దానికి ఒక అర్థం వుంటుంది. అందులో కందం ఉంటుంది. దానికి మరో అర్థం వుంటుంది. వెఱ్ఱి వెయ్యి విధాలన్నట్లు మరి కొంతమంది బంధ కవిత్వం వ్రాశారు. నాగబంధం, చక్రబంధం, మాలికాబంధం, ఖడ్గ బంధం, ఛత్రబంధం మొదలైనవి. వీరు ముందే ఒక బొమ్మ వేసుకుంటారు. ఆ బొమ్మలో అక్షరాలనమరుస్తారు. వాటిని వరుస గానో, పై నుంచి క్రిందకో లేక క్రింద నుంచి పైకో లేక ప్రక్కలకో మెలికలు త్రిప్పుతూ పద్యాన్ని నడిపిస్తారు. ఇది ఒక రకం గారడీ. ఇందులో రసం లేదు. ఆనందం లేదు. అసలు అర్థం అయితే కదా! ఈకెకు ఈకె, పీకెకుపీకె వేరుచేసి, ఏకాక్షర నిఘంటువును దగ్గర పెట్టుకొని కనీసం ఇద్దరు పండితులు కూర్చుని కుస్తీ పడితేగాని ఒక పట్టాన అర్థం కాదు. అప్పటికే చెమటపట్టి అలసిపోయి వుంటారు గనుక ఇక ఆనందించేదేముంటుంది? ఇటువంటి కవ్వితం వ్రాయటా నికి బోలెడు పరిశ్రమ కావాలి.పాండిత్యం ఎంతైనా అవసరం. అందుకే దీనికి నేను సర్కస్ కవిత్వం లేక కసరత్ కవిత్వం అని పేరు పెట్టాను.

కవికి మధుర కవిత్వం మీద ఎంత కోరిక వుంటుందో చిత్ర కవిత్వం మీద కూడా అంతే కాంక్ష వుంటుందట. కవిత్వ వైచిత్రి తెలిసినవారు కోమల కథా కావ్యాన్ని ఏ విధంగా ఆస్వాదించి ఆనందిస్తారో చిత్ర కవిత్వాన్ని కూడ ఆ విధంగానే వినోదిస్తారట. దానికి దృష్టాంతం ఏమిటంటే, పతి సతి యొక్క మధురమైన అధరాన్ని చవిగొని కఠినమైన చనుదోయిని విడువడు గదా అంటారు.

*ఇప్పుడు చిత్ర కవిత్వము*
*ఒప్పుగ వ్రాయం గలట్టి ఒక కవియైనన్*
*చెప్పుకొన లేదుగా మరి*
*విప్పెద నా గుట్టు మట్టు విబుధులు మెచ్చున్.*

ఈ చిత్ర కవిత్వం 12వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకూ ఏదో రూపంలో జీవిస్తూ వచ్చింది. మరీ 16వ శతాబ్దం నుంచీ 20వ శతాబ్దం ప్రథమ దశకం వరకూ విశృంఖలంగా విస్తరించి వెర్రితలలు వేసింది.

తెలుగులో చిత్ర కవిత్వం పుట్టు పూర్వోత్తరాలను కూలంకషంగా పరిశీలించి, పరిశోధించి సిద్ధాంత వ్యాసం (1986) వెలువరించిన వారు గాదె ధర్మేశ్వరరావు గారు. ఆయన ప్రకారం చిత్ర కవిత్వం మొదలు పెట్టినవాడు నన్నెచోడుడు. ఈయన ఏదో తమాషాగా వుంటుందని సందర్భౌచిత్యాన్ని పాటించి చిత్ర కవిత్వ రచన చేశాడు.

అంతేగాని కృత్రిమ ప్రక్రియల జోలికి పోలేదు. కొంతమంది ఈ రకం కవిత్వానికి ఆద్యుడు వేములవాడ భీమకవి అంటారు. 17వ శతాబ్దంలో కవులకు ఈ కవిత్వం మీద మోజు పెరిగింది. ఎక్కువ మంది కవులు తమ ప్రజ్ఞాపాటవాలు, ప్రతిభావ్యుత్పత్తులు ప్రదర్శించు కోవటానికే యీ రకం కవిత్వం వ్రాశారనిపిస్తుంది. శ్రీనాథుడు "వారణాసేయతావిగొనవా ? నవవారిజ మందుతేటి క్రొవ్వారుచు నుంట నీ వెరుగవా?' అనే పద్యానికి 4 అర్థాలు తెప్పిం చాడు. పింగళి సూరన్నగారు ఏకంగా రాఘవ పాండవీయం అనే ద్వ్యర్థి కావ్యం రచించారు. ఎలకూచి బాల సరస్వతి గారు రాఘవ యాదవ పాండవీయం వ్రాశారు. ఇది త్ర్యర్థి కావ్యం. మరిగంటి సింగరా చార్యులుగారు నలయాదవ రాఘవ పాండవీయం వ్రాశారు. గుంటూరు జిల్లా నరసరావుపేట వాసి రావిపాటి లక్ష్మీ నారాయణ గారు నిర్వచ నోత్తరభారత గర్భ రామాయణం వ్రాశారు. గాడేపల్లి కుక్కుటేశ్వరరావు గారు ఏసుకృష్ణీయం అనే ద్వ్యర్థి కావ్యం వ్రాశారు. ఇక చిత్ర కవిత్వా నికి ఉదాహరణలు చూద్దాం. ఇందులో ఎన్నో రకాలు.

*మొదటగా ప్రార్థన పద్యం.*

*మమ్మూర్తులలో ముఖ్యుడు*
*నిమ్మహి నెందేనిగల్గు నీశుడు హరినా*
*మమ్మున గలదని నమ్మి ము*
*ఖమ్మన చిత్రించుకొన్న కన్యను గొల్తున్*

ఈ పద్యం ఒకసారి చదవగానే అర్థం కాదు. ఈ కన్య బాలత్రిపుర సుందరీదేవి. ఆమె ముఖాన నామం పెట్టుకున్నది. బాలాజీ అయింది. అటువంటి వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తాను అని అర్థం. త్రిమూర్తు లలో ముఖ్యుడు ఈశ్వరుడు. ఆయన అంతటా వుంటాడు. అన్నిటా వుంటాడు. హరి నామములో కూడ వుంటాడు. అందువల్ల ఆ నామాన్ని ఆమె స్వీకరించింది. అదే వేంకటేశ్వరస్వామి విగ్రహం. ఇది స్థల పురాణం. అర్థం గూఢంగా వున్నది. గనుక దీన్ని మర్మ కవిత్వం అందాం. మరొకటి

*రెండక్షరముల యపదము*
*పండు ముసలి యగును వెనుక బాగుగ నొత్తన్*
*గుండియు పొంగుల బంగా*
*ర్కొందను తలపించు ముందు గూటము వెట్టన్*

ఇది పొడుపుకథ లాంటిది. రెండక్షరముల అపదమట. పదము కానిది అపదము. అర్థం లేని రెండు అక్షరాలు. వెనుకక్షరాన్ని వత్తితే అంటే వత్తి పలికితే ముసలమ్మట. మందక్షరానికి గూటం పెడితే (అంటే క్రింద గీత – మహాప్రాణం చేయటం) వయసులో వున్న వనితట. ఒక రకంగా చెప్పాలంటే వెనుక నొక్కి పలికితే వయసమ్మ కాదు ముందు నొక్కి పలికితే ముసలమ్మ కాదు. ఏమిటా పదం? బామ. మారిస్తే బామ్మ (ముసలమ్మ) భామ (వయసమ్మ) ఇది కూడ నిగూఢ కవిత్వం కిందికే వస్తుంది.

ఇక గొలుసు కవిత్వానికి వద్దాం.

*శతకపత్ర మిత్రు సుతుని తమ్ముని బావ*
*పెద్ద అగ్రజందు ప్రీతిదాల్చు*
*నట్టి ఆయుధంబు నవనిని మోచిన*
*యతడె యితడు సుమ్మి అంబుజాక్షి*

శతకపత్ర మితుడంటే సూర్యుడు అతని కుమారుడు కర్ణుడు. అతని తమ్ముడు అర్జునుడు – ఇతని బావ కృష్ణుడు– ఈయన అన్న బలరాముడు – అతను ఇష్టంగా ఉపయోగించే ఆయుధము నాగలి – దాన్ని మోసేది దున్నపోతు– అతడె యితడు. ఆయనే ఈయన. అంటే వీడు దున్నపోతని తాత్పర్యం. ఇది బావ – మరదళ్ల సరస సంభాషణలో భాగం. చాటు పద్యం. ఇటువంటి పద్యమే ఇంకొకటి.

*మనసిజు మామమామయభి*
*మానమడంచిన వాని మామనం*
*దనుని విరోధినందనుని*
*నందను సుందరి మేనమామజం*
*పినజగజెట్టి పట్టి బొలి*
*పెట్టిన శూరుని తండ్రి గన్నుగన్*
*గొనిన సురాధినాధుని తనూభవునాయువు*
*నీకు గల్గుతన్*

ఇదీ చాటువులలోదే. ఎవరు వ్రాసారో గాని వారికి నా జోహా రులు. అర్థం చూద్దాం.

మనసిజుడు=మన్మథుడు; మామ=అతని మామ చంద్రుడు; అతనికి మామదక్షుడు, అతని అభిమానమడంచినవాడు ఈశ్వరుడు, వాని మామ హిమవంతుడు, అతని నందనుడు మైనాకుడు, అతని విరోధి ఇంద్రుడు. అతని నందనుడు అర్జునుడు, అతని కుమారుడు అభిమన్యుడు. అతని భార్య ఉత్తర, ఆమె మేనమామ కీచకుడు, అతనిని జంపినవాడు భీముడు. అతని పట్టి ఘటోత్కచుడు. అతనిని జంపినవాడు కర్ణుడు. అతని తండ్రి సూర్యుడు, సూర్యుడు కన్నుగా గలవాడు విష్ణువు. అతని తనూభవుడు బ్రహ్మ. ఆ బ్రహ్మ ఆయువు నీకు కలుగాక అని ఆశీర్వచనం. పురాణ జ్ఞానం, ప్రణాళికా రచన, పద్యాన్ని నడిపించిన తీరు, ఆశీర్వదించటానికి పడ్డ శ్రమను గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. దీన్ని డొంక తిరుగుడు కవిత్వమూ అనవచ్చు.

ఇక బంధ కవిత్వానికి వద్దాం. ఇది మరీ క్లిష్టమయినది. ముందు గానే ఒక బొమ్మ వేసుకుంటారు. ఖడ్గమో,పామో, చక్రమో పద్మమో ఇట్లా వారికిష్టమైనది చిత్రించి అందులో పద్యాక్షరాల నమరుస్తారు. ఇది ఒక ఉదాహరణ చూస్తే గాని బాగా అర్థం కాదు. మా గురువుగారి పద్యమే ఉటంకిస్తాను. గౌరీ కళ్యాణం పుస్తకంలోనిది శివస్తుతి. దీని పేరు షోడశదళచక్ర బంధ ద్వయం ప్రమాణివృత్తంలో వ్రాయబడినది.



షోడకదళ చక్రబంధ ద్వయం. ప్రమాణి వృత్తం

హరా! సురాసురాదరా
పరాత్పరా గరాద్మరా
ధరాధరా కరావరా
అరాళరా జరాద్ధరా

స్థిరాజరా మరాక్షరా
పరాసురా సురాజిరా
స్థిరాధురా పరాపరా
పరాగిరా స్తరాకరా

అర్థం: శివా! దేవదానవుల నాదరించు వాడా, శ్రేష్టతముడా, హాలాహలమును మ్రింగినవాడా భూమిని మోయు శేషుడును, శ్రేష్టమయిన భూషణములు చేతియందు కలవాడా, నెలవంకను దాల్చినవాడా, శాశ్వతుడా, జరా మరణములు లేనివాడా, నాశ రహితుడా, త్రిపురాసురుల ప్రాణ పంక్తిని నాశనము చేసినవాడా, సత్యసంకల్పా, బంధముల నుండి విముక్తి ప్రసాదించువాడా, పరమేశ్వరా, వేదాంత విజ్ఞానఖనీ.

ఇట్లా ఎందుకు వ్రాయటం అంటే కవితన ప్రతిభను చూపించుకోటానికే. కొంత కాలం క్రితం (ముఖ్యంగా 18, 19 శతాబ్దాలలో) కవులు తమ రచనల్లో ఒకటి రెండు పద్యాలన్నా యిటువంటివి లేకపోతే తమను మంచి కవి క్రింద జమ కట్టరేమోనని భయ పడేవాళ్ళు. ఇక గర్భ కవిత్వానికి ఒక ఉదాహరణ చూద్దాం.

నరసరావుపేట కోర్టులో గుమాస్తాగా పనిచేసిన కీ.శే. రావిపాటి లక్ష్మీనారాయణ గారు నిర్వచన భారత గర్భ రామాయణము అనే పుస్తకం వ్రాశారు. ఆయన పెద్దగా చదువున్నవాడుగాదు. అయినా ఇటువంటి అద్భుత గ్రంథం వ్రాయటం ఆశ్చర్యకరం. ఈ గ్రంథమును చదివి అభిప్రాయములిచ్చిన వారిలో ప్రముకులు చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రి గారు, కట్టమంచి రామలింగారెడ్డి గారు, శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రి గారు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు, జనమంచి శేషాద్రి శర్మగారు, కూచి నరసింహం గారు, గిడుగు వేంకట రామమూర్తి పంతులు గారు వున్నారు. వడ్డాది సుబ్బారాయుడు గారు ఈ పుస్తకాన్ని చదివి పద్యంలోనే అభిప్రాయాన్నిచ్చారు.

*ప్రతిపద్యంబున వేరు వేర్విషయముల్*
*పట్టించి ప్రాసంబులున్*
*యతులున్ వ్యాకృతి నీమముల్*
*చెడకయుండం గావ్యమున్ జేయుటే*
*యతికష్టం బిటుపద్య మందితర*
*పద్యం బొందు జొప్పించి భా*
*రత రామాయణ గాథ లేక*
*కృతి గూర్పంజాలితేమందునిన్.*

కనుక ఈ పుస్తకం చదువుతూవుంటే ప్రతి పద్యంలో రామాయణ గాధ నడుస్తూ వుంటుంది. ఆ పద్యంలో ఇమిడి యింకో పద్యం వుంటుంది. దానికి భారతార్థం వుంటుంది. ఏక కాలంలో రెంటినీ చదువుతూ పోతామన్నమాట.

ఇక చివరిది **విస్తర కవిత్వం**

విస్తరించటానికి వీలైన కవిత్వాన్నే విస్తర కవిత్వం అంటారు. ఇతిహాసాలు, శతకాలు, కావ్యాలు, ప్రబంధాలు, నాటకాలు వగైరా లన్నీ విస్తర కవిత్వం క్రిందకే వస్తె ఇవి లేక పోతే మనం ఏం చదువుకునేవాళ్లం? మనం సాహిత్య జ్ఞానాన్ని ఎలా పెంపొందించుకునే వాళ్ళం? ఎలా ఆనందించేవాళ్ళం? అందుకే ఇది మన ఆస్తి, దీన్ని గురించి వివరంగా వ్రాస్తే అదొక ఉద్గ్రంథం అవుతుంది. అందుకని ఇంతటితో విరమిస్తా,

ఈ పుస్తకం కవిత్వ నిర్వచనంతో మొదలు పెట్టబడి, ఆశుకవిత్వము, సరసకవిత్వము గురించి టూకీగా చెప్పి, చిత్ర కవిత్వం అంటే ఏమిటో విశదంగా, విస్తృతంగా ఎరుక పరచి, విస్తర కవిత్వ నిర్వచనంతో ముగించటం జరిగింది.

ఈ పుస్తకాన్ని కవిత్వమనే ఉద్యాన వనంగా భావిస్తే, అందులోని పద్యాలు చెట్లు, జంతువులు, పక్షులుగా చిత్రించుకోవచ్చు, కందాలు, చంపకాలు, ఉత్పలాలు చెట్లుగాను, మత్తేభము, శార్దూ లాలు జంతువులుగాను, ఆటవెలది (ఆటవెలగలది=నెమలి) తేటగీతి (కమ్మని పాటనందించునది=కోయిల) మొదలైన వాటిని పక్షులుగాను ఊహించుకోవచ్చు. అప్పుడు మీరు మధుర రసాలను (మాకందం) ఆస్వాదించారు, విన్యాసాలను తిలకించారు. సౌరభాలను గ్రోలారు. ఆనందాన్ని అనుభవించారు. స్వర్గంలో విహరించారు.

ఈవిధంగా కవిత్వం పలు రీతుల్లో విస్తరించి ఉంటుంది. ❋

---



కీ. శే.
అంగర
సూర్యారావు

సుదీర్ఘమైన విశాఖ నాటకరంగ చరిత్రకు, విశాఖపట్టణ, నగర పరిణామ క్రమానికి నిలువెత్తు సాక్షిసంతకం కథ, నాటక రచయిత, నటులు, దర్శకులు అంగర సూర్యారావు ఈ నెల 13వ తేదీన అస్తమించారు.

1928లో తూర్పుగోదావరి జిల్లాలో జన్మించిన అంగర బాల్యంలోనే విశాఖపట్నం వలస వచ్చేశారు. ఉద్యోగరీత్యా విశాఖలోనే స్థిరపడిపోయారు.

మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవిగారు), తెన్నేటి వాశ్వనాధం, శ్రీశ్రీ వంటి సాహితీ లబ్ధప్రతిష్ఠులు స్థాపించిన కవితా సమితిలో సభ్యునిగా సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. యవ్వన దశలోనే కథా, కవితా ప్రక్రియల్లో రచనలు ప్రారంభించారు. అవి ఆనాటి ప్రముఖ వార, మాస పత్రికల్లో ప్రచురితమైనాయి. తర్వాత నాటక రచన ప్రారంభించారు. అనేక సాంఘిక, చారిత్రక నాటిక, నాటకాలు రచించారు. స్వతహాగా మంచి నటులు, దర్శకుడు. 'రంగశాల నాటక విద్యాలయం' పేరిట ఓ నట శిక్షణాలయం ప్రారంభించారు. ఆ సంస్థ ద్వారా వెలుగులోకి వచ్చిన వారిలో డా॥ అత్తిలి కృష్ణారావు, లంక సత్యానంద్, సుత్తివేలు వంటి ప్రసిద్ధులెందరో ఉన్నారు. కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు, రావిశాస్త్రి, ఆరుద్ర వంటి వారితో విశాఖరచయితల సంఘం స్థాపించారు.

అంగర సూర్యారావు అనేక కథలు, కవితలు, నాటకాలతోపాటు 'విశాఖ నగర చరిత్ర' 1,2 పేరిట విశాఖ అభివృద్ధిని అక్షరబద్ధం చేశారు. విశాఖ నగర సాంస్కృతిక రంగ చరిత్రలో, ప్రత్యేకించి విశాఖ నాటకరంగ ప్రస్థానంలో అంగర సూర్యారావు పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

**-బి.వి.అప్పారావు,** 93470 39294

-ఆచార్య వెలుదండ నిత్యానందరావు,
9441666881

# ప్రత్యామ్నాయ పదకల్పనం: సాధక బాధకాలు

దేశ కాలమాన పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. మారిపోవడానికి ఉద్యమాలు, యుద్ధాలు, అభిరుచులు, అవసరాలు, చదువులు, ఉపాధిఅవకాశాలు, పాలనలో మార్పులు, కొత్త కొత్త వైజ్ఞానికావిష్కరణలు, మత సాంస్కృతిక స్థితులు మొదలైనవి ఎన్నెన్నో కారణాలవుతుంటాయి. ఈ మార్పు అనేది సజీవత్వానికి, చైతన్యానికి ప్రతీకనే తప్ప అన్యం కాదు. కాకుంటే అది ప్రతికూల చైతన్యం కావచ్చు. అనుకూల చైతన్యం కావచ్చు. మిశ్రమ చైతన్యం కావచ్చు. పాత రక్తకణాలు పోయి కొత్త రక్తకణాలు శరీరంలో చోటు చేసుకొన్నట్లే పాతపదాలు, పాత వాక్య విన్యాసాలు, రచనా రీతులు పోయి కొత్త పదాలు, కొత్త వాక్య విన్యాసాలు, కొత్త రచనారీతులు భాషలో చోటు చేసుకుంటాయి. పాతవ్యవస్థ, పాత వస్తుజాలం వినియోగంలో నుండి పోయి నప్పుడు వాటిని సూచించే పదజాలం సైతం మరుగున పడక తప్పదు. నావుడు, అనవుడు, మోడు, కపిలసిడి, జాంబు లాంటివన్నీ ఇలా అంతర్ధానమైనవే. తిక్కన వీటినే "పాతపడ్డ మాటలు" అన్నాడు. కొత్తగా ప్రజల వినియోగంలోకి వచ్చిన వస్తుజాలానికి కొత్త పేర్లతో పాటు పాతవ్యవస్థలోని పదాలను కూడా వాడుకొని ప్రయోజనం పొందడం భాషలో ఎప్పుడూ ఉండేదే. ఏ సమాజంలో ఒక వస్తువు పుడుతుందో అక్కడే దాని నామ రూప గుణ విశేషాదులు కూడ అవిభాజ్యంగా పుడతాయి. ఏ భాషయినా అన్ని రకాల భావ జాలాలను, వస్తువులను వ్యక్తీకరించగలిగిన సామర్థ్యం కలిగినదే. ఏ భాషా సుందరమైందీ కాదు. వికారమైందీ కాదు. కాని అన్యసమా జాల్లోని వస్తుజాలాన్ని, భావజాలాన్ని ఈ సమాజంపై రుద్దినపుడు స్థానికభాష దాన్ని వ్యక్తీకరించేందుకు అసమర్థమవుతుంది. అప్పుడు ఆ మూలపదాన్నే యథాతథంగా వాడుకోవచ్చు. మూలపదాన్ని ఈ భాషలో ఉచ్చారణ పద్ధతులకు అనుగుణంగా కొద్దిపాటి మార్పులు చేసుకొని వాడుకోవచ్చు. మూలపదం బాగా నలిగేంతదాక ఉచ్చా రణలో అటూ ఇటూ ఉండి నలిగాక స్థిరపడవచ్చు. వెనుకటి పుస్తకాల్లో రుష్యాదేశం అని కనిపించేది. అది తరువాత రష్యాదేశం గా మారింది. అది కూడ ఇప్పుడు పోయింది. ఇంగ్లీషు వార్తల్లో కడపను కుడప్ప (Cuddapah) అని స్పెల్లింగ్ ప్రకారం చదవడం గమనించవచ్చు. పోర్చుగీసు వారిని బుడతకీచులు అనీ, ఈస్టిండియా కంపెనీని కుంఫిణీ అని పిలిచారు. సైనికులన్న అర్థం ఉన్న సోల్జర్లు అన్న శబ్దాన్ని ఆనంద రంగ రాట్ఛందంలోను (1757), దిట్టకవి నారాయణ కవి రంగరాయ చరిత్రలోను సోల్దార్లు అని ప్రయోగించడం గమనించ వచ్చు.

*సమరోజ్జృంభిత శౌర్యధుర్యులగు సార్జంతుల్, మయూరుల్, కుమం దములున్, వీరులు, సోలుదారులు, సుబేదారుల్ మొదల్గల్గు, సై న్యము లాత్మీయులు గొల్వ నుద్ధతుల ముల్కాఖ్యామహాఖ్యాతి ఉ త్సవసముదగ్ర ప్రతిభా విభాసి యగు మూసాబసీ యుల్లాసియై*

అన్న రంగరాయచరిత్ర (1-147) పద్యాన్ని పరిశీలిస్తే ఎన్నో విశేషాలు తెలుస్తాయి. ఈ రోజు ఆంగ్లభాషాప్రభావంతో ఉచ్చారణ స్థిరమైన పదాలను ఆనాడు రంగరాయకవి ఫ్రెంచి భాషా ఉచ్చారణ కనుగుణంగా రచించాడు. ఇంగ్లాడ్ వారి కన్నా ఫ్రెంచివారు ముందు వచ్చారు కనుక. కవి వారి ఉచ్చారణను విన్నాడు. కొత్తపల్లి వీరభద్ర రావు (1986) తెలుగు భాషపై ఆంగ్ల ప్రభావం-పుట 44)

Sergeant సార్జంటు - సార్జంతు

Major మేజర్ - మయూరు

Commandant కమాండెంట్ - కుముందాన్

సోల్జర్ - సోల్దట్

మిస్టర్ బుస్సీ అనేది ముసాబుసేగా మారింది. ఈ మూసా అనేది Monsieur అనే ఫ్రెంచి రూపానికి రూపాంతరం

తెలుగులో బూచి, బూచాడు పదాలకు మూలం బుస్సీయేనని చెప్తారు.

ఈ వస్తు ధర్మాన్ని సూచనా మాత్రంగానైనా వ్యక్తీకరించ గలిగే స్థానిక భాషాపదంతో పిలవవచ్చు.

రేడియో - ఆకాశవాణి

మూల భాష స్వీకృత భాషా కలగలిసి కొత్త పదం సృష్టించబడి ప్రజల్లో విడదీయలేనంతగా కలిసిపోవచ్చు. వీలునామా అనే పదం ఆంగ్ల ఉర్దు పదాల కలయికతో వచ్చింది. వారసత్వం ఫార్సి సంస్కృతా లతో ఏర్పడింది. అన్య భాషా ప్రత్యయాదులను, ఇంచుగాగమాదులను కలుపుకొని ఏర్పడేవి. వినియోగదారుడు - కొనుగోలుదారుడులోని దారు ఉర్దూ ప్రత్యయం. బానిసత్వం - ఉర్దుపై వచ్చిన సంస్కృత ప్రత్యయం. పనిమంతుడు - తెలుగుపై వచ్చిన సంస్కృత ప్రత్యయం.

ఇక యథాతథంగా అనువదించి వినియోగించుకోవచ్చు. బ్లాక్ మార్కెట్ నల్లబజారు లాంటివి.

ఈ ఆంగ్లపదానికి ఈ తెలుగు పదం సమానార్థకమని స్థిరపడేంత వరకు రకరకాల పదాలతో, రూప భేదాలతో వ్యవహృతం కావచ్చు. Divorceకు విడాకులు అనేది నేడు స్థిరపడింది. కాళ్ళకూరి నారా యణరావు వరవిక్రయం నాటకంలో విడియాకులు అన్న ప్రయోగం కనిపిస్తుంది. బ్రౌన్ నిఘంటువులో వివాహమోక్షం అన్న అర్థం కనిపి స్తుంది. (?) నన్నెచోడుని కుమారసంభవములో పెడయా కులు అని ప్రయోగించాడు. ఇలాగే మరెన్నో తీరులుగా ఉండవచ్చు.

ప్రజలకు ఆ పదం నచ్చితే దాన్ని స్వీకరిస్తారు. లేకుంటే ఎంత గొప్పవాడు చేసిన అనువాదమైనా ఆ రచయిత అభిరుచికి నిదర్శనంగా నిలుస్తుందే తప్ప మూల పదాన్ని తొలగదోసి నిల్చే శక్తి శాలిని గాదు.

తిక్కన కవి, మంత్రి, మహాభారతానువాదంలో ఎన్నో సంస్కృత పదాలకు తెలుగు అనువాదాలు చేశాడు.

తమ్మిమొగ్గరం = పద్మవ్యూహం

ఎరుగమి చీకటి =అజ్ఞానాంధకారం

పొలికలను = యుద్ధభూమి

కాని తెలుగు అనువాదాలు గాలికి పోయాయి. సంస్కృత పదాలే నిలిచిపోయాయి. తిక్కన ఒక మంత్రిగా రాచరిక వ్యవస్థలో ముఖ్య

స్థాన మాక్రమించిన వ్యక్తి, భారతంలో అతి విస్తృత భాగాన్ని అనువ దించిన వ్యక్తి. తెలుగుభాషలో సాహిత్యసృజనం, కావ్యరచనం స్థిరమైన కాలంలో పుట్టిన వ్యక్తి అయినా తిక్కన ప్రయోగాలు నిలువలేదు. తిక్కనకున్నన్ని అవకాశాలు లేకపోయినా నన్నయ ప్రయోగాలు నిలి చాయి. ఇక అచ్చ తెనుగు కావ్యాలు ప్రయోగానికి పనికి వచ్చాయే తప్ప ప్రయోజనానికి పనికి రాలేదు.

కనువినుకలి నెలవు పుట్టువు= వాల్మీకి(యయాతి చరిత్ర3-40)
బంతి తేరుల రేడు= దశరథుడు ( అచ్చ తెలుగు రామాయణం)
జముపట్టు = యముని నివాసమైన నరకం (అచ్చ తెలుగు రామాయణం)

సంస్కృతసమాస నిర్మాణంలో ధైర్య్యానికి అవకాశం ఉంది. దాని వల్ల క్లుప్త నిర్మాణం, సౌందర్యాపాదనం, అర్థస్పష్టత వస్తుంది. తెలుగు సమాస నిర్మాణానికి దీర్ఘత పనికి రాకపోవడం వల్లనే పైన పేర్కొన్న సమాసాలు కృతకంగా తయారయి ప్రజల్లోకి వెళ్ళలేదు.

ఇటీవల నడుస్తున్నచరిత్ర పత్రికలో తెలుగు పదాలను సృష్టించా లని ఆ మిత్రులు యత్నిస్తున్నారు. ముఖ్యంగా స.వెం. రమేశ్. వారి చిత్తశుద్ధిని అభినందిస్తూనే, వారి అత్యుత్సాహాన్ని కూడ గమనించక తప్పదు.

| | |
|---|---|
| కట్టురం - వ్యాసం | పొలవరులు - పండితులు |
| పెనగువ - వాదన | ఒడమి - ఆర్థిక |
| మెలన - చరిత్ర | పలు చదువిలు - విశ్వవిద్యాలయం |
| విసాగు సొత్తో - సాంస్కృతిక బంధం | అనికిడి - భావం |
| పుడోలు - ప్రపంచం | ఎసిదరు - శాస్త్రవేత్త |
| అరయిక - పరిశోధన | అనిడి - స్వతంత్రం |
| ప్రోలిమి - నాగరికత | కవరము - వ్యాపారం |
| ఎడాటము - విషయం | |

(తెలుగు నుడి కలిమి (వ్యాసం) స.వెం.రమేశ్ నడుస్తున్న చరిత్ర నవంబర్ 2012)

డ్రైవరును తోలరిగా, క్లీనరును తోమరిగా నడుస్తున్న చరిత్రలో ఎవరో అనువదించారు. చాల బాగుంది. కాని ప్రజలు వాడేదెలా?

పూర్తిగా జనజీవితంలో కలిసిపోయి, అందరూ అలవోకగా వాడుతున్న వాటి స్థానంలో వాటిని తీసేసి కొత్త పదాలను స్థిరపర చాలని ఉబలాటపడడం వృథా ప్రయాస. సంస్కృత పదాలకే కాదు ఇంగ్లీషు పదాలకు కూడా ఇదే వర్తిస్తుంది. మన జాతికున్న స్వభావం లోనే సంస్కృతాదరణం ఉంది. ఆపైన అన్యభాషాపదాలను అక్కున చేర్చుకునే తత్త్వముంది. ఇది విజ్ఞతతో కూడిందే. ప్రయోజనాత్మక మైందే. అది గుర్తించకుండా నన్నయ భారతం రాసి తెలుగు భాషను చెడగొట్టాడు. అని మరొకడు భాషకు అడ్డుకట్ట వేశాడు- అని కొందరు మేధావులు వాదిస్తు తమ ఇగోను సంతృప్తి పరుచు కుంటున్నారు.

అసలు ప్రత్యామ్నాయ పదకల్పన, సమానార్థక పద కల్పన ఎందుకు? మూల భాషా పదాన్నే తీసుకుంటే సరిపోదా? అన్న ప్రశ్న ఉదయించడం కూడ సహజం. మనం వస్తురూప గుణాలతో ప్రయో జనాలను పొందుతున్నాం అలా పొందడానికి మనకు అభ్యం తరం లేదు. కంప్యూటర్ ఏ సమాజంలో పుట్టినా దాన్ని ఉపయోగించు కొని ప్రయోజనం పొందడానికి మనకెలాంటి అభ్యంతరంలేదు. కాని దాని పేరు యథాతథంగా వాడుకోవడానికి మాత్రం ఇష్టం లేదు. ఇది మన అస్తిత్వ ప్రకటనం కోసం పడుతున్న ఆరాటం మాత్రమే. ఇది అసహజమేమి కాకపోయినా సహజం కూడా కాదేమో. పెన్ను, పెన్సిల్, లారి, బస్సు, కారు, కాలేజి, ఫోను, సెల్ ఫోను లాంటి పదాలను ప్రజలు సాదరంగా స్వీకరించారు. ప్రయోజనం పొందు తున్నారు. పండితులు మాత్రం వాటికి సమానార్థకాలు తయారు చేయాలని తలలు బద్దలు కొట్టుకుంటున్నారు.

ఒక ఆంగ్లపదానికి సమానార్థకంగా తెలుగుపదం స్థిరపడి అందరూ వాడుతున్నప్పుడు సైతం సమాజం ఆలోచనారీతుల్లో కలిగిన మార్పుల కారణంగా మరో ఆంగ్లపదం సృష్టింప బడుతుంది. దానికి మళ్ళీ సమానార్థక తెలుగు పదాన్ని సృష్టించాలి. అట్లాగే అందరూ వాడుతున్న తెలుగు పదాలకు కాలక్రమంలో న్యూనత్వం ఆపాదింప బడి సభ్యోక్తులు(Euphemism) గా ప్రత్యామ్నాయ తెలుగు పదాలు కూడా తయారవుతాయి.

Physically handicappedకు శారీరక వికలాంగులు Mentally retorted కు మానసిక వికలాంగులనే సమానార్థకాలు స్థిరపడ్డాయి. కాని ఇప్పుడు సమాజపు ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. దానితో Physically handicapped పదం పోయింది. దానికి బదులు Physically Challenged (People with Special need) పదం వచ్చింది. దీనికోసం మరొక కొత్తతెలుగు పదం సృష్టించాలి. ఇంతవరకే వచ్చిందో ఏమో కూడ. ఈమధ్య దివ్యాంగులని వాడుతున్నారు. ఇక్కడ వస్తువు మారలేదు. వస్తు స్థితిగతిలో మార్పులేదు. మారింది మన ఆలోచన విధానం. తత్ఫ లితంగా మరో కొత్త పదం పుట్టవలసిన స్థితి. అట్లాగే కులవాచకాలను సంస్కృతీకరించడం, భార్యాభర్తలను జీవనసహచరీసహచరులని వాడ డంలో నున్న ఆంతర్యం వస్తుస్థితిలో మార్పు కాకుండా మన ఆలో చనల్లో మార్పు రావడమే.

ప్రత్యామ్నాయ పదకల్పన దేనికి అవసరం ? యథాతథ స్వీకారం దేనికి అవసరం అన్న విషయంలో నాకో ఆలోచన వస్తుంది.

ప్రాచీన యుగ శాసనాలు ఎక్కువగా ప్రాకృత సంస్కృతాల్లో వచ్చాయి . కాని వ్యక్తుల పేర్లు గ్రామాల పేర్లు మాత్రం యథాతథంగా దేనికవే తీసుకున్నారు. ఇది వాస్తవిక కోణం.

అచ్చ తెలుగుకావ్యం యయాతి చరిత్ర రాసిన పొన్నగంటి తెలగన వ్యక్తి స్థల నామాలను, బిరుదులను కృత్రిమమైన పద బంధాలతో తెనిగిస్తే అందం చెడుతుందని యథాతథంగా వాడారు.

*తెనుగునకు మాఱు పేళ్ళిడి*
*పెనచిన వినగూడదనుచు బిరుదులు పేళ్ళున్*
*మును వేల్పుబాస వెంబడి*
*నునిచెద కాదనకుదయ్య యుల్లములందున్*

ఇది వాస్తవిక దృక్పథం. తెలుగుభాషలోకి ఇమడగలిగేవి, సులు వుగా పలకగలిగేవి, మూడు నాలుగు అక్షరాలను మించనివి అయిన ఆంగ్లవస్తు వాచకాలు, నామవాచక శబ్దాలనే మనం కూడ నిరాక్షేపంగా స్వీకరించవచ్చు. అయితే వీటికి వేసే విశేషణాలు తెలు గువి ఉండాలి. క్రియలు, కాల వచన లింగ ప్రత్యయాలు తెలుగులో ఉండాలి. వాక్య నిర్మాణమంతా తెలుగులో ఉండాలి. ప్రజల్లో ఆ వస్తువు బాగా వాడుక లోకి వచ్చినప్పుడు ప్రజలు మూల పదాన్నే వాడుతున్నారా? ఏదైనా కొత్త పదాన్ని కల్పించి గానీ, పాత పదానికే ఈ కొత్త అర్థాన్ని ఆపాదించి గానీ, పాక్షికంగా మార్పులు చేసి వాడు తున్నారా? అనేది గమనించి

ఖాయం చేయవచ్చు.

అన్నీ సామాన్య జన వ్యవహారంలో ఉంటాయనుకోవడం అత్యాశ. ఇంగ్లీషులో సైతం ఓ 1500 పదాలు నోటికి వస్తే జీవిత వ్యవహారాలు అన్నీ సజావుగా సాగిపోతాయి. కాని సామాన్య జన వ్యవహారంలో కాకుండా పండిత లోకంలో, శాస్త్రలోకంలో. ప్రత్యేక భావనా ప్రపంచంలో ఉండే పదాలకు సమానార్థకాలు సృష్టించడం, అన్ని సందర్భాల్లో అదే ఆంగ్లపదానికి, అదే తెలుగుపదాన్ని వాడడం పండితులు, రచయితలు, విజ్ఞులు చేస్తారు. అథశ్చేతన, అజహల్లక్షణ, ద్రవ్యోల్బణం, కిరణజన్య సంయోగక్రియ, సమాధి, పరకాయప్రవేశం లాంటివి సామాన్య జనవ్యవహారంలో ఉండవు. కాని ఆయాశాస్త్రాల్లో వాటి ప్రాధాన్యాన్ని కాదనలేం.

ఒక పుస్తకాన్ని అనువదించేటప్పుడు ఆ ప్రత్యేక పదానికి ఇది తెలుగు మాట అని ఆ పుస్తకం అంతా వాడి, చివర Glossary లో చెప్పుకోవచ్చు. హనీమూన్‌కు మధుచంద్ర అనీ, ఎయిర్ హోస్టెస్‌కు గగనసఖి అని కన్నడిగులు అనువదించుకున్నట్లు అనువదిస్తే అవి ప్రజల్లోకి పోయినా, పోకపోయినా ఆ పుస్తకం వరకు ప్రయోజనాన్ని సాధిస్తాయి.

ప్రాచీన సాహిత్యంలో ఈ భావాన్ని వ్యక్తీకరించే పదాలు లేదా వ్యుత్పత్త్యర్థం ద్వారా ఈ భావం సిద్ధించే పదాలు ఉండవచ్చు. వాటిని మనం గుర్తించి ప్రయోగించవచ్చు. అటువంటప్పుడు ప్రస్తుతం సమానార్థకంగా వాడబడుతున్న పదాన్ని తీసివేయాలని భావించకుండా అలాగే వాడుకోవాలి. ప్రాచీన ప్రయోగంలో ఒక అర్థంలో వుండి ఇప్పుడు మరొక అర్థంలో ఉంటే మాత్రం అర్థ విపరిణామాన్ని గుర్తించి ఎట్టి పరిస్థితుల్లో మూలార్థంలో ఆ పదాన్ని ప్రయోగించకూడదు.

కౌటిల్యుడు అర్థశాస్త్రంలో వాడిన కొన్ని పదాలను ఇందుకు లక్ష్యప్రాయంగా పేర్కొంటాను.

"నగరాధిపతి" ని నాగరికుడు అని కౌటిల్యుడు వ్యవహరించాడు. ఈ రోజు "సివిలైజ్డ్ పర్సన్" అన్న అర్థంలో నాగరికుడు వాడ బడుతుంది.

అత్యధికంగా స్తుతించడాన్ని కాని, నిందించడాన్ని కాని "అతి వాదం" అన్నాడు. కాని నేడు "తీవ్రవాదం" అన్న అర్థంలో అతి వాదం పదం వాడబడుతుంది.

ఆచూకీ లేకుండా రహస్యంగా చంపడాన్ని "ఎన్ కౌంటర్" చేయడంగా వ్యవహరిస్తున్నాం. దీనికి సరియైన తెలుగుపదం ఇంకా ఏర్పడలేదు. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో "ఉపాంశుదండనం" అని వ్యవహరించాడు. దాన్ని వాడుకోవచ్చు. పత్రికల వారు ప్రచారం చేయవచ్చు. కానీ ఉపాంశుదండనం కన్నా ఎన్‌కౌంటర్ ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందింది.

"ప్రేతాభినివేశం" అని కౌటిల్యుడు వాడిన పదానికి ఈనాడు "మరణ వాఙ్మూలం" అనే పదం స్థిరమైంది. కనుక మన పాండిత్య ప్రకటన కోసం ప్రేతాభినివేశం వాడకూడదు.

"ప్రత్యక్ష సాక్షులు" అనే పదం జనంలో స్థిరమయ్యాక కౌటిల్యుని తృప్తిపరచడానికి "ఉపశ్రోతలు" అనకూడదు.

Used, Inflated అనే అర్థంలో కౌటిల్యుడు వాడిన ప్రణీత శబ్దానికి రచింపబడింది (నన్నయ ప్రణీతం) అన్న అర్థం నేడు స్థిరమైంది. వాయుమార్గం, జలమార్గం, రోడ్డు (భూ)మార్గం అని ఇప్పుడు అందరం వాడుతున్నాం గాలి దారి, నీటి దారి, నేలదారి అని ప్రయోగాలు చేయకూడదు. కౌటిల్యుడు అంసపథ (A LAND ROUTE) అన్నాడు. ఇప్పుడది అనవసరం. టోల్ టాక్స్ కు దారి సుంకం అన్ని పత్రికలవారు ప్రయోగిస్తున్నారు. ప్రచారం చేయవచ్చు.

కౌటిల్యుడు అధికారిని అయుక్త, అనీ, కిందిస్థాయి అధికారిని ఉపయుక్త అని వాడాడు. బహుశ ఇప్పటి లోకాయుక్తకు ఉపలోకాయుక్తకు ఇదే మూలమేమో!

స్మగ్లింగ్ - అతి సారణం

పెనాల్టీ - అత్యయం

Contracting a debt by mortgaging some property ఏదైనా ఆస్తి తాకట్టు పెట్టి రుణానికి ఒప్పందం చేసుకోవడాన్ని "అధికర్ణ గ్రహణం" అన్నారు. ఉత్సవ సమయాల్లో తీసుకునే బహుమతులకు "ఉత్సంగం" అని వాడాడు. సంచారం నిషేధించిన రాత్రి సమయాల్లో సంచరించినందుకు వేసే జరిమానాను "అక్షణం" అన్నాడు. సంచార విషయంలో నిషేధంలోని రాత్రిని "చారరాత్రి" అన్నాడు. ప్రవేశం నిషిద్ధమైన ప్రాంతాలకు "అకృత ప్రవేశాలనీ", అనుమతి లేకుండా ప్రవేశించడానికి "అభిగమనం" అని కౌటిల్యుడు వాడాడు. ఇలా పరిశీలిస్తుపోతుంటే ఎన్నో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తాయి.

వెనుకటికి లేని సౌకర్యాలు ఇప్పుడెన్నో వచ్చాయి. ప్రత్యామ్నాయ పదాలు మీడియా ద్వారా, సృజనాత్మక రచనల ద్వారా ప్రచారం చేయవచ్చు. కొంత కాలం తర్వాత ఆ ప్రత్యామ్నాయ పదాలు పండిత లోకంలోనే నిలిచిపోయాయా? అధిక జనోపయోగ కారకాలయ్యాయా? అనేది గుర్తించాలి. కంప్యూటర్‌కు సంగణక యంత్రం అన్న ప్రత్యామ్నాయ తెలుగుపదం జనంలోకి రాలేదు. కాని ఇంటర్‌నెట్‌కు అంతర్జాలం అన్న పదం జనంలోకి సులువుగా చొచ్చుకెళ్ళింది. సంగణకయంత్రం ఉచ్చరించడంలో కన్నా అంతర్జాలం పదోచ్చారణలో సౌలభ్యం, ఇంపు ఉన్నాయి. మొదటితరం కంప్యూటర్ లు లెక్కల కోసం వచ్చినవి. ఆ అర్థంలోనే కంప్యూటర్, కంప్యూటేషన్‌లు ఉన్నాయి. కాని తర్వాత కంప్యూటర్ రంగంలో వచ్చిన తీవ్ర అభివృద్ధి పరిణామానికి సైతం కంప్యూటర్ అనే పదాన్ని వాడుతున్నారు. అంటే కంప్యూటర్‌కు అర్థవ్యాకోచం సిద్ధించిందన్నమాట. సంగణకంలో సైతం లెక్కలు అనేదే స్ఫురిస్తుంది. అందు వల్ల ఆ పదం కన్నా కంప్యూటర్ అనే పదం స్థిరమైంది.

భాషాభివృద్ధికి, పదాల జీవనానికి ఏకైక మార్గం వినియోగించడమే. తెలివి తేటలు, శక్తి సామర్థ్యాలు, డబ్బు వృథా అయినట్లే వినియోగించని పదజాలం, భాష - అంతర్థానం కాకతప్పదు. పండిత లోకం నిరంతరం నూతన పదకల్పన వైపు దృష్టిపెట్ట యత్నిస్తుండాలి. అది వారి పాండిత్య ధర్మం, ఉద్యోగధర్మం, సామాన్య జనం ప్రయోజనాపేక్షితులు. వారు తమకు నచ్చినవే స్వీకరిస్తారు. వారికి వ్యుత్పత్త్యర్థాలు, శాస్త్ర బద్ధత, వ్యాకరణబద్ధత అక్కరలేదు.

మన నిర్బంధాలు పనికి రావు. పదుగురాడు మాట పాడియై ధరజెల్లు, భాషకు సంఘమే శరణ్యం. దానిననుసరించే పండితలోక గమనం.

**(హైదరాబాదు కేంద్రీయవిశ్వవిద్యాలయం తెలుగుశాఖ 22-9-2016 న నిర్వహించిన "భాషాభివృద్ధి వ్యూహాలు" సదస్సులో చేసిన ప్రసంగం)**

రచయిత
అధ్యక్షులు, తెలుగుశాఖ ఉస్మానియావిశ్వవిద్యాలయం
హైదరాబాదు, తెలంగాణ.

# కళ్యాణ చాళుక్యులు

–డా॥ఈమని శివనాగిరెడ్డి
సెల్ : 98485 98446

**బాదామీ** చాళుక్య రాజ్య పతనానికి కారకులైన రాష్ట్రకూటుల మీద పగతో, బాదామీ చాళుక్య వంశానికి చెందిన నాలుగో విక్రమాదిత్యుని కొడుకు రెండో తైలపుడు, స్వతంత్రుడై, చాళుక్య పాలనను పునరుద్ధరించాడు. క్రీ.శ. 972లో కర్ణాటకలోని కళ్యాణ నగరంలో కళ్యాణ (తరువాతి) చాళుక్యుల రాజ్యాన్ని స్థాపించి క్రీ.శ. 997 వరకూ పాలించాడు. తరువాత ఇతని కొడుకు **ఇరివబెడుంగ సత్యాశ్రయుడు** క్రీ.శ. 998 నుంచి క్రీ.శ. 1008 వరకూ పాలించారు. సత్యాశ్రయుని తరువాత, అతని మేనల్లుడైన ఐదో విక్రమాదిత్యుడు క్రీ.శ. 1009 నుంచి క్రీ.శ. 1013 వరకూ, తరువాత రెండో అయ్యణ క్రీ.శ. 1014లో రాజై, ఒకే ఒక్క సం॥ పాలించాడు. ఇతని తరువాత రాజైన జయసింహుడు, క్రీ.శ. 1015 లో పట్టాభిషిక్తుడై, క్రీ.శ. 1067 వరకూ పాలించాడు. తరువాత రెండో సోమేశ్వరుడు క్రీ.శ. 1068 నుంచి క్రీ.శ. 1076 వరకూ, తరువాత, ఆరో విక్రమాదిత్యుడు క్రీ.శ. 1077లో రాజై క్రీ.శ. 1127 దాకా ఏలాడు, వారసత్వ రాజకీయాల్లో భాగంగా, అతని పెద్ద కొడుకు మూడో సోమేశ్వరుడు క్రీ.శ. 1127 నుంచి క్రీ.శ. 1138 వరకూ, రెండో జగదేకమల్లుడు క్రీ.శ. 1139 నుండి క్రీ.శ. 1148 వరకూ, మూడో తైలపుడు క్రీ.శ 1149 నుంచి క్రీ.శ. 1162 వరకూ, చివరి రాజైన నాలుగో సోమేశ్వరుడు క్రీ.శ. 1163 నుంచి క్రీ.శ. 1189 వరకూ పాలించారు. తొలుత కర్ణాటక నుంచి పాలించినా, తరువాత, మొత్తం తెలంగాణాతో పాటు కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లోనూ, కొంతకాలం తీరాంధ్రలోనూ తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. కళ్యాణ చాళుక్యరాజులు, తమ శౌర్య పరాక్రమాలకు, గుణగణాలకు గుర్తింపుగా అనేక బిరుదులు ధరించారు.

కళ్యాణచాళుక్య ప్రశస్తి శాసనాల్లో, **సమస్త భువనాశ్రయ శ్రీపృధ్వీ వల్లభ మహారాజాధిరాజపరమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయకుల తిలక చాళుక్యాభరణ శ్రీమతో...** అని ప్రారంభిచబడుతుంది. ఇంకా **మల్ల, అహవమల్ల, జగదేకమల్ల, త్రిభువనైకమల్ల, త్రైలోక్యమల్ల, సత్యాశ్రయ** లాంటి బిరుదులు ధరించారు.

మొదటి రాజైన రెండో తైలపుడు, **అకలంక కులతిలక, అకలంక రామ, అహవమల్ల** (యుద్ధ రంగంలో మల్లుడు) **కాంచీపుర సంహార కారణ, కుంతళాధిపతి, కొంకణ భయంకర, ఘూర్జర భయజ్వర, చాళుక్యరామ చాళుక్య వంశోద్భవ, చాళుక్యాభరణ, ధారానగరగరుడ, నిజభుజ చక్రవర్తి, నూర్మడితేజ, నూర్మడితైల, పంచల మర్దన పంచానన, పరమ భట్టారక, పరమేశ్వర, పృధ్వీవల్లభ,** ప్రతాపచక్రవర్తి, మహారాజాధిరాజ, మహాసాతుంతారిపతి, ముళగుంద విద్యాధర, రట్టఘరట్ట, రణరంగభీమ, రణరంగవిభీషణ, **రాష్ట్రకూటకాలకూట, శాలపట్టణ ధూమకేతన, శ్రీపృధ్వీవల్లభ, సత్యాశ్రయ కులతిలక, సమస్త భువనాశ్రయ, స్వస్తి సమధిగత పంచమహా శబ్ధ, సామంత మృగ శార్దూల అహవమల్ల, ఇరివబెడంగ, కుమారంకరామ** అనే బిరుదులున్నాయి. సత్యాశ్రయుడు, అకులంకచరిత, అకాలవర్ధ, అమ్మన గంధ వారడు, **చాళుక్యకంఠీరవ, చాళుక్య కందర్ప, చాళుక్య నారాయణ, చాళుక్యాభరణ, చాళుక్య మార్తాండ తిరుళమారి, పరమభట్టారక, పరమేశ్వర, పరసైన్య భైరవ, రణరంగభీమ, పృధ్వీవల్లభ, సత్యాశ్రయ కులతిలక, సాహసభీమ, సాహసాంక** అన్న బిరుదులు పొందాడు.

ఐదో విక్రమాదిత్యుడు, **చాళుక్యాభరణ, త్రిభువనమల్ల, పరమ భట్టారక, పరమేశ్వర, వల్లభ నరేంద్ర శ్రీపృధ్వీవల్లభ, సత్యాశ్రయకుల తిలక** అనే బిరుదులు ధరించాడు. రెండో జయసింహాడు, **కీర్తి విద్యాధర, కుమారగజకేసరి కోదండ చతుర్భుజ, గండరగండ** (శూరుల్లో మహాశూరుడు) **గండబంగార, గండరోళ్లండ, గూర్జర వజ్రపాత, చాళుక్యాభరణ జగదేకమల్ల, తేజమార్తాండ, పరమభట్టారక, పరమేశ్వర, భోజకుల కాలానల, మల్లకామోద, మార్వడభీమ, మాళవ నిర్మూలన, రాజేంద్రచోళ మదభంజన, విక్రమసింహ, సత్యరత్నాకర, సత్యాశ్రయ కులతిలక, సప్తకొంకణాధీశ్వరుడు** అనే బిరుదులను ధరించాడు.

మొదట సోమేశ్వరుడు, **అహవమల్ల, చాళుక్యాభరణ, త్రైలోక్య మల్ల, దానకర్ణ, నాటిక భరత కలా నిపుణ, పరమభట్టారక, పరమేశ్వర, మహారాజాధిరాజ, శ్రీపృధ్వీవల్లభ, సత్యాశ్రయ కులతిలక** అనే బిరుదులను పొందినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. రెండో సోమేశ్వరునికి, **అమ్మన గంధవారణ, కటకప్రాకార, కుమార మార్తాండ, చాళుక్య చూడామణి చాళుక్యాభరణ, దానకర్ణ, పరమ భట్టారక, పరమేశ్వర, పరివార నిదాన భువనైకమల్ల, మాండలిక శిరోమణి, రూపమనోజ, రిపునృపతి హృదయశల్య, విద్విష్టసంహార, వేంగిపురవరేశ్వర, శ్రీపృధ్వీవల్లభ, సత్యాశ్రయ కులతిలక, సమర ప్రచండ, హయవత్సరాజ** (గుర్రం ఎక్కడంలో వత్సరాజంతటివాడు) అనే బిరుదులున్నాయి.

కళ్యాణచాళ్యుల్లో ప్రశస్తి పొందిన ఆరో విక్రమాదిత్యునికి, **కొంకణకణాంక్యణ, భయంకర, చాళుక్య కంఠీరవ, చాళుక్యగంగ పెర్మాడి, చాళుక్య చక్రశ్వర, చాళుక్యనారాయణ, చాళుక్యా భరణ, చాళుక్యవంశలలామ, జయదుత్తరంగ, త్రిభువనమల్ల, నన్నయగంగ, నరపాలభయంకర, నిత్యభూమి దానలోల, పరమబట్టారక పరమేశ్వర, పాండ్యకులచండమారుత, పృధ్వీవల్లభ, పృధుధరా శ్రీవల్లభ, మహారాజాధిరాజ, యాదవ బలజలధి బడబానల, రాజగజకేసరి, రాయదేవేంద్ర, రాయనారాయణ, రాయసర్వజ్ఞ, విక్రమాంక, శ్రీ పృధ్వీవల్లభ, సత్యాశ్రయ కులతిలక సేవుణరణ, భీషణసామంత హరణ శార్దూల** అనే బిరుదులున్నాయి.

జయసింహునికి **అణ్ణనంకకార, కదనత్రినేత్ర, చాళుక్య చూడామణి, జయలక్ష్మి రమణ, త్రైలోక్యమల్ల, పల్లవాన్వయ, మత్తగజాంగ రాజ రాజపరమేశ్వర, రిపురాయకటక చూరకార, వీరమహేశ్వర విక్రమాభరణ, వీరనొలంబ పల్లవ పెర్మాడి, శరణాగత రక్షామణి, సహజమనోజ** అనే బిరుదులున్నాయి.

ఆరో విక్రమాదిత్యుని కొడుకైన మల్లికార్జున దేవుడు తర్దవాడి

–1000 ప్రాంతపాలకునిగా ఉండి, **కుమారంకభీమ, గిరివజ్రదండ, చాళుక్యాన్వయ ప్రసూత, త్యాగవినోద, బప్పనంకకార, శరణాగత వజ్రపంజర, సకలకళాధర, సాహసమల్ల** అనే బిరుదులను ధరించాడు. మూడో సోమేశ్వరుడు, **కోదండ చతుర్భుజ, చక్రరాజ, చక్ర కూటాధీశ్వర, చాళుక్యాభరణ, త్రిభువనరంగ, ద్వాదశమండలిక మార్తాండ, పరమభట్టారక, పరమేశ్వర, ప్రవర్తితకీర్తి నర్తనర్తన సూత్రధార, బప్పన గంధవారణ, భూలోకమల్ల, మహామండలేశ్వర, మూరురాయకలికువర, రక్షదక్ష దక్షణ దొర్దండ, విజయలక్ష్మీ నివాస, వీరమహేశ్వర, శరణాగత వజ్రప్రాకార, శ్రీ పృధ్వీవల్లభ, సత్యాశ్రయ కులతిలక, సర్వజ్ఞ చక్రవర్తి సర్వజ్ఞనృప** అనే బిరుదులు పొందాడు.

అతని తరువాత రాజైన రెండో జగదేకమల్లుడు **ఉద్దామ ప్రతాప, చాళుక్య వంశలలామ, చాళుక్య ప్రతాప చక్రవర్తి, చాళుక్యాభరణ, త్రిభువన మల్ల, పరమభట్టారక, పరమేశ్వర, పెర్మాడిదేవ ప్రతాప చక్రవర్తి, పృధ్వీవల్లభ, భూలోకమల్లదేవ, వసుధామ, సత్యాశ్రయ కులతిలక, సర్వజ్ఞచక్రవర్తి** అనే బిరుదులను వహించాడు.

మూడో తైలపుడు, **చాళుక్యాన్వయ తిలక, చాళుక్యాభరణ, త్రిభువనమల్ల, త్రైలోక్యమల్ల, నూర్మడితైలప, నూర్మడిత్రైలోక్యమల్ల, పరమభట్టారక పరమేశ్వర, పృధ్వీవల్లభ, రక్కసగంగ చాళుక్యచక్రవర్తి, సత్యాశ్రయకుల తిలక** అనే బిరుదులను ధరించగా, నాలుగో సోమేశ్వరుడు, **అహవమల్ల, కలాచూర్య కులనాశక, చాళుక్య ప్రతాప చక్రవర్తి, చాళుక్య రాజ్య సముద్ధరణ చాళుక్యాభరణ, త్రిభువనమల్ల, పరమభట్టారక, పరమేశ్వర, వీరనారాయణ, సత్యాశ్రయ కులతిలక** అనే బిరుదులను పొందాడు.

రాజకుటుంబానికి చెందిన మహిళలు, రాణులు కుడా వారి గుణగణాలను బట్టి బిరుదులు పొందినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. వీరిలో రెండో తైలపుని, మహామండలేశ్వరుడైన పెర్మాడి భార్యలక్ష్మబ్బరసి, **ద్వితీయలక్ష్మీసమాన, సమస్త ఫలభోగభాగిని** అన్న బిరుదులను పొందింది. రెండో తైలపుని మహాసైన్యాధిపతి నాగదేవన పత్ని అత్తియబ్బరసికి **కటకపవిత్ర, కవివర కామధేనువు, గుణదంక కార్తి, అకళంకచరిత, జినధర్మపతాకి, జినశాసనరక్షామణి, జినశాసన రుచి, జైనసమయైక శిరోమణి, దానచింతామణి, మహాసతికులతిలక, శౌచి, సర్వజీవరక్షామణి, సర్వకళావిద** అనే బిరుదులున్నాయి. నాలుగో విక్రమాదిత్యుని భార్య రుక్మాదేవికి, **అగణితదానచింతారుడు, ఉద్దండరు భైరవి, గుణదబెడంగి, దీననాధచింతామణి, ద్వితీయలక్ష్మీ సమాన, రణభైరవి, వివేక చూడామణి** అనే బిరుదులున్నాయి. రెండో జయసింహుని రాణి మహాదేవికి, **ద్వితీయలక్ష్మి సమాన** అనే బిరుదుంది. రెండో జయసింహుని మహారాణి, సుగ్గలదేవికి, **ఆశ్రితజన కల్పలత, కలికాల సరస్వతి, ద్వితీయలక్ష్మి, రూపవిద్యాధరి, విశిష్టజన కామధీను, సమస్త ఫలబోగభాగిని** అనే బిరుదులున్నాయి. మొదట సోమేశ్వరుని భార్య మైలలదేవికి **దానచింతామణి, ద్వితీయలక్ష్మి, విలాసవిద్యాధరి, సమస్తాస్తపుర ముఖమంగున సవతిమదభంజన, సహస్రఫలభోగభాగిని** అనే బిరుదులున్నాయి.

మొదటి సోమేశ్వరుని మరోభార్య **గౌరిక్కబ్బికి, భువన విద్యాధరి, వివేక చూడామణి, సంగీత ప్రసంగవిదేక చూడామణి, సకళకళాధరి, సరస్వతి కర్ణాతంస** అనే బిరుదులున్నాయి. ఆరో విక్రమాదిత్యుని భార్య కంచల మహాదేవి, **అభినవసరస్వతి, శృంగార విద్యాధరి, సకల కళాధరి** అని, మరోభార్య అభినవ శీతలమహాదేవికి **అభినవ సరస్వతి, దయాదాన ధర్మోద్యోగిని, సవతి మృగశార్దూల** అనీ, మరో భార్య చందలదేవి, **అదబల సరస్వతి** (పాకశాస్త్ర కోవిద) **అభినవ సరస్వతి, కలికాల సరస్వతి, గౌరిపదాంబుజారాధకి, దుష్టదర్పిప్పు సవతి శిరోవజ్రముష్టి, నృత్యవిద్యాధరి, మలప విద్యాధరి** (వాద్య, వాదన, నర్తన, విద్యాలలో మేటి) **సకల కళాధరి, సవతిశిరోవజ్రముష్టి** అనే బిరుదులను పొందారు. ఆరో విక్రతూదిత్యుని మరో భార్య లక్ష్మాదేవి, **దానచింతామణి, ప్రత్యక్షలక్ష్మి, సకలకళాధరి, సవతి మద భంజన** అనే బిరుదులున్నాయి. అతని మరో ధర్మపత్ని చిన్న శీతల దేవికి **అభినవసరస్వతి, సంగీతవిద్యాధరి, సకలకళాధరి, సవతిమృగ శార్దూల అనీ, మరో భార్య జాకలదేవికి, అభినవసరస్వతి, కదంబ చూడామణి, కలికాలపార్వతి, చతుర్విధదాన చింతామణి, దాన వినోద, మృగదా వినోద** (కస్తూరి లాంటి సుగంధాలను ఇష్టపడేది), **సకల కళాధరి** అనే బిరుదులు, అతని మరో భార్య మైలలదేవికి **కలి కాలసరస్వతి, సాహస విద్యాధరి, సకలకళావతి, సహస్రఫలభోగ భాగిని** అన్న బిరుదులున్నాయి. ఆరో విక్రమాదిత్యుని ఇంకోరాణి మన్నాదేవికి **అభినవపార్వతి** అనీ, అతని పట్టపు రాణి మలయమతి దేవికి **అభినవసరస్వతి, గోత్ర రత్నప్రదీప, చతురకలాప, మృదు మధురవచన రచన, శుభలక్షణ లక్షితాంగి** అన్న బిరుదులు, అతని మరోభార్య బాచలదేవికి **అరిబిరుదపాత్ర జగదళి, చతుర వినోద,** ఇంకోభార్య పద్మలదేవికి **ఆర్తిజన చింతామణి, అభినవసరస్వతి, దానవినోద, ద్వితీయలక్ష్మీసమాన, పతివ్రతారుంధతి, పరివార కల్పలత, ప్రత్యక్షపార్వతి, రూపవిద్యాధరి, లావణ్యలీలాంకృత, సకల కళాధరి, సహస్రఫలబోగభాగిని** అనీ, అతని మరోభార్య మల్లణదేవికి **కళాకోవిద** అనీ, మరో రాణి అబ్బదేవికి **ద్వితీయలక్ష్మీసమాన, కస్తూరికామోద, దానవినోద, సకలకళాధరి** అనే బిరుదులున్నాయి. రాజులు, రాణుల బిరుదులు వారి ప్రతాపం, గుణగుణాలకు అద్దం పడుతున్నాయి. ❋


## 'అమ్మనుడి' లభించుచోట్లు

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా,
కాచిగుడా. **హైదరాబాదు – 500 027.**
ఫోన్ :040–24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు
(ఏలూరు రోడ్డు) **విజయవాడ – 520 002.**
ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్,
**నెల్లూరు**–1. ఫోన్:7386223538.

-వుప్పల నరసింహం
సీనియర్ జర్నలిస్టు, సెల్ : 99857 81799

# ఈ కాలపు జాతిరత్నం రాజీవ్ దీక్షిత్

**మాతృభూమి, మాతృభాషపై అమితమైన ప్రేమను వ్యక్తం చేసినవాడు రాజీవ్ రాధేశ్యామ్ దీక్షిత్. స్వదేశీ విజ్ఞానంపై, పరిజ్ఞానంపై అపారమైన విశ్వాసం గల వ్యక్తి ఆయన. స్వాతంత్ర్యానంతరం పుట్టిన వాళ్ళలో ఆయనలా భగత్‌సింగ్‌ను మరెవరూ ప్రేమించలేదేమో! భగత్‌సింగ్, చంద్రశేఖర్ లాంటి విప్లవ వీరుల స్మరణతో వర్తమాన కాలంలో దేశాన్ని, భాషని, స్వదేశీవస్తువులను, వైద్యాన్ని ప్రేమించేలా ప్రజల్ని పురికొల్పిన గొప్ప వక్త ఆయన.**

1983 ప్రాంతంలో భోపాల్‌గ్యాస్ దుర్ఘటన సమయంలో వేలాదిమంది మరణం, అనంతరం దాని పర్యవసానంగా లక్షమంది వరకు మరణించడాన్ని సహించలేక పోయిన విద్యార్థి రాజీవ్ దీక్షిత్ బహుళజాతి సంస్థల బండారాన్ని బయటపెట్టే ఆందోళనకు అంకురార్పణ చేసి జాతిని మేల్కొల్పాడు. బాధితులకు నష్టపరిహారం ఇప్పించడమేగాక 'గ్యాస్‌లీక్' అయిన 'యూనియన్ కార్బయిడ్' కంపెనీని దేశంనుంచి తరిమికొట్టాడు.

అదో అక్కడ ప్రారంభమైన రాజీవ్ దీక్షిత్ ప్రస్థానం అనంతరం దేశవ్యాప్తమైంది. ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన రాజీవ్ దీక్షిత్ అపారమైన జ్ఞాన సంపన్నుడు. ఎం.టెక్ పూర్తిచేశాడు. తన ముందు తన జీవితంగాక భోపాల్ గ్యాస్ బాధితులు, అలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోట్లాది ప్రజల జీవితాలు, వారి కష్టాలు కనిపించాయి. దేశ స్వాతంత్ర్యం ప్రమాదంలో, ముఖ్యంగా బహుళజాతి కంపెనీల ఉచ్చులో ప్రజలు చిక్కుకుంటున్నారని గ్రహించి అవిషయాన్ని విశదంగా వివరించే పనిని చేపట్టారు. "స్వాతంత్ర్యాన్ని రక్షించండి" అన్న పేరుతో ఉత్తరాదిన పెద్ద ఆందోళన లేవనెత్తారు.

ఆయన ప్రతిమాట ఒక తూటా... అనర్గళంగా ప్రసంగించే ధోరణి. అద్భుతమైన హిందీభాష.. తిరుగులేని గణాంకాలు, ఎవరూ తోసి పుచ్చలేని సాక్ష్యాలు, దేశంకోసమే తన జీవితం అన్న ఆయన తిరుగుబాటు బావుటా ఎగరేశారు. అప్పుడు ఎవరీ రాజీవ్ దీక్షిత్?..... అని యావత్ దేశం ఆయన వైపు చూడసాగింది. ఉత్తరాదిన ఆయన ప్రభంజనం వీచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన పర్యటించారు, ప్రసంగాలు చేశారు. ఆయన దేశభక్తిని, ప్రజలపై గల ఆర్తిని, స్వదేశీ పరిజ్ఞానంపై ఆయనకుగల పట్టుని, దేశీయ వైద్యమైన ఆయుర్వేదాన్ని, మూలికావైద్యాన్ని, ప్రతి ఇంటి వంటింట్లో లభించే ఔషధగుణాలు గల వస్తువుల గూర్చి ప్రసంగిస్తూ ఉంటే శ్రోతలు మంత్ర ముగ్ధులై మైమరచి పోయారు.

ఎం.టెక్ చదివిన వ్యక్తి భారతదేశ చరిత్ర, భారతదేశ స్వావలంబిన, "బంగారు పిచ్చుక" లాంటి ఈ దేశంపై విదేశీయుల కన్ను ఎలా పడింది?...వారెలా దేశంలో ప్రవేశించి వందల సంవత్సరాలపాటు ఎలా దోచుకుని దేశాన్ని పిప్పిచేశారో డాక్యుమెంటరీ



ఆధారాలతో పాటు ప్రసంగించడం, అందరినీ ఆకట్టు కోవడం అద్భుతంగాక ఏమవుతుంది?

జీవితమంటే రాజీపడటంకాదు...ప్రశ్నించడం అని తన ప్రసంగాల ద్వారా యువతను మేల్కొల్పిన సాహసి రాజీవ్ దీక్షిత్. భారత దేశం ఎప్పుడూ పేదదేశం కాదు...మన భాష, సంస్కృతి, సంప్రదాయాలు హీనమైనవి కావు, సర్వోత్కృష్టమైనవని విదేశీయుల రచనలను, వారి పర్యటన సందర్భంలో నిక్షిప్తమైన ఒప్పందాలు, నిజానిజాలపై చేసిన రచనలను ఉటంకిస్తూ ప్రతిరాష్ట్రంలో ఆయన చేసిన ప్రసంగాలు కొత్త ఉత్తేజాన్ని యువతలో నింపాయి.

స్వాతంత్ర్యం కోసం పోరాడి, సర్వం కోల్పోయినా విలువల కోసం, గౌరవం కోసం బతికిన తరం కనుమరుగైన అనంతరం కొందరు జీవితంలోని అన్ని రంగాలను భ్రష్టు పట్టించాక ఏర్పడిన నైరాశ్య సమయంలో స్వభాష, స్వదేశీ భావనలతో భాస్వరాన్ని మండించిన మహామేధావి రాజీవ్ దీక్షిత్.

ఆయన అనుమానాస్పద పరిస్థితిలో 2010 సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కన్నుమూశారు. అప్పటికి ఆయన వయసు కేవలం 43 సంవత్సరాలు. అంత తక్కువ సమయంలోనే ఆయన చరిత్ర సృష్టించారు.

దేశంలోనే గాక ప్రపంచంలోని పలుదేశాలు పర్యటించి అధ్యయనం చేశారు. మాతృదేశానికి సంబంధించిన రికార్డులను, పుస్తకాలను సేకరించారు. వాటిని సంవత్సరాల తరబడి అధ్యయనం చేసి సారాంశాన్ని ప్రజలముందు పెట్టారు. ఆ సమాచారం, విశ్లేషణ, జరిగిన అన్యాయం వింటే కళ్లు చెమర్చుతాయి. అంతటి బలమైన సాక్ష్యాధారాలను సేకరించారు.

వివిధ మాధ్యమాలద్వారా తన భావాలను, అలోచనలను ప్రజల ముందు పెట్టి వారిని ఆలోచించమని చెప్పారు. విద్యావంతుల్ని, మేధావుల్ని తన ప్రతిభతో వారి మస్తిష్కాల్లోని "తుప్పు" ను వదలగొట్టారు. ఆయన వాదనలను, సాక్ష్యాలను దేశంలోని ఏ రాజకీయ నాయకుడు, ఏ పార్లమెంట్ సభ్యుడు, ఏ ఆర్థిక వేత్త, ఏ పారిశ్రామిక వేత్త, ఏ సామాజిక కార్యకర్త తోసిపుచ్చలేదు. అంతటి బలమైన

గొంతుతో, గొప్ప నైపుణ్యంతో, ఆకర్షణీయ భాషాపటిమతో ఆయన ఆకట్టుకుని ఓక్షణం అందరూ "నిజమేకదా?" అని అనుకునేలా చేశారు.

స్వదేశీయత ఎలా విదేశీమోజులో కప్పబడుతున్నదో, స్వదేశీ భాషలు ఎలా నిరాదరణకు గురవుతున్నాయో, అది ఎంతటి ప్రమాదకరమో ఆయన అద్భుత విశ్లేషణ వింటే ఆంగ్ల భాషాభిమానులు సైతం నివ్వెర పోతారు. ప్రపంచంలో ఏ దేశమైనా, ఏ జాతైనా తమ మాతృభాషతో ఎలా ముందంజలో వున్నాయో సోదాహరణగా తన ప్రసంగాల్లో పేర్కొన్నారు. జాతి నిర్మాణంలో భాష ఎంత గొప్ప పాత్రను నిర్వహిస్తుందో కూడా ఆయన ప్రతిభావంతంగా పేర్కొన్నారు.

ఇలా ఒకటేమిటి... ఆయన స్పృశించని అంశంలేదు. అవకాయ దగ్గర నుంచి ఆంగ్లభాష పెత్తనం, దాష్టీకం వరకు సమస్త అంశాలపై ఆయన అవగాహన, విశ్లేషణ, చూపు, లోతైన దృష్టి అందరినీ కదిలిస్తుంది.

భారతదేశ సాంకేతిక పరిజ్ఞానంపై భారత ప్రజలకిప్పుడు చిన్నచూపు ఉండటాన్ని ఆయన సహించలేక పోయారు. భారత్‌లోని గొప్ప సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచంలో మరెక్కడాలేదని, సమస్త రంగాల్లో భారతదేశ మేధ ఉత్కృష్టమైనదని ఆంగ్లేయులు మనల్ని "బానిసలు" గా మార్చి ఆ సంపదను ఎలా తస్కరించారో చెబుతుంటే రోమాం చితులయ్యేవారు శ్రోతలు.

బ్రయిట్ బ్రదర్స్‌కన్నా ముందే ముంబయిలో ఆధునిక విమానాన్ని ఎగిరేలా చేసిన మహారాష్ట్ర వ్యక్తి దగ్గర డ్రాయింగ్‌లు, నమూనా, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒక కంపెనీ తస్కరించి దాన్ని ఎలా విదేశాలకు తరలించి, అనంతరం అదే తరహాలో విమానాన్ని నిర్మించి పేటెంట్ తీసుకోవడం.... ఆ తరువాత జరిగిన చరిత్రను ఆయన కళ్ళకు కడుతుంటే.... "ఇంత ఉదార స్వభావులమా మనం?" అని అనిపిస్తుంది. అలాంటి వంద లాది వివిధ రకాల విమానాల తయారీకి చెందిన స్వదేశీ పరిజ్ఞానం మన వద్ద ఉన్నా దాన్ని వెలుగు చూడకుండా చేయడం వెనుక గల అదృశ్యహస్తాల గూర్చి వింటే "వైరాగ్యం" తన్నుకొస్తుంది.

ఇది కేవలం ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఇలాంటి వందలాది అంశాల చిట్టా ఆయన రచనల్లో, ప్రసంగాల్లో దొర్లాయి. కొన్ని వందల సంవత్సరాల పూర్వమే తుప్పుపట్టని శ్రేష్టమైన ఇనుము (ఉక్కు)ను తయారు చేసి ప్రపంచానికి సరఫరా చేసిన చరిత్ర మనకుందని ఇప్పటి తరానికి ఆయన గుర్తు చేశారు. ఢిల్లీలో ఇప్పటికీ తుప్పుపట్టని ఇనుపస్తంభం ఉండటం దానికి సాక్ష్యంగా ఆయన చెబుతారు. ఇలా ఎన్నో రంగాలలో ప్రపంచానికి దారి చూపిన భారతదేశం "ఒట్టి పోవడం" దారుణమని భావించి, భావాల భాస్వరాన్ని మండించిన రాజీవ్ దీక్షిత్ ఎగుర వేసిన జండాను ముందుకు తీసుకెళ్ళేవారికి వీర గంధం తెచ్చి పూద్దాం.... వీరతాళ్లు కడదాం. ❋

## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి',**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ ప్రేమించలేదు..

పుస్తక సమీక్ష

# గురజాడకు కవితా నివాళి



ఒకప్పుడు అర్థంకాని గ్రాంధిక భాషే అచ్చమైన తెలుగుభాష అని పండితవర్యులు నిర్ధారించారు. గుక్కతిప్పుకోనివ్వని చేంతాడంత సంస్కృత సమాసభరిత శార్దూల, మత్తేభాల పద ఘట్టనతో తెలుగు సాహిత్య పూలవనం అప్పుచ్చిలా అణిగి పోయింది. అప్పుడు వ్యవహార భాషోద్యమాన్ని ప్రారంభించిన గిడుకుకు మద్దతుగా నిలిచిన కవి గురజాడ. సన్నజాజుల సౌకుమార్యాల, మల్లెపూల మాధుర్యాలొలికించే ముత్యాల సరాల ఛందస్సును సృష్టించారు. 'ఆటల పాటల పేటిక లారా! మేలిమి కన్నుల మెలతల్లారా!' అని పుత్తడిబొమ్మ పూర్ణమ్మ కన్నీటి కథ చెప్పి పాఠకుల హృదయాలను చెమరింపచేసిన కవి గురజాడ.

'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని అక్షరలక్షలు విలవచేసే దేశభక్తి గీతాన్ని రచించారు. ప్రపంచం చిన్నదౌతున్నకొద్దీ మనుషులమధ్య దూరాలు పెరిగిపోతున్నాయి. వారిమధ్య కనిపించని గోడలు మొలుస్తున్నాయి. అందుకే 'దేశమనియెడు దొడ్డ వృక్షం! ప్రేమలను పూలెత్తవలెనోయ్' మనుషులందరూ ప్రేమభావంతో మెలగాలని అన్నారు. అటువంటి మహాకవి గురజాడ శతవర్ధంతి సందర్భంగా డా॥వేదగిరి రాంబాబుగారు ప్రచురించిన కవితా సంపుటి 'అక్షర'. గురజాడ శతవర్ధంతి సందర్భంలో నూట ఏభైమంది కవులు సమర్పించిన కవితా నివాళి ఇది.

ఈ సంపుటిలో సంతకం అక్కర్లేకుండానే తమదైన ముద్రలు వేసిన ప్రముఖ కవుల కవితలు ఎన్నో ఉన్నాయి. దీనిలో గురజాడనుగురించిన కవిత లేకుండా వివిధ వస్తువులపై రచించిన కవితలున్నాయి. దాశరథి, శ్రీశ్రీ, తిలక్, చెరబండ రాజు, శేషేంద్ర శర్మ, కుందుర్తి, అద్దేపల్లి, అదృష్టదీపక్, శివారెడ్డి, సిధారెడ్డి, నగ్నముని, దేవీప్రియ, పాపినేని, దేశరాజు, మందరపు హైమవతి, అలిశెట్టి ప్రభాకర్‌ల కవితలున్నాయి.

ముఖ్యంగా గురజాడమీద 'గుత్తునా యని జాతిముత్యాల్ ।గుచ్చినాడే మేలిసరముల। ఇత్తునా యని తెలుగు దల్లికి। ఇచ్చినాడే భక్తితో!' అని కృష్ణశాస్త్రి రాసిన కవిత పరవశింపజేస్తుంది. తమకు ఇష్టమైన కవితలన్నీ ఒకచోట చదవడం పాఠకులకు మంచి అనుభవం.

ఈ సంపుటిలోని కవితలను సంకలనం చేసిన ఆ సుధామ గారికీ ప్రచురించిన శ్రీ వేదగిరి రాంబాబు గారికీ హృదయపూర్వక అభినందనలు. కవిత్వ ప్రేమికులకు ఇచ్చిన కానుక ఈ అక్షరమైన 'అక్షర' కవితా సంపుటి.

**-మందరపు హైమవతి,**
94410 62732

**-సంకేపల్లి నాగేంద్రశర్మ,** సీనియర్ జర్నలిస్ట్,
సెల్ : 94417 97650

# తెలుగు వీరోచిత తేజానికి రూపుగట్టిన గౌతమీపుత్ర "శాతకర్ణి"




**సాం**ఘిక చిత్రాన్ని, జానపద చిత్రాన్ని తీయడం సులభం. వేల సంవత్సరాల కిందటి రాజవంశపు పాలనను, నాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక సంస్కృతులను కలబోస్తూ, చారిత్రక చిత్రం తీయడ మంటే కత్తిమీదసాములాంటిదే. రెండువేల సంవత్సరాల నాటి శాత వాహన వంశానికి చెందిన తెలుగుతేజం, 23వ శాతవాహన చక్రవర్తి, యుద్ధవీరుడు గౌతమీపుత్ర "శాతకర్ణి" చారిత్రక చిత్రాన్ని వెండితెరపై ఆవిష్కరించడానికి చేసిన కృషిలో దర్శకుడి పాత్ర అమోఘంగా కనిపించింది. అసంపూర్తి చారిత్రక సమాచారాన్ని "చిత్రకథ"గా తీర్చిదిద్ది గమ్యం, వేదం, కంచె వంటి చిత్రాలు నిర్మించిన క్రిష్ ఈ చారిత్రక కథను మలచడానికి గట్టి కృషే చేశాడనిపించింది.

మౌర్య అశోకచక్రవర్తి పాలన తర్వాత శృంగులు, కణ్వుల తర్వాత దక్కన్, అమరావతి ప్రాంతాలలో స్వతంత్రరాజ్యం ఏర్పాటు చేసుకొని పరిపాలించినవారు శాతవాహనులు. క్రీ.పూ. 8వ శతాబ్దం నుండి క్రీ.శ. 2వ శతాబ్దం వరకు వీరు పరిపాలించి వుంటారని, 450 సంవత్సరాలపాటు, 30 మంది రాజులు పాలన చేశారని చరిత్ర కారులు భావిస్తున్నారు. అశ్మక, (తెలంగాణా- మహారాష్ట్ర ప్రాంతాలు) లసిక అనగా కృష్ణా గోదావరి నదుల మధ్య ప్రాంతం, మూలక (మహారాష్ట్ర) పైఠాన్ నగరప్రాంతం, దక్షిణ కథియావార్, ఉత్తర కొంకణ్, నర్మదానదీ తీర మహిష్మతీ, విదర్భ, తూర్పు మాళవము, అవంతి, పశ్చిమ మాళవప్రాంతాల వరకు వీరి పాలన విస్తరించిందని, అనేకురు రాజసూయ, అశ్వమేధ యాగాలు చేశారని, ప్రజారంజక మైన పాలనను అందించి తెలుగు వీరోచిత చరిత్రకు గట్టి పునాదులు వేశారని "బ్రాహ్మణ రాజ్యసర్వస్వం" అనే గ్రంథంలో ప్రముఖ చరిత్ర పరిశోధకులు కీ.శే.బి.ఎన్.శాస్త్రి వ్రాశారు. వీరి సమాచారం ఆధారం గానే శాతకర్ణి కథను రూపొందించి నట్లు "శాతకర్ణి" పాటల ఆవిష్కరణ సమ యంలో చిత్రదర్శకుడు ప్రకటించాడు. శాతవాహను లది జాతి, కులం, జన్మ స్థలం, కాలం మొ॥ విషయాలలో చరిత్రకారుల్లో ఏకాభి ప్రాయం లేదు. 79 రోజుల్లో 40 కోట్ల భారీ వ్యయంతో ఈ సినిమాను బాలయ్య వందవ చిత్రంగా తీశారు. 150వ చిత్రంగా చిరంజీవి 10 ఏళ్ళ విరామంతో నటించిన "ఖైదీనంబర్ -150", వర్తమాన హీరో శర్వానంద్ నటించిన చిత్రం "శతమానం భవతి" ఈ సంక్రాంతికి పోటా పోటీగా విడుదలై, వసూళ్ళతో సంచలనాలు సృష్టించటమే గాకుండా విజయాల బాటన పయనిస్తున్నవి.

శాతవాహనుల చరిత్ర మత్స్య, వాయు, బ్రహ్మాండ, భవిష్య, భాగవత పురాణాలలో లభిస్తున్నది. శ్రీకాకుళం (బందరు సమీపం) కేంద్రంగా వీరి పాలన సాగి, తదుపరి గుంటూరు సమీపంలోని అమరావతి ధాన్యకటకానికి బదిలీగావింపబడిందని, అమరావతిని రాజధానిగా చేసుకొని 23వ శాతవాహన రాజైన యజ్ఞశ్రీ శాతకర్ణి పరిపాలన సాగించినట్లు, ఇతడు క్రీ.శ. 104లో రాజ్యాధికారానికి వచ్చి 21 సంవత్సరాలు పాలన చేసినట్లు మత్స్య, వాయు పురాణాలు పేర్కొంటున్నట్లు కీ.శే బి.ఎన్.శాస్త్రి గారు తన గ్రంథంలో రాశారు.

శాతవాహనుల మూల వంశస్థాపకులుగా పేర్కొంటున్న శ్రీము ఖుని (చిముకుడు) నాణాలు భారతదేశంలో మరెక్కడో కాకుండా కరీంనగర్ పూర్వజిల్లాలోని కోటిలింగాలలో దొరకడంవల్ల, శాత వాహనుల పాలన కోటిలింగాలనుండే ప్రారంభమై మహారాష్ట్ర, కృష్ణ-గోదావరి దక్షిణ భారతదేశంతో సహా కొంత ఉత్తరాది ప్రాంతా నికి విస్తరించిందని చరిత్రకారుల భావిస్తున్నారు. 1978లో ధర్మపురి చరిత్రకారుడైన క్రీ.శ. సంగనభట్ల నరహరిశాస్త్రికి కోటిలింగాలలో ఈ దొబ్బనాణాలు దొరకడంతో, శాతవాహనుల చరిత్రతో అనూహ్య మార్పులకు అవకాశమేర్పడింది. శ్రీముఖుడు 28 సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు.

ప్రస్తుతాంశమేమిటంటే గౌతమీపుత్ర శాతకర్ణి సింహాసనమధి ష్ఠించే నాటికి శాతవాహన సామ్రాజ్యం చాలామటుకు పరాయి రాజుల పాలనలో వుంది. వింధ్య ఆవల ప్రాంతాలలో వున్న షహరామరాజుల రాజు నహపాలుడిని ఎదిరించడానికి గౌతమీపుత్ర శాతకర్ణికి 17 సంవత్సరాలు పట్టింది. కోల్పోయిన భూభాగాలను తిరిగి యుద్ధాల ద్వారా స్వాధీనం చేసుకొని, దక్కన్‌లో పూర్తిగా ఆధిపత్యం పొందాక,

రాజసూయ, అశ్వమేధ, వాజపేయ యుగాలు చేసి, చక్రవర్తిగా ప్రకటించబడి, తల్లి అయిన గౌతమి బాలశ్రీకి యాగంలో అగ్రతాంబూలం ఇచ్చి, తల్లిపట్ల, తన రాజ్యాధికారం పట్ల వున్న మక్కువను ప్రకటిస్తాడు. తిరిగి కోల్పోయిన శాతవాహన వంశ ప్రతిష్టను నిలబెట్టిన గౌరవం గౌతమీపుత్రకు దక్కింది.

తెలంగాణా ప్రాంతంలోని కోటిలింగాల, కొండాపూర్, పెద్దబొంకూరు, ఖమ్మంమెట్, అమరావతి, మహారాష్ట్ర లోని పైథాన్, కర్ణాటక లోని సన్నాసి ప్రాంతాలలో శాతవాహన రాజుల నాణాలు, అప్పటి కాలపు విదేశీవాణిజ్యపు రోమన్ రాజుల నాణాలు లభించాయి, కోటిలింగాలలో 890 కొండాపూర్‌లో 9,500, పెద్ద బొంకూర్‌లో 23 వేలు, ఖమ్మంమెట్‌లో 7 వేల నాణాలు దొరికాయి. అమరావతిలో దొరికిన ఒక నాణెం గౌతమీపుత్ర శాతకర్ణిదికాగా, కోటిలింగాలలో చిముకునికి చెందిన నాణాలు లభించాయి. శాత వాహనులు దక్కన్ ప్రాంతవాసులేనని, దక్కన్‌లో రాజకీయ, సాంస్కృ తిక జీవనం వీరితో ప్రారంభమైందని, వైదిక- బౌద్ధమతాలకు ఆలం బనగా నిలిచారని ప్రముఖ నాణేల పరిశోధకుడు డా॥దేమె రాజిరెడ్డి ఇటీవల వెల్లడించారు. దక్షిణాపథంలో విశాల సామ్రాజ్యాన్ని స్థాపించారని పేర్కొన్నారు.

గౌతమీపుత్ర శాతకర్ణికి చెందిన వివరాలు తల్లి నాసిక్‌లో వేయించిన నాసిక్ శాసనం తెలియచెబుతోంది. ముంబై సమీపంలోని కన్హేరి గుహలు, అజంతా, ఎల్లోరా గుహలు, పూనావద్దగల గుహల్లో గౌతమీపుత్ర శాతకర్ణికి చెందిన నాగానిక నానాఘట్ శాసనాలున్నాయి. క్రీ.పూ. 58 నుండి విక్రమశకం ప్రారంభంకాగా, క్రీ.శ. 78 నుండి శాతవాహన లేదా శాలివాహన శకం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. శకప్రారంభ విషయమై, బాలయ్య నటించిన శాతకర్ణి చిత్రంలో కొంత కల్పిత సమాచారాన్ని చేర్చారని, శాతకర్ణి విడుదలైన తర్వాత కొందరు చరిత్రకారులు తమ అభ్యంతరాలను లేవదీశారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని చిత్ర దర్శకుడు క్రిష్ వివరణ ఇస్తూ, చిత్రంగా మలచడంలో కొంతకథ అల్లక తప్పదని అన్నాడు. మల్లీశ్వరి, మహామంత్రి తిమ్మరుసు, ఇటీవల విడుదలైన రుద్రమదేవి, బాజీరావ్ మస్తానీ తదితర చారిత్రిక సినిమాలలో కొంత కల్పితం వుండటాన్ని చిత్ర విమర్శకులు ప్రస్తావిస్తున్నారు.

గౌతమీపుత్ర యిజ్ఞశ్రీ శాతకర్ణిగా బాలకృష్ణ ధీరోదాత్తమైన నటనను ప్రదర్శించి, తెలుగుతేజాన్ని పునర్జీవింపజేశాడు. ప్రాచీన యుద్ధ తంత్రాలు శాతకర్ణి గెలుపుకు అవి ఎలా దోహదం చేశాయో చిత్రదర్శకుడు చూపించిన విధానం ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. పద్మవ్యూహం, ఇతర ప్రాచీన యుద్ధ తంత్రాలను సేకరించి, నైపుణ్యంతో దృశ్యీకరించిన తీరు అద్భుతం. "కంచె" రెండవ ప్రపంచయుద్ధ కాలపు ప్రేమ కథను సమగ్రంగా, అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు "క్రిష్" మరింత శ్రద్ధతో శాతకర్ణిలో తమ ప్రతిభాపాటవాలను చొప్పించి, ప్రాచీన యుద్ధతంత్రాలను కళ్ళకు కట్టినట్లు చూపించిన తీరు ప్రశంసనీయం. వీదేశీరాజు డెమిట్రస్‌తో జరిగిన యుద్ధదృశ్యాలు దర్శకుడిని, బాహుబలి తర్వాత వచ్చిన శాతకర్ణిలో ఆహార్యం, అభినయనం, యుద్ధ దృశ్యాలలో బాలకృష్ణ పోటీపడి నటించారని సినీ పండితులు ప్రశంసించారు. సిఎం చంద్రబాబు నాయుడు, బాహుబలి దర్శకుడు రాజమౌళి తదితరులు బాలయ్య బాబు నటనకు బ్రహ్మరంధం పట్టారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలు వినోదపన్నును మినహాయిస్తున్నట్లు ప్రకటించాయి. గౌతమీపుత్ర శాతకర్ణి తల్లిగా బాలశ్రీగా హేమమాలిని, భార్యగా శ్రియ, మిగిలిన పాత్రల్లో శుభలేఖ సుధాకర్, తనికెళ్ళ భరణి తమపాత్రలను చక్కగా పోషించారు.నాయకిగా శ్రియ గ్లామర్‌గా కనిపించింది. వస్త్రధారణ (ఆహార్యం), కేశాలంకరణ, గుర్రాలు, ఏనుగులు, సైన్యం, డాళ్ళు, ఆయుధాలు, భారీ సెట్టింగ్‌ల రూపకల్పన గొప్పగా ఉంది. 33 గణరాజ్యాలను ఏకంచేయడానికి 33 రాజుల కత్తులను కరిగించి, ఒకే కత్తిగా తయారు చేయించి, శాతకర్ణి ఆ కత్తితో రిమట్రస్‌ను సంహరించడంలో చిత్రంలో హైలెట్‌గా నిలవడమే కాకుండా, "బడుగు జాతికాదు తెలుగు జాతి" అనే ఉద్వేగాన్ని ప్రేక్షకుల్లో కలుగజేస్తాడు. శకపురుషుడిగా అవతారమెత్తినట్లు కనిపిస్తుంది.

ఎ.ఎస్. జ్ఞానశేఖర్ కెమెరా పనితనం, చిరంతన్‌భాట్ సంగీతం చిత్రంలో పోటీపడ్డాయి. సహజత్వానికి దగ్గరగా వుండటానికి జార్జియా, మొరాకోవంటి విదేశాలలోని లోకేషన్లలో చిత్రీకరించినట్లు చిత్ర నిర్మాతలు ప్రకటించారు. భైరవద్వీపం, బాపు దర్శకత్వంలో వచ్చిన రామరాజ్యం, పాండురంగ మహాత్మ్యం తర్వాత బాలయ్య నటించిన చిత్రాల జాబితాలో ఈ వందవ సినిమా చేరిపోయినట్లే. శాతకర్ణి చిత్రంలో యుద్ధ దృశ్యాలు ఎక్కువగా ఉన్నాయన్న విమర్శలు వచ్చాయి, చిత్రం సగటు ప్రేక్షకుడిని ఆకట్టుకునే ధోరణిలో వుందన్న ప్రశంసలు అందాయి. బౌద్ధసన్యాసి ఆనందుడిగా కన్నడహీరో శివరామ్‌కుమార్, నహపాలరాజుగా హిందీ నటుడు కబీర్‌బేడీ, దూతగా తనికెళ్ళ భరణి నటనలు ఆకట్టుకుంటాయి.

అసంపూర్తి కథ, యుద్ధదృశ్యాల జోరు వంటివి పక్కన బెడితే తెలుగుతేజాన్ని రగిల్చిన చిత్రం గౌతమీపుత్ర శాతకర్ణియని చెప్పక తప్పదు.

**విమర్శ :**

చారిత్రిక అసత్యాలను చేర్చి, చరిత్ర విషయాలను కనుమరుగు చేసి శాతకర్ణి చిత్రాన్ని తీశారని, ఇది చారిత్రక చిత్రంకాదని కల్పితంతో నిర్మించబడిందని వాయిస్ ఆఫ్ తెలంగాణా, హైదరాబాద్ దక్కన్ డెమాక్రటిక్ అలయన్స్, తెలంగాణా డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. శాతకర్ణి భారత దేశం మొత్తం పాలించినట్లు చూపారని, కాని పశ్చిమ దక్కన్ పీఠ భూమి ప్రాంతాన్ని మాత్రమే పాలించారని, గ్రీకు రాజు తిమిట్రస్ క్రీ.పూ. 312 కు చెందినవారని, అతనికి శాతకర్ణి సమకాలిక విరోధి కాదని వీరి విమర్శ. శాతవాహనులు మహారాష్ట్రకు చెందిన వారని చెప్పడం సరికాదని, వీరి మూలాలు కోటిలింగాలలోనే ఉన్నాయని మరికొంతమంది విమర్శకులు వాదిస్తున్నారు. శాలివాహన శకానికి, గౌతమీపుత్ర శాతకర్ణికి సంబంధం లేదని వీరు అంటున్నారు. ఎక్కడా చరిత్రలో రాయబడింది లేదని అన్నారు.

కోటిలింగాలలో గాని, అమరావతి, కృష్ణాతీరంలో కాని, ఘంటసాల తదితర ప్రాంతాలలో షూటింగ్ ఎందుకు జరుపలేదని విమర్శకులు తప్పుపడుతున్నారు. ❊

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362






## విశాఖపట్నం : వేమనను తెలుగు జాతీయకవిగా ప్రకటించాలి

జనవరి 18 బుధవారం విశాఖపట్టణంలోని పౌరగ్రంథాలయంలో ప్రజాకవి వేమన జయంతిసభ జరిగింది. సభకు డా॥యం.విజయగోపాల్ అధ్యక్షత వహించగా, అ.భా.సాహిత్యపరిషత్ విశాఖపట్టణం శాఖ అధ్యక్షులు డా॥డి.వి.సూర్యారావు ప్రారంభోపన్యాసం చేశారు. వేమన తాత్త్విక చింతనను విశ్లేషిస్తూ, వేమన నిరంతర అన్వేషి అనీ, దార్శనికుడనీ, ఆయన సందేశం ప్రపంచం అంతటికీ వర్తిస్తుందనీ, ఆయన అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న 'అమ్మనుడి' సంపాదకులు డా॥సామల రమేష్‌బాబు ప్రసంగిస్తూ, వేమన తెలుగుజాతీయ కవి అనీ, అంతటి తాత్త్వికవేత్త నడయాడిన ఈ నేలపై తల్లిభాష తెలుగును పాలకులు అణచివేస్తున్నారనీ, ఈ పరిస్థితినుంచి జాతిని కాపాడుకోవాలని కోరారు. ప్రాథమిక విద్యను కూడా పరభాషలోకి నెడుతున్న పాలకులు ప్రజాస్వామ్యాన్ని, ప్రజలను వంచిస్తున్నారనీ అన్నారు. డా॥కె.మలయవాసిని, డా॥ఉదయభాస్కరరెడ్డి, శ్రీ పరవస్తు ఫణి ప్రసంగించారు. నగర ప్రముఖులు, వయోవృద్ధులు శ్రీ సి.ఎస్.రావు గారిని ఘనంగా సత్కరించారు. బాలబాలికలచే వేమన పద్యపోటీ నిర్వహించారు. శ్రీ రాజా చిన్నబాబు, శ్రీ పి.కన్నయ్య(సమైక్య భారతి), శ్రీయుతులు జి.జ్యోతి, జె.లక్ష్మి, టి.జ్యోతి(ప్రజాస్పందన) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## డా॥సామల రమేష్‌బాబుకు
## కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి (గుంటూరు) అభినందన సత్కారం






జనవరి 30 సోమవారం గుంటూరులో- రాయపాటి వెంకట రంగారావు విద్యాకళాశాల, కవిరాజు త్రిపురనేని సాహితీసమితి సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య సమాగమం జరిగింది. సభకు సమితి గౌరవాధ్యక్షులు శ్రీ గద్దే మంగయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా మాజీ మంత్రివర్యులు శ్రీ డొక్కా మాణిక్యవరప్రసాద్ పాల్గొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బౌద్ధ అధ్యయన కేంద్ర ఆచార్యులు చల్లపల్లి స్వరూపరాణి బౌద్ధం- నాగార్జునుని కృషి గురించి ప్రత్యేక ప్రసంగం చేశారు. ప్రొ॥ దిగుమర్తి భాస్కరరావు, ప్రొ॥రాజశేఖర్, ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు, అమ్మనుడి సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబుకు అభినందనపూర్వకంగా ఆత్మీయ సత్కారం చేశారు. సత్కార గ్రహీతను డా॥వెన్నిసెట్టి సింగారావు పరిచయం చేశారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ మాతృభాషతోనే అన్నిరంగాల్లో ఒక జాతిగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో భాషారాష్ట్రం ఏర్పడిందని, ఇంతటి ఆశయాన్ని పాలకులు వమ్ము చేశారని చెప్పి, విద్యలో, పాలనలో మాతృభాషకోసం పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రీ వల్లూరి తాండవకృష్ణ వందన సమర్పణ చేశారు. రచయిత, మేధావి శ్రీ రావెల సాంబశివరావు తొలుత స్వాగత వచనాలు పలికారు. సమితి సభ్యులు, భాషోద్యమకారులు, నగర ప్రముఖులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

AMMANUDI (Telugu Monthly)
February 2017, Vol.2, Issue 12
Date of publication : 1st of every month
Date of posting : 4th of every month
RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

Bommidala
International

## అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం-2017
## శుభాకాంక్షలు



# బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎగుమతి సంస్థ

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com